సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 259

మంగళవారం 10-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




‘పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు’



గత సంవత్సర విజేత చేతుల మీదుగా మిస్ యూనివర్స్ కిరీటాన్ని అందుకుంటున్న జొజిబిని తుంజి

నలుపు సౌందర్యం కాదనుకునే లోకమా

## నేటితో నువ్వు మారు

మిస్ యూనివర్స్‌గా జొజిబిని తుంజి

“ఈ ప్రపంచం నలుపును ఎలా చూస్తుందో నాకు తెలుసు. నాలాంటి తల వెంట్రుకలు, చర్మపు రంగు ఉన్నవారిని ఎలా వ్యాఖ్యానిస్తారో నాకు తెలుసు. ఈ రోజుతో ఆ అభిప్రాయాలన్నింటికీ చెల్లుచీటీ పాడండి” – జొజిబిని తుంజి

- ఫ్యామిలీలో

# పౌరసత్వ సవరణ బిల్లుకు ఆమోదం

- లోక్‌సభలో వాడివేడి చర్చ
- సుదీర్ఘ సమాధానమిచ్చిన హోం మంత్రి అమిత్ షా
- భారతీయ ముస్లింలకు ఈ బిల్లుతో సంబంధం లేదని స్పష్టీకరణ
- మోదీ ప్రధానిగా ఉన్నంత వరకు మైనారిటీలు ఎలాంటి భయాలు పెట్టుకోవద్దని హామీ

“☛ భారతీయ ముస్లింలకు ఈ బిల్లుతో ఎలాంటి సంబంధం లేదు. భయాందోళనల వాతావరణాన్ని విపక్షమే కల్పిస్తోంది.

☛ త్వరలో దేశవ్యాప్తంగా ఎన్నార్సీని అమలు చేస్తాం. పౌరసత్వ బిల్లు తరువాత ఎన్నార్సీనే.

☛ మత ప్రాతిపదికన దేశ విభజన జరిగి ఉండకపోతే.. ఇప్పుడు ఈ బిల్లు తీసుకు రావాల్సిన అవసరమే ఉండేది కాదు.

☛ రాజ్యాంగంలోని అధికరణ 14 అందించే సమానత్వ హక్కుకు ఈ బిల్లు విఘాతం కాదు.

☛ రోహింగ్యాలకు ఎట్టి పరిస్థితుల్లో భారత పౌరసత్వం ఇవ్వబోం.”

కేంద్ర హోం మంత్రి అమిత్ షా

| బిల్లుపై ఓటింగ్ ఇలా.. | |
|---|---|
| అనుకూలం | 311 |
| వ్యతిరేకం | 80 |

బిల్లు ప్రతులను చించేసిన అసదుద్దీన్ ఒవైసీ

ఈశాన్య రాష్ట్రాల్లో నిరసనలు

- వివరాలు 5లో





బిహార్‌లోని బక్సర్ జైలుకు జైళ్ల శాఖ ఆదేశాలు

ఈనెల 16వ తేదీన అమలు?

నిర్భయ దోషుల కోసమేనని ఊహాగానాలు

ఒక్క తాడు తయారీకి ఐదారుగురు

## ఉరి తాళ్లు సిద్ధం చేయండి

- వివరాలు 5లో

# డబ్బుంటేనే డాక్టర్?



ప్రైవేటు కాలేజీల్లో ప్రభుత్వం భర్తీ చేసే సీట్ల ఫీజు రూ.60 వేలు.

అదే ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని బీ కేటగిరీ సీట్ల ఫీజు రూ.11.55 లక్షలు.

అదే సీ(ఎన్‌ఆర్‌ఐ) కేటగిరీ ఫీజు రూ. 23.10 లక్షలు. ఇప్పుడు వీటినే ప్రధానంగా మార్చనున్నారు.

ప్రభుత్వ కాలేజీల్లోని ఎంబీబీఎస్ సీట్లు, ప్రైవేటులోని కన్వీనర్ కోటా సీట్ల ఫీజులు పేదలకు, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఎంతో ఉపశమనంగా ఉన్నాయి.

- కన్వీనర్ కోటా ఫీజుల క్రమబద్ధీకరణకు ‘బోగ్’ కసరత్తు
- జాతీయ మెడికల్ కమిషన్ చట్టంతో ఫీజుల్లో మార్పుచేర్పులు.. ఫీజు రూ. 60 వేల నుంచి రూ. 6 లక్షల వరకు పెరిగే అవకాశం?
- ప్రైవేటులోని బీ, సీ కేటగిరీ సీట్ల ఫీజులపై యాజమాన్యాల ఇష్టారాజ్యం!

సాక్షి, హైదరాబాద్

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్ల ఫీజులు భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. 2020–21 వైద్య విద్యా సంవత్సరంలోనే ఈ ఫీజుల భారాన్ని వైద్య విద్యార్థులపై పడేసేలా కేంద్రం చర్యలు ప్రారం భించింది. ఈ మేరకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) చట్టం అమలుపై కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కసరత్తు ప్రారంభిం చింది. ప్రైవేటు మెడికల్ కాలేజీలు, డీమ్డ్ విశ్వ విద్యాలయాల్లో ఫీజుల క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలను సిద్ధం చేయాలని ఎంసీఐ స్థానంలో ఏర్పడిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ (బోగ్)ను కేంద్రం తాజాగా ఆదేశించింది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 50 శాతం సీట్ల ఫీజును కాలేజీ యాజమాన్యాలు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేస్తారు. మిగిలిన 50 శాతం కన్వీనర్ కోటా ఫీజులను కేంద్రం నిర్ధారించనుందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ‘బోగ్’ఫీజులపై రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపింది. వారి సలహాలను కోరింది. ఎంఎన్‌సీ చట్టం వల్ల అత్యంత తక్కువగా ఉన్న ప్రైవేటు కాలేజీల్లోని కన్వీనర్ కోటా ఫీజులు మరింత పెరుగుతాయి. యాజమాన్య సీట్ల ఫీజులూ ఇష్టారాజ్యంగా పెంచుకునే వెసులుబాటు కల్పిస్తారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గతంలో ఎన్‌ఎంసీ బిల్లుపై మొదట్లో జూనియర్ డాక్టర్లు (జూడా) రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. కానీ సర్కారు ఏమాత్రం వెనక్కు తగ్గలేదు.

### పేద విద్యార్థులపై పిడుగు...

తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 4,900 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 1,500 వరకు కన్వీనర్ కోటా సీట్లున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్ల ఫీజు ఏడాదికి రూ. 10 వేలుకాగా ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 50 శాతం కన్వీనర్ కోటా సీట్లను కూడా ప్రభుత్వమే భర్తీ చేస్తుంది. వాటి ఫీజును రూ. 60 వేలుగా ప్రభుత్వం నిర్ధారించింది. ప్రభుత్వ కాలేజీల్లోని

మిగతా 2వ పేజీలో ▶

## 21 రోజుల్లో మరణ శిక్ష

### బుధవారం విప్లవాత్మక చట్టం తీసుకొస్తాం

- మహిళల భద్రతపై అసెంబ్లీ చర్చలో ఏపీ సీఎం వైఎస్ జగన్
- రెడ్ హ్యాండెడ్‌గా ఆధారాలు ఉంటే 21 పని దినాల్లో శిక్ష
- ‘దిశ’ ఘటనపై సమాజం సిగ్గుతో తలదించుకోవాలి

“ఎవరైనా సరే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని కాల్చేయాలని ఆశించరు. జరుగుతున్న జాప్యం చూసినప్పుడు.. ఇక శిక్ష పడదని భావించినప్పుడు.. తప్పు చేసినా సరే దోషులు తప్పించుకు పోగలుగుతారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడమే తప్ప, ఎలాంటి న్యాయం జరగదని అనిపించినప్పుడు దోషులను కాల్చేసిన వారిని హీరోలుగా భావించి చప్పట్లు కొట్టే పరిస్థితి. అందుకే ఇవాళ చట్టాలు మారాలి.

నాక్కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ ఇద్దరూ ఆడపిల్లలే. నాకూ చెల్లెలు ఉంది. భార్య ఉంది. వాళ్లకు ఏదైనా జరిగితే నేను ఎలా స్పందించాలి? అఘాయిత్యాలకు పాల్పడిన వారికి ఏరకమైన శిక్షపడితే బాధిత మహిళకు, ఆ కుటుంబానికి ఉపశమనం కలుగుతుందని మనమంతా ఆలోచించాలి.”



సాక్షి, అమరావతి: మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే మరణ శిక్ష పడుతుందనే భయం రావాలని, అప్పుడే వ్యవస్థలో మార్పు వస్తుందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏపీ అసెంబ్లీలో సోమవారం మహిళలు, చిన్నారుల భద్రతపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెడ్ హ్యాండెడ్‌గా ఆధారాలు ఉంటే 21 పనిదినాల్లో ఉరిశిక్ష పడేలా మహిళలు, చిన్నారుల భద్రతపై బుధవారం శాసనసభలో విప్లవాత్మక బిల్లు తీసుకొస్తున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**‘దిశ’ లాంటి ఘటనల్లో ఎలా స్పందించాలి?**

‘మహిళలు, చిన్నారులపై జరుగుతున్న ఘటనలు నన్ను తీవ్రంగా కలచివేశాయి. ఈ పరిస్థితులను మార్చాలని తపన పడుతూ.. ప్రస్తుతం ఉన్న చట్టంలో అవసరమైన

మిగతా 2వ పేజీలో ▶









# పోలీసులపై కేసు పెట్టారా?

- దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న
- సుప్రీం మార్గదర్శకాల అమలు పత్రాల సమర్పణకు ఆదేశం
- తదుపరి విచారణ 12వ తేదీకి వాయిదా
- 13వ తేదీ వరకూ నిందితుల మృతదేహాల్ని భద్రపర్చాలని స్పష్టీకరణ
- కోర్టుకు సహాయకారిగా సీనియర్ న్యాయవాది ప్రకాశ్‌రెడ్డి నియామకం

4లో



## ఉప ఎన్నికల్లో బీజేపీ విజయభేరి

- 15 సీట్లకుగాను 12 సీట్లలో గెలుపు
- రెండు సీట్లు కాంగ్రెస్‌కు, జేడీఎస్‌కు సున్నా
- కర్ణాటకలో యడియూరప్ప సర్కారుకు పూర్తి మెజారిటీ

- వివరాలు 5లో

## రియల్టీ కుబేరులు!

- రూ.31,960 కోట్ల సంపదతో అగ్ర స్థానంలో లోధా
- టాప్ –100 మందిలో 8 మంది మహిళలు
- యువ కుబేరులిద్దరూ హైదరాబాద్ నుంచే..
- రూ.740 కోట్లతో మై హోమ్ రాము, శ్యామ్‌రావులకు జాబితాలో చోటు
- ‘హురున్– గ్రోహే’ ఇండియా నివేదికలో వెల్లడి

- బిజినెస్‌లో







# దిశ నిందితుల ఎన్‌కౌంటర్ పిటిషన్‌పై రేపు నిర్ణయిస్తాం

## సిట్ వేయాలని దాఖలైన పిల్‌పై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: దిశ హత్య కేసులో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన ఘటనపై సిట్‌తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిల్‌ను విచారణకు స్వీకరించాలా..? లేదా..? అన్నది బుధవారం నిర్ణయిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్‌కౌంటర్ ఘటనపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరుతూ న్యాయవాదులు జీఎస్ మణి, ప్రదీప్‌కుమార్‌లు దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై బుధవారం నిర్ణయిస్తామంది. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ బూటకమని, దీనిలో పాల్గొన్న పోలీసులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని పిటిషన్‌లో వారు పేర్కొన్నారు. దిశ హత్యాచార ఘటనలో నిందితులుగా ఉన్న నలుగురికి ఎవరూ మద్దతు తెలపడం లేదని, కానీ పోలీసులు, కమిషనర్ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని నకిలీ ఎన్‌కౌంటర్ చేశారని అన్నారు. అలాగే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై విచారణకు ఏర్పడే సిట్‌ను సుప్రీంకోర్టు పర్యవేక్షించాలని కోరుతూ ఎమ్ ఎల్ శర్మ అనే న్యాయవాది మరో పిటిషన్‌ను దాఖలు చేశారు.



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దర్నా చేస్తున్న బీసీ సేన సభ్యులు

# పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

## జంతర్‌మంతర్ వద్ద జాతీయ బీసీ సేన ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో బీసీ బిల్లును ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సేన సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బి.కృష్ణ యాదవ్ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో 30 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. దేశంలో బీసీలకు ఇప్పటి వరకు కనీస రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదని వాపోయారు. దేశంలో 56 శాతం జనాభా ఉన్న బీసీలకు 14 శాతం ప్రాతినిధ్యం మించలేదని పేర్కొన్నారు. కేంద్రం వెంటనే బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఎర్రవల్లి క్రాస్‌రోడ్స్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించండి

## కేంద్రాన్ని కోరిన ఎంపీ పి.రాములు



సాక్షి, న్యూఢిల్లీ: జోగుళాంబ గద్వాల జిల్లాలో జాతీయ రహదారి 44పై ఎర్రవల్లి క్రాస్‌రోడ్స్ వద్ద కొత్త ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని టీఆర్‌ఎస్ ఎంపీ పి.రాములు కోరారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని సోమవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల సౌకర్యార్థం ఫ్లైఓవర్‌కు అనుమతులిచ్చి నిధులు విడుదల చేయాల్సిందిగా ఆయన కేంద్రాన్ని కోరారు.

**మహిళా వర్సిటీకి ప్రతిపాదన అందలేదు..**

తెలంగాణలో మహిళా వర్సిటీ ఏర్పాటుకు సంబంధించి రూసా కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని ఎంపీ రంజిత్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి రమేశ్ పోఖ్రియాల్ సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వకంగా బదులిచ్చారు.

# మంచిర్యాల జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయండి

## కేంద్ర మంత్రిని కోరిన టీఆర్‌ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యే

సాక్షి, న్యూఢిల్లీ: స్వదేశ్ దర్శన్ పథకం కింద మంచిర్యాల జిల్లాలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాల్సిందిగా కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ జోషిని టీఆర్‌ఎస్ ఎంపీలు వెంకటేశ్ నేత, రంజిత్‌రెడ్డి, ఎం.కవిత, శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్ కోరారు. మంచిర్యాల జిల్లాలో అన్నారం బ్యారేజీ, గట్టు మల్లన్న స్వా మి దేవస్థానం, ఇందరం గ్రామం, టి-జంక్షన్, గాంధారి ఖిల్లా, ఎల్లం పల్లి బ్యారేజ్, కవ్వాల్ వన్యప్రాణి ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిం దిగా టీఆర్‌ఎస్ నేతలు మంత్రిని కోరారు. ఈ ప్రదేశాల అభివృద్ధికి సూత్రప్రాయ అంగీకారం ఇస్తే డీపీఆర్‌లు అందజేస్తామని తెలిపారు.

# మహబూబాబాద్‌కు మెడికల్ కాలేజీ మంజూరు చేయండి

సాక్షి, న్యూఢిల్లీ: మహబూబాబాద్‌కు కొత్త మెడికల్ కాలేజీ మంజూరు చేయాల్సిందిగా కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు ఎంపీ మాలోతు కవిత విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఆమె సోమవారం పార్లమెంటులో కేంద్ర మంత్రిని కలిసి మెడికల్ కాలేజీ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు.

# ఢిల్లీలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: గత 20 ఏళ్లుగా పెన్షన్ పెంచకపోవడాన్ని నిరసిస్తూ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టింది. కోల్‌మైన్స్ పెన్షన్ పథకం–1998 ద్వారా పెన్షన్ పొందుతున్న తమకు మూడేళ్లకోసారి ఆర్థిక నిపుణుల సిఫార్సుల మేరకు పెన్షన్ పెంపు, ఉద్యోగుల కంట్రిబ్యూషన్ పెంపు అంశాలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని.. అయితే గత 20 ఏళ్లలో ఒక్కసారి కూడా పెన్షన్ పెంపుపై నిర్ణయం తీసుకోలేదని ధర్నాలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు వాపోయారు. సింగరేణి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పీఎఫ్ నిధి, పెన్షన్ పథకాలను తెలంగాణ రాష్ట్రం లేదా సింగరేణి యాజమాన్యం అజమాయిషీలోకి తీసుకొని నిర్వహించాలని, కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని కోల్‌మైన్స్ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బాబూరావు డిమాండ్ చేశారు.

# ‘దళితులను వర్గీకరించవద్దు’

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును గౌరవించాలని, దళితులను వర్గీకరించవద్దని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు మాల మహానాడు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు జి.చెన్నయ్య తదితరులు సోమవారం ఢిల్లీలో కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అంతకుముందు ఉదయం జంతర్‌మంతర్ వద్ద వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు.

# శ్రీశైలం డ్యాం నిర్వహణకు చర్యలు తీసుకోండి

## లోక్‌సభలో కేంద్రాన్ని కోరిన ఎంపీ సంజీవ్‌కుమార్

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీశైలం డ్యాం నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ సంజీవ్‌కుమార్ కోరారు. ప్లంజ్‌పూల్ కోతకు గురైందని, పూడిక వల్ల వరదను తట్టుకునే సామర్థ్యం తగ్గిందని సోమవారం లోక్‌సభలో ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు కొత్త డ్యాం నిర్మించే అవకాశం లేనందున శ్రీశైలం డ్యాం నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి విన్నవించారు.


గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు స్వామివారి ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, కలెక్టర్ అనితా రామచంద్రన్ తదితరులు


తలసేమియాతో బాధపడుతూ రెడ్‌క్రాస్ కార్యాలయంలో చికిత్స పొందుతున్న చిన్నారితో మాట్లాడుతున్న గవర్నర్

# సమష్టి కృషితోనే ఆరోగ్య తెలంగాణ

- వరంగల్‌లో త్వరలో తలసేమియా పరిశోధన కేంద్రం
- ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భవ ద్వారా పేదలకు మెరుగైన సేవలు
- రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశంలో గవర్నర్ తమిళిసై

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భవ పథకాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. సోమవారం హన్మకొండలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో జూనియర్, యూత్ రెడ్ క్రాస్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడారు. జిల్లాలో తలసేమియా పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలసేమియా వ్యాధిని ఆరోగ్యశ్రీ ఎంపానెల్‌మెంట్‌లో చేర్చడంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా తలసేమియా, బోన్ మ్యారో (ఎముక గుజ్జు మార్పిడి) చికిత్సకు అవకాశముందని చెప్పారు. వరంగల్ అర్బన్ జిల్లా వ్యాప్తంగా నవంబర్ 1వ తేదీ వరకు 10 వేల మంది జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు ఉండగా, తాను ఇచ్చిన పిలుపు మేరకు ఇప్పటి వరకు 1,16,718 మంది సభ్యులుగా చేరడం అభినందనీయమని గవర్నర్ పేర్కొన్నారు. తలసేమియా, సికిల్‌సెల్ ట్రాన్స్‌ఫ్యూషన్ సెంటర్, జనరిక్ మందుల షాపును, బ్లడ్ బ్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే, 3.7 లక్షల వ్యయంతో చేపట్టనున్న భవన విస్తరణకు గవర్నర్ శంకుస్థాపన చేశారు.

**వేయిస్తంభాలు, భద్రకాళి ఆలయాల్లో గవర్నర్ దంపతుల పూజలు**

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దంపతులు హన్మకొండలోని చరిత్రాత్మక శ్రీరుద్రేశ్వర స్వామి వారి వేయిస్తంభాల దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు, అధికారులు గవర్నర్ దంపతులను పూర్ణకుంభంతో స్వాగతించారు. అర్చకులు గవర్నర్ దంపతులను పట్టువస్త్రాలతో సన్మానించి మహదాశీర్వచనం చేశారు. అనంతరం ప్రముఖ శక్తి పీఠం శ్రీభద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించుకున్నారు. అక్కడి నుంచి ఖిలా వరంగల్‌లో కాకతీయ కట్టడాలను సందర్శించారు. వరంగల్ కోట అందాలను తిలకించారు. తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో 50 నిమిషాల నిడివిగల కాకతీయుల కళా వైభవం ఉట్టి పడేలా ప్రదర్శించిన సౌండ్ అండ్ లైటింగ్ షోను వీక్షించారు. నీటిలో తెలియాడే ఆనాటి ఇటుకలను పరిశీలించిన అనంతరం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హన్మకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో రాత్రి బస చేశారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఆమె కాళేశ్వరం ఆలయం, ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరుతారు.

### తెలంగాణ అభివృద్ధి చెందాలని వేడుకున్నా

#### యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్ తమిళిసై

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని శ్రీలక్ష్మీనరసింహస్వామిని వేడుకున్నట్లు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని సోమవారం ఆమె కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గవర్నర్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బాలాలయంలో ప్రత్యేక పూజలు చేసిన గవర్నర్ కుటుంబానికి ఆలయ అర్చకులు ప్రధాన మండపంలో వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ యాదాద్రీశుడి దర్శనం బాగా జరిగిందని అన్నారు. గవర్నర్ వెంట విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్ ఉన్నారు.

# డబ్బుంటేనే డాక్టర్?

▶ మొదటి పేజీ తరువాయి

ఎంబీబీఎస్ సీట్లు, ప్రైవేటులోని కన్వీనర్ కోటా సీట్ల ఫీజులు పేదలకు, ప్రతిభ కలిగిన విద్యా ర్థులకు ఎంతో ఉపశమనంగా ఉన్నాయి. అదే ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 35 శాతంగా ఉన్న బీ కేటగిరీ ఎంబీబీఎస్ సీట్ల ఫీజు ఏడాదికి రూ. 11.55 లక్షలుగా ఉండగా సీ (ఎన్‌ఆర్‌ఐ) కేటగిరీ ఫీజు ప్రస్తుతం ఏడాదికి రూ. 23.10 లక్షలుగా ఉంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్ల ఫీజులను ఎంఎన్‌సీ నియంత్రిస్తుంది. వాటినే ఇప్పుడు ప్రధానంగా మార్చనున్నారు. ప్రస్తుతం ఈ ఫీజులు అందరికీ అందుబాటులో ఉన్నాయి. డీమ్డ్ వర్సిటీల్లోని ఎంబీబీఎస్ సీట్లకు ఒకటే ఫీజు ఉంది. దేశవ్యాప్తంగా ఒక్కో డీమ్డ్ వర్సిటీలో ఫీజులు రాష్ట్రంలోని బీ కేటగిరీ ఫీజులకు దగ్గరగా ఉంటాయి. వాటిని క్రమబద్ధీకరించాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఆయా ఫీజులను రూ. 6–7 లక్షల వరకు క్రమబద్ధీకరిస్తారని సమాచారం. అవే ఫీజులను ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకూ ఖరారు చేస్తారని కాళోజీ వర్సిటీ వర్గాలు అంటున్నాయి.

### గందరగోళం నెలకొంది...

ఎన్‌ఎంసీ చట్టం ప్రకారం ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 50 శాతం కన్వీనర్ కోటా సీట్ల ఫీజును ‘బోగ్’నిర్ధారించనుంది. మిగిలిన 50 శాతం సీట్ల ఫీజును ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదించి యాజమాన్యాలు నిర్ధారించుకునే అవకాశముంది. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. అయితే ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్ల ఫీజును ఇప్పుడు ఏ మేరకు నిర్ధారిస్తారన్న దానిపై గందరగోళం నెలకొంది. ఫీజుల పెంపుపై మాకు సమాచారం రాలేదు.

*– డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, వీసీ, కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం*

### పెంచితే పెనుభారమే

డీమ్డ్ వర్సిటీలను దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల ఫీజులను పెంచితే అది పేద విద్యార్థులకు పెనుభారమే కానుంది. ఫీజులు పెంచుతారన్న ఆందోళనైతే ఇప్పటికీ నెలకొని ఉంది. ఎన్‌ఎంసీ బిల్లు వచ్చిన సమయంలో ఫీజులు పెరుగుతాయని ఉద్యమాలు చేశాం. అయినా బిల్లు చట్టంగా రూపుదిద్దుకుంది.

*– డాక్టర్ విజయేందర్, సలహాదారు, జూడాల సంఘం*

# 21 రోజుల్లో మరణ శిక్ష

▶ మొదటి పేజీ తరువాయి

మార్పులు చేయడానికి సూచనలు అడుగుతున్నా. దిశ ఘటనపై సమాజం సిగ్గుతో తలవంచుకోవాలి. 26 ఏళ్ల మహిళా డాక్టర్‌ను టోల్ గేట్‌కు సమీపంలో రేప్ చేసి, కాల్చేసిన ఘటన మన కళ్ల ముందు కనిపిస్తోంది. దీనిపై నాయకులు, పోలీసులు ఎలా స్పందించాలి అని ఆలోచించినప్పుడు చాలా బాధ అనిపించింది. రాష్ట్రంలోనే ఇలాంటి ఘటన జరిగితే మన పోలీసులు ఎలా స్పందించాలి? మనం ఎలా స్పందించాలన్న దానిపై మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. దిశ తల్లిదండ్రుల బాధ చూశాక బాధ్యులను ఎన్‌కౌంటర్ చేసినా తప్పులేదని అందరం అనుకున్నాం.

**నిర్భయ ఘటనలో ఏడేళ్లయినా శిక్ష లేదు**

ఢిల్లీలో ఒక ఘటన జరిగితే.. ఇలాంటి ఘటన మున్ముందు జరగకూడదని నిర్భయ చట్టాన్ని తీసుకు వచ్చాం. ఇలాంటి ఘటనలు జరిగిన వెంటనే శిక్షలు పడాలని కోరుకున్నాం. 4 నెలల్లో తీర్పు నివ్వాలి, 4 నెలల్లో శిక్ష వేయాలని ఈ చట్టం చెబుతోంది. కానీ ఏడేళ్లయినా నిర్భయ దోషులకు శిక్ష పడలేదు. ఏదైనా ఘటన జరిగిన వెంటనే ఉపశమనం కలిగేలా చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఆడపిల్ల ఎదురు చూస్తోంది. ఈ దిశగానే ఏపీ కూడా ఆలోచిస్తోంది. ఒక నేరం జరిగినప్పుడు, రెడ్ హ్యాండెడ్‌గా నిర్ధారించే ఆధారాలు ఉన్నప్పుడు.. దిశ లాంటి కేసుల్లో నేరాన్ని నిర్ధారించే ఆధారాలు కనిపిస్తున్నప్పుడు, అటువంటి వ్యక్తులను ఏం చేయాలన్న దానిపై మనం చట్ట సభలో ఆలోచించాలి. చట్టాలను సవరించి అంగీకార యోగ్యమైన పద్ధతిలో బలమైన చట్టాలను తేవాలి.

**వారంలో విచారణ పూర్తి కావాలి**

మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరిగినప్పుడు వారం రోజుల్లోగా విచారణ, డీఎన్‌ఏ రిపోర్టుల్లాంటివి పూర్తి కావాలి. రెండు వారాల్లో ట్రయల్ కూడా పూర్తవ్వాలి. మూడు వారాలు అంటే 21 పని దినాల్లో దోషులకు ఉరి శిక్షపడే పరిస్థితి రావాలి. మరణ శిక్ష ఉంటుందనే భయం ఉంటేనే తప్ప వ్యవస్థలో మార్పులు రావు. ఈ దిశగా అడుగులు వేసే క్రమంలో, మహిళలపై నేరాలకు సంబంధించి ప్రతి జిల్లాలోనూ ఒక ప్రత్యేక కోర్టును పెట్టాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో పక్షపాత ధోరణితో వేరే వ్యక్తుల మీద బురద చల్లడానికి మనస్సాక్షి అనేది లేకుండా దిగజారిపోయారు. మహిళల గురించి నెగెటివ్‌గా ఎవరైనా పోస్టింగ్ చేస్తే శిక్ష పడుతుందనే భయం ఉండాలి. ఆ దిశగా కూడా చట్టాల్లో మార్పులు తేవాలని అడుగులు వేస్తున్నాం. 354 (ఇ)ని తీసుకువచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే జీరో ఎఫ్‌ఐఆర్ ద్వారా ఎక్కడైనా సరే కేసు నమోదు చేస్తున్నాం.’

### హ్యాట్సాఫ్ టు కేసీఆర్...

‘దిశ’ ఘటనలో తప్పు జరిగిందని మీడియా విస్తృతంగా చూపించింది. ఆ తర్వాత తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. హేట్సాఫ్ టు కేసీఆర్, తెలంగాణ పోలీసు ఆఫీసర్స్.. అని ఈ చట్టసభ సాక్షిగా చెబుతున్నాం. సినిమాల్లో హీరో ఏదైనా ఎన్‌కౌంటర్ చేస్తే అందరం చప్పట్లు కొడతాం. సినిమా బాగుందని చెబుతాం. కానీ నిజ జీవితంలో దమ్మున్న వాళ్లు ఎవరైనా చేస్తే జాతీయ మానవ హక్కుల సంఘం పేరుతో ఢిల్లీ నుంచి వస్తారు. ఇది తప్పు.. ఇలా జరక్కూడదు.. ఇలా ఎందుకు చేశారు? అని నిలదీసిన పరిస్థితులు ఇప్పుడు చూస్తున్నాం. ఇలాంటి దారుణమైన పరిస్థితుల్లో మన చట్టాలు ఉన్నాయి.

# ‘ఆ అభియోగాలపై విచారించి నివేదించండి’

సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ అదనపు కార్యదర్శిపై వచ్చిన అభియోగాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా, ఆ శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. గిరిజన గురుకులాల్లో అవకతవకలు జరిగాయంటూ ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు చేసిన ఫిర్యాదుపై ఆయన స్పందిస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# తగాదా పెట్టి తమాషా చూస్తున్న సర్కార్

- బహుజన క్రాంతి మోర్చా జాతీయ అధ్యక్షుడు మెసిరా
- రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారు : దాసురాం నాయక్

హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలు, లంబాడీల మధ్య తగాదా పెట్టించి తమాషా చూస్తున్నాయని బహుజన క్రాంతి మోర్చా జాతీయ అధ్యక్షుడు వామన్ మెసిరా విమర్శించారు. ఎంపీ సోయం బాబూరావు లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ధర్నా చేయటం సరైంది కాదన్నారు.సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లంబాడీ హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వామన్ మెసిరా మాట్లాడుతూ లంబాడీలకు బీజేపీ. కాంగ్రెస్ పార్టీలే శత్రువులని అన్నారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచే లంబాడీలు ఎస్టీ జాబితాలో ఉన్నారని, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు.ఇప్పుడు కొత్తగా లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేయటం సమంజసమేనా అని ప్రశ్నించారు. పాలకులు కూడా ఒక వర్గానికే మద్దతు ఇవ్వటం సరైంది కాదన్నారు.లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పిఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరినాయక్ మాట్లాడుతూ రాజుల పాలనలోనే లంబాడీలు గిరిజనులుగా గుర్తింపు పొందారన్నారు. ఎస్టీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎంపీ సోయం బాబు రావు పోరాటం చేయకుండా లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ధర్నా చేయటం సరైంది కాదన్నారు. ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసురాం నాయక్ మాట్లాడుతూ బీజేపీ, సీఎం కేసీఆర్‌ల మోసాన్ని లంబాడీలు అర్థం చేసుకోవాలని కోరారు.త్వరంలో లంబాడీలను జాగృతం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**చలో ప్రగతి భవన్‌ను అడ్డుకున్న పోలీసులు**

ఢిల్లీలో ఎంపీ సోయం బాబూరావు ఢిల్లీలో ధర్నా చేయటాన్ని నిరసిస్తూ, ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఎస్టీలకు 6 శాతం నుంచి 12 శాతం రిజర్వేషన్ పెంచాలని, విద్య, వైద్యాన్ని జాతీయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్‌హెచ్‌సీఎస్, గిరిజన సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ధర్నా చేశారు.అనంతరం చలో ప్రగతి భవన్ ముట్టడికి ప్రయత్నించారు.వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకొని పలువురు లంబాడీల నేతలను అరెస్టు చేసి ముషీరాబాద్, గాంధీనగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు.ఈ సందర్భంగా వారిమధ్య తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం అధ్యక్షుడు గణేష్ నాయక్, ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులు ధరవాత్ మహేందర్, బానోతు భాస్కర్ నాయక్, శాంతి నాయక్, లోకేష్, లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.


సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద లంబాడీలను అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

# మద్దిలేటి కేసు ఎన్‌ఐఏకి

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు అనుబంధ సంస్థగా కొనసాగుతున్న తెలంగాణ విద్యార్థి వేదిక అధ్యక్షుడు మద్దిలేటిపై సిటీ పోలీసులు నమోదు చేసిన కేసును దర్యాప్తు నిమిత్తం జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ)కు బదిలీ చేశారు. హైదరాబాద్‌లోని నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో అక్టోబర్ నెలలో నమోదైన కేసును నగర నేర పరిశోధన విభాగం అధీనంలోని ‘సిట్’కు అప్పగిస్తూ నగర పోలీసు కమిషనర్ అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. దర్యాప్తు పరిధి పరిగణనలోకి తీసుకున్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎన్‌ఐఏకు అప్పగిస్తూ గత నెల ఆఖరి వారంలో ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సిటీ పోలీసులు ఆ ఫైల్ ఎన్‌ఐఏకు అప్పగించారు. గద్వాల్ పోలీసుల సమాచారంతో అక్టోబర్ 10వ తేదీన నల్లకుంటలోని తెలంగాణ విద్యార్థి వేదిక(టీవీవీ) అధ్యక్షుడు మద్దిలేటి ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. ఈ సందర్భంలో నిషేధిత మావోయిస్టు సంస్థతో మద్దిలేటికి ఉన్న లింక్‌లకు చెందిన పలు ఆధారాలు పోలీసులకు లభించిన సంగతి విదితమే. దీనిపై ఎఫ్‌ఐఆర్ నెం.4/2019 గా హైదరాబాద్ ఎన్‌ఐఏ యూనిట్ తాజాగా కేసు నమోదు చేసింది.

# ఇంకా భ్రూణహత్యలా?

సాక్షి, హైదరాబాద్: చట్ట వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, గర్భంలో ఉన్నది ఆడ బిడ్డ అయితే పిండ దశలోనే చిదిమేస్తున్న ఘటనలకు సంబంధించి వచ్చిన వార్తలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పత్రికల్లో వచ్చిన కథనాలను పిల్‌గా పరిగణించి ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య, ఆరోగ్య/కుటుంబ సంక్షేమ/మహిళా, శిశు సంక్షేమశాఖల ముఖ్య కార్యదర్శులను, కుటుంబ సంక్షేమశాఖ/ వైద్య విద్య కమిషనర్లు, డైరెక్టర్లు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి, రంగారెడ్డి జిల్లా వైద్యాధికారులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

# జంతు, పక్షుల తరలింపునకు ప్రత్యేక నిబంధనలు

సాక్షి, హైదరాబాద్: పక్షులు, జంతువుల తరలింపు ప్రక్రియలో హింసకు తావు ఉండొద్దని రవాణా శాఖ స్పష్టం చేసింది. జంతువులు, పక్షులను తరలించే సమయంలో ఇరుకుగా, సామర్థ్యానికి మించి తరలిస్తుండటంతో హింసకు ఆస్కారం ఉంటోంది. ఈ పరిస్థితి లేకుండా సాఫీగా తరలింపు జరగాలని జంతు, పక్షుల ప్రేమికులు, వివిధ కారుణ్య సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. దీంతో స్పందించిన రవాణా శాఖ ప్రత్యేకంగా నిబంధనలు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి ఇదివరకే నిబంధనలు ఉన్నప్పటికీ.. తాజాగా మరింత స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇకపై ఒక ఆవు/బర్రె/ఎద్దును తరలించాలంటే 2 చదరపు మీటర్ల స్థలాన్ని వాహనంలో కేటాయించాలి. అదే విధంగా గుర్రం తరలింపునకు 2.25 చదరపు మీటర్లు, గొర్రెలు, మేకలకు 0.3 చదరపు మీటర్లు, పందులకు 0.6 చదరపు మీటర్ల, కోళ్లు తదితరాలకు 40 చదరపు సెంటీమీటర్లు చొప్పున స్థలం ఉండేలా చూడాలి. అవసరమైతే నిర్దేశించిన స్థలాన్ని భాగాలుగా విభజిస్తూ అందులో జీవాలను తరలించాలని రవాణా శాఖ స్పష్టం చేసింది.

ఇదం జగత్



# మహిళలకు భద్రత కరువు

## రాష్ట్రంలో దుర్మార్గ పాలన: భట్టి ● ఎల్లాపటార్ ఘటనా స్థలం పరిశీలన

**ఆసిఫాబాద్:** రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. గతనెల 24న కుమురం భీం జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్ శివారులో దళిత మహిళ సమతపై అత్యాచారం, హత్య చేసిన ప్రదేశాన్ని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తదితరులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్‌లో పడుకుని పాలన చేస్తున్నారని విమర్శించారు. ప్రతిరోజు సచివాలయానికి వచ్చి ప్రజా పరిపాలనపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాల వల్లే మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎల్లాపటార్‌లో దళిత మహిళపై అత్యాచార, హత్య ఘటనపై గవర్నర్ దృష్టికి తెచ్చామని పేర్కొన్నారు. మహిళలపై దాడులు అరికట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు అభద్రతాభావంతో ఉన్నారని చెప్పారు. భద్రతపై మహిళలకు ప్రభుత్వం ఆత్మవిశ్వాసం కల్పించాలన్నారు. శాంతి భద్రతలు పరిరక్షించాల్సిన పోలీసులు కేవలం టీఆర్ఎస్ నాయకులకే పని చేస్తున్నారని విమర్శించారు. వారి వెంట మాజీ ఎంపీలు నిఖిల్, రాథోడ్ రమేశ్ తదితరులు ఉన్నారు.


సోమవారం ఆసిఫాబాద్ జిల్లా ఎల్లాపటార్‌లో సమత హత్య ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న భట్టి తదితరులు

## 'సమత'గా పేరు మార్పు

### ఆసిఫాబాద్ ఎస్పీ మల్లారెడ్డి

**ఆసిఫాబాద్ అర్బన్:** గత నెల 24న కుమురం భీం జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్‌లో అత్యాచారం, హత్యకు గురైన దళిత మహిళ పేరును సమతగా మార్చుతున్నట్లు ఎస్పీ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి బాధితురాలి పేరును సమతగా పేర్కొనాలని సూచించారు. అలాగే ఈ కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన విచారణ జరిపేందుకు కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు వెల్లడించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. మృతురాలి భర్తకు ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి పెన్షన్, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇచ్చేందుకు కలెక్టర్ అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.

# తాగుబోతుల తెలంగాణ

## 'దిశ' నిందితులకో న్యాయం.. సమతకో న్యాయమా? డీకే అరుణ

**నయీంనగర్/ఖానాపూర్:** రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మార్చడంతో పాటు మహిళలపై అత్యాచారాలు, హత్యలకు కేరాఫ్‌గా రాష్ట్రాన్ని నిలిపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి, బీజేపీ నేత డీకే అరుణ ఎద్దేవా చేశారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా ఎల్లాపటార్ ఘటన బాధిత కుటుంబాన్ని, అలాగే.. వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని దీన్‌దయాళ్ నగర్ కాలనీలో తల్లిదండ్రులను ఓదార్చారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, మత్తులోనే అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దిశ నిందితులకు ఒక న్యాయం.. 'సమత'కు మరో న్యాయం సరికాదని మహిళలందరికీ సమన్యాయం జరగాలని కోరారు. పేదలకు ఒక న్యాయం, ధనికులకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. మహిళల చట్టాల్లో కఠినమైన మార్పులు రావాలన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


సోమవారం వరంగల్‌లో మానస తల్లిని పరామర్శిస్తున్న బీజేపీ నేత అరుణ

**పరామర్శించిన తమ్మినేని**

మానస కుటుంబాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానస ఘటనలో పోలీసులు ముగ్గురిని కీలక నిందితులుగా గుర్తించి ఒక్కరినే అరెస్టు చేసి కీలక నిందితుడిగా పేర్కొనడం సరైంది కాదన్నారు. పోలీసులు పక్షపాతంతో వ్యవహరించకుండా విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## క్లుప్తంగా...


ప్రజావాణిలో కలెక్టర్ శరత్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న నర్సయ్య

### లంచం పైసలు వాపస్

**సాక్షి, జగిత్యాల:** రెవెన్యూ రికార్డుల్లో భూమి వివరాలు ఎక్కించేందుకు వీఆర్వో, వీఆర్ఏలకు లంచంగా ఇచ్చిన డబ్బులను తిరిగి ఇప్పించిన ఘటన జగిత్యాలలో సోమవారం ప్రజావాణిలో చోటుచేసుకుంది. కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన నర్సయ్యకు చెందిన నాలుగు గుంటల భూమి రెవెన్యూ రికార్డులో నమోదు కాలేదు. ఇందుకు వీఆర్వో రమేశ్‌రెడ్డి రూ.20 వేలు డిమాండ్ చేయగా.. చేసేదేమి లేక ఆయనకు రూ.8 వేలు, వీఆర్ఏ మహేశ్‌కు రూ.2 వేలు లంచంగా ఇచ్చాడు. అంతలోనే వీఆర్వో అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యాడు. నెలలు గడుస్తున్నా.. భూమి రికార్డుకు ఎక్కకపోవడంతో రైతు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ శరత్‌ను కలసి గోడు వెళ్లబోసుకున్నాడు. స్పందించినఆయన రైతు పేరిట రికార్డుపత్రంతోపాటు నర్సయ్య నుంచి వీఆర్వో, వీఆర్ఏలు తీసుకున్న రూ.10 వేలను తిరిగి ఇప్పించారు.

### బ్రహ్మేశ్వర్ స్వామిజీ శివైక్యం

**గుండెపోటుతో తుదిశ్వాస**

**భైంసా:** లోకేశ్వరం మండలం బ్రహ్మేశ్వర ఆలయంలోని గురుదత్త శాంతి ఆశ్రమం మూగబోయింది. రెండున్నర దశాబ్దాలకు పైగా ఆలయం వద్ద పూజలు చేస్తూ పక్కనే ఆశ్రమం ఏర్పాటు చేసి నిత్యం భక్తులకు ప్రవచనాలు అందించే శ్రీశ్రీశ్రీ సత్యానంద సరస్వతీ స్వామిజీ శివైక్యమయ్యారు. అనారోగ్యంతో ఉన్న స్వామిజీని ఆదివారం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు గుండెపోటు వచ్చినట్లు నిర్ధారించారు. స్వామిజీ ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో శివైక్యం అయ్యారని తెలియగానే భక్తులు తల్లడిల్లిపోయారు.

### మోకుదెబ్బ పొలిట్‌బ్యూరో కమిటీ

**కూసుమంచి:** తెలంగాణ గౌడ జనహక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర పొలిట్ బ్యూరో కమిటీని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరనేని నర్సాగౌడ్ సోమవారం ప్రకటించారు. అమరనేని నర్సాగౌడ్ (హైదరాబాద్), కొండాపురం బాలరాజ్‌గౌడ్ (మెదక్), రాగుల సిద్ధరాములు గౌడ్, బుర్రా శ్రీనివాస్‌గౌడ్, బొమ్మా నర్సాగౌడ్ (సిద్దిపేట), బి.హన్మంత్‌గౌడ్ (కామారెడ్డి), తొడుపునూరి సత్యగౌడ్ (రంగారెడ్డి), కట్టగాని రవీందర్‌గౌడ్ (వరంగల్), బత్తుల సోమయ్యగౌడ్ (ఖమ్మం), బూర నగేష్‌గౌడ్, తీగల జీవన్‌గౌడ్ (వరంగల్ అర్బన్), సీపతి లింగగౌడ్ (ఆదిలాబాద్), గొట్టెముక్కల జ్యోతి శ్రీనివాస్ (మేడ్చల్), దొమ్మెట రమేష్‌గౌడ్ (వరంగల్ రూరల్), సూరగాని విజయకుమార్‌గౌడ్ (జోగులాంబ గద్వాల), బొర్రా కుమారస్వామిగౌడ్(జయశంకర్ భూపాలపల్లి), ఆరెల్లి మల్లాగౌడ్, పొన్న అమరేందర్ గౌడ్(కరీంనగర్)లను పొలిట్ బ్యూరో సభ్యులుగా ప్రకటించారు.

### బాలిక కిడ్నాప్?

**డయల్ 100కు కాల్..కాపాడిన పోలీసులు**

**హసన్‌పర్తి:** వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తి బస్టాండ్ నుంచి కిడ్నాప్‌కు గురైన ఓ బాలికను హసన్‌పర్తి పోలీసులు సోమవారం కాపాడినట్లు తెలిసింది. భీమదేవరపల్లికి చెందిన ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని రెండు రోజుల క్రితం ఎల్కతుర్తిలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో స్నేహితురాలిని కలువడానికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో ఆమె బస్సు కోసం వేచి చూస్తుండగా హసన్‌పర్తి మండలం అన్నాసాగరం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆమెకు మాయమాటలు చెప్పి బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి వివిధ ప్రాంతాల్లో తిప్పాడు. రాత్రి కావడంతో ఆమెను హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో ఉంటున్న తన సోదరి వద్దకు తీసుకొచ్చినట్లు సమాచారం. ఉదయం ఆ బాలిక తనను కిడ్నాప్ చేశారని డయల్ 100కు ఫోన్ చేయగా.. యువకుడు హసన్‌పర్తి మండలం అన్నాసాగరంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

### మాకేం సంబంధం లేదు

**ఎల్లాపటార్ ఘటన నిందితుడి తండ్రి**

**ఆసిఫాబాద్:** 'వాళ్లకేమైనాగానీ.. మాకు సంబంధం లేదు..'అని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్ ఘటన నిందితుల్లో ఒకరైన షేకఖ మగ్దూమ్ తండ్రి హుస్సేన్ అన్నారు. నిందితులందరూ నిత్యం మద్యం మత్తులో ఉండేవారని తెలిపారు. తన కుమారుడికి ఏమైనా తనకు సంబంధం లేదన్నారు. మిగిలిన నిందితుల కుటుంబ సభ్యులెవరూ గ్రామంలో అందుబాటులో లేరు.

### రైతు ఆత్మహత్యాయత్నం

మానవపాడు: 'రైతులకు న్యాయం జరుగుతుందంటే నా ప్రాణాన్ని విడిచి వేస్తా.. భూ సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..'అంటూ ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం నారాయణపురానికి చెందిన రాజశేఖర్‌రెడ్డికి ఏడెకరాల వారసత్వ భూమి ఉంది. అయితే 'భూ ప్రక్షాళన'లో భాగంగా 4.26 ఎకరాలు ఇనాంగా నమోదైందని, అలాగే వేరే సర్వే నంబర్లతో ప్రభుత్వ భూమిగా ముద్రించి, పట్టాపాసుబుక్ ఇచ్చారని వాపోయాడు. ఇదే విషయమై తన తండ్రి రామలింగారెడ్డి గతంలోనే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. చివరకు మనస్తాపానికి గురై గుండెపోటుతో గత ఏడాది డిసెంబర్ 7న మరణించాడని ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పటి నుంచి తాను కూడా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారుల్లో చలనం లేదని ఆరోపించాడు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అందరూ చూస్తుండగానే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

# రాష్ట్రానికి మరో మణిహారం

## సిద్దిపేటలో ఉద్యానవన విశ్వవిద్యాలయం సిద్ధం

- 67 ఎకరాల్లో 3.25 లక్షల చదరపు అడుగుల నిర్మాణం
- దేశంలోనే నాలుగో యూనివర్సిటీ ● పండ్లు, కూరగాయలపై పరిశోధనే లక్ష్యం

**సాక్షి, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా ములుగులో నూతనంగా నిర్మించిన ఉద్యానవన విశ్వవిద్యాలయం రాష్ట్రానికి మరో మణిహారంగా మారనుంది. మారుతున్న ఆహారపు అలవాట్లలో పండ్లు, కూరగాయల పాత్ర పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకొని మేలురకం వంగడాలు, అధిక దిగుబడి, అధిక పోషకాలతో కూడిన పండ్లు, కూరగాయల పరిశోధనలకు నాంది పలికేలా ఈ వర్సిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. గత ఐదేళ్లుగా నిర్మాణం జరుగుతున్న ఈ వర్సిటీ ప్రస్తుతం ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

**రాష్ట్రానికే తలమానికం**

జిల్లాలో నిర్మించిన ఉద్యానవన వర్సిటీ రాష్ట్రానికే తలమానికంగా మారనుంది. ఇప్పటి వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని సోలాన్, కర్ణాటకలోని బాగల్‌కోట్, ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో మాత్రమే ఇలాంటి వర్సిటీలు ఉన్నాయి. ఇప్పుడు తెలంగాణలో రూపుదిద్దుకున్న ఈ వర్సిటీ దేశంలోనే నాలుగవది. అయితే పై మూడు వర్సిటీలు దశాబ్ద కాలం కింద నిర్మించినవి కాగా.. నూతన విధానాలకు అనుగుణంగా నిర్మించిన ఈ వర్సిటీ దేశానికే మోడల్‌గా మారనుంది. పండించిన పండ్లు, కూరగాయలను ఎలా భద్రపర్చుకోవాలి అనేదానిపై ఇందులో ప్రత్యేక పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయడం గమనార్హం. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలనే సీఎం కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా ఈ వర్సిటీలో బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా ఫుడ్ ప్రాసెసింగ్, రైతులు పండించిన పండ్లు, కూరగాయల ఎగుమతులు, నిల్వ,ఇతర పదార్థాల తయారీ మొదలైన అంశాలపై అధ్యయనానికి ఇక్కడ ప్రాధాన్యత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**6 బ్లాకులు, 5 బ్రాంచ్‌లు..**

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు ప్రత్యేక ఉద్యాన వర్సిటీ ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో రూ.1,800 కోట్ల ప్రతిపాదనలతో నూతన వర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తొలుత రూ.200 కోట్లు మంజూరు చేయగా.. వీటిలో రూ.135 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో రాజీవ్ రహదారి పక్కనే 67 ఎకరాల్లో వర్సిటీ ఏర్పాటుకు 2014 డిసెంబర్ 23న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. మొత్తం 2.35 లక్షల చదరపు అడుగుల్లో జీప్లస్ త్రీ అంతస్తులు, ఆరు బ్లాకుల్లో నిర్మాణం చేపట్టారు. ఇందులో పరిపాలన, బోధన, పరీక్ష, పరిశోధన ఇలా వివిధ విభాగాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారు. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ స్థాయిలో పండ్లు, కూరగాయలు, పూలు, ఔషధ, సుగంధ ద్రవ్యాలు మొదలైన వాటిపై ప్రత్యేక బోధన కోసం ల్యాబ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మొదటగా 30 మంది పోస్టు గ్రాడ్యుయేట్, ఏడుగురు పీహెచ్‌డీ విద్యార్థులతో వర్సిటీ ప్రారంభం కానుంది. అలాగే బీఎస్సీ హార్టికల్చర్ కోర్సులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.


సిద్దిపేట జిల్లా ములుగులో ముస్తాబైన ఉద్యానవన విశ్వవిద్యాలయం భవనం

### రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు



తెలంగాణ సాధించుకున్న తర్వాత నిర్మించిన ఉద్యానవన విశ్వవిద్యాలయంతో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది. ఎన్ఏబీఎల్ (నేషనల్ ఆగ్రికల్చర్ బయాలజీ ల్యాబరేటరీ) వంటి అధునాతన హంగులతో నిర్మాణం జరిగింది. పోస్ట్ హార్వెస్టింగ్ విధానానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. నిర్మాణాలపై ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రీసర్చ్) అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. వర్సిటీ ప్రారంభం కాగానే బోధన, పరిశోధనలు మొదలవుతాయి.

*– రవీందర్‌రెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్*

# తేమ పేరుతో తక్కువ ధర

## పత్తి రైతులను ముంచుతున్నారు: తమ్మినేని

**వరంగల్ :** సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కై పత్తి రైతులను నిండా ముంచుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సీపీఎం రాష్ట్ర ప్రతినిధి బృందం సందర్శించింది. సీసీఐ కొనుగోలు కేంద్రంలో కొలుస్తున్న తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించి తేడా రావడంతో సంబంధిత అధికారిని నిలదీశారు. రైతు విక్రయించిన పత్తికి ఏం ధర చెల్లించారని సీసీఐ అధికారి రవీందర్‌ను ప్రశ్నించగా తేమ శాతం 11.50 ఉండడంతో క్వింటాకు రూ.5300 ధరనిర్ణయించినట్లు చెప్పాడు. వెంటనే అదే మిషన్‌తో అదే పత్తిలో తేమను తమ్మినేని పరీక్షించగా మొదటిసారి 9 శాతం, రెండోసారి 9.30 శాతం, మూడోసారి 12.30 శాతం నమోదైంది. మూడింటిని సరాసరి చేయగా 10.30 శాతం వచ్చింది. 10.30 శాతం వస్తే 1.50 శాతం అదనంగా కలిపి ఎలా ధర నిర్ణయించారని నిలదీశారు. తేమ తక్కువ ఉన్నప్పటికీ ఎక్కువ శాతం లెక్కించి సీసీఐ అధికారులు రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటి వరకు వరంగల్ మార్కెట్‌లో రైతులు 4,43,424 క్వింటాళ్ల పత్తి విక్రయించగా అందులో సీసీఐ కేవలం 1,08,823 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసిందని చెప్పారు. సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారులు ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కవడం వల్లే కొనుగోళ్లలో వ్యత్యాసం ఉందన్నారు. ప్రభుత్వం క్వింటాలు పత్తికి మద్దతు ధర రూ.5550 ప్రకటించగా మార్కెట్లలో రైతులకు ఆ ధర లభించడం లేదన్నారు. సీఎం కేసీఆర్ దర్బార్ వదలి రారు.. ఆయనను కలిసేందుకు ప్రజలకు వీలు లేదు.. చివరకు మంత్రులు, ఎమ్మెల్యేకు కూడా కలిసే పరిస్థితులు లేవన్నారు.

### పత్తి తూకంలో మోసం

**వ్యాపారికి రూ.2 లక్షల జరిమానా**

**మరిపెడ రూరల్:** కొందరు పత్తి వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చింతలగడ్డతండా గ్రామ పంచాయతీలోని రైతుల వద్ద ఓ వ్యాపారి 15 లోడుల పత్తిని కొనుగోలు చేశాడు. క్వింటా ఉన్న పత్తిని కేవలం 60 కిలోలు వచ్చేలా కాంటాను సరిచేశాడు. దీంతో అనుమానం వచ్చిన రైతులు పరిశీలించగా.. 20 క్వింటాళ్ల పత్తి వ్యాపారి తూకంలో కేవలం 13 క్వింటాళ్లే కావడంతో రైతులంతా అతడిని నిలదీశారు. తండా పెద్దలు జోక్యం చేసుకొని రైతులను మోసం చేసిన వ్యాపారికి రూ. 2 లక్షలు జరిమాన విధించారు.

### మావో అగ్రనేత రామన్న మృతి?

**సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్త**

**నర్సంపేట రూరల్:** మావోయిస్టు అగ్రనేత రామన్న ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో గుండెపోటుతో మృతి చెందినట్లు వార్త సోషల్ మీడియాల్లో చక్కర్లు కొడుతోంది. అయితే అక్కడి పోలీసులు మాత్రం రామన్న మృతి ధ్రువీకరించలేదని తెలిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టు పార్టీకి ప్రస్తుతం అత్యంత కీలక నేతగా వ్యవహరిస్తున్న రామన్నది వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట ప్రాంతమని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆయన దండకారణ్యం జోనల్ స్పెషల్ కమిటీ (డీకేజేడ్ఎస్‌సీ) కార్యదర్శిగా పని చేస్తున్నాడు. విశాలమైన అటవీ ప్రాంతాల్లోని మావోయిస్టు పార్టీ నక్సల్స్ దళాలకు రామన్న నాయకత్వం వహిస్తున్నారు. అలాంటి అగ్రనేత మృతి చెందాడని సోషల్ మీడియాలో ప్రచారం అవుతుండడంతో చర్చ మొదలైంది. అయితే, ఈ విషయమై ఎవరూ ధృవీకరించడం లేదు.


కామారెడ్డి జిల్లా జంగంపల్లి వద్ద చెట్టును ఢీకొట్టి నుజ్జు నుజ్జు అయిన కారు

# అతివేగం.. తీసింది ప్రాణం

## చెట్టును ఢీకొన్న కారు.. నలుగురి దుర్మరణం

### ఎయిర్‌పోర్టుకు వెళ్లి వస్తుండగా ప్రమాదం ● మృతులంతా నిజామాబాద్ జిల్లా వాసులు


లావణ్య


రోషిణి


సుశీల్


ప్రశాంత్

**భిక్కనూరు:** కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మంతెన జనార్ధన్ దుబాయ్‌లో ఉంటాడు. ఆయన భార్య లావణ్య (35), కూతురు రోషిణి (15) నిజామాబాద్‌లో నివాసముండగా, కుమారుడు హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నాడు. అయితే, జనార్ధన్ ఇంట్లో అద్దెకుండే నాగమణి కుమారుడు అరుణ్ ఆదివారం రాత్రి ఇరాక్‌కు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు కారు ఇవ్వాలని అరుణ్ ఇంటి యజమాని లావణ్యను అడగడంతో ఆమె సరేనంది. హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడ్ని చూసేందుకు తాను కూడా వస్తానని తెలిపింది. దీంతో లావణ్య, ఆమె కూతురు రోషిణి, అరుణ్‌తో పాటు డ్రైవర్ అంగూర్ సుశీల్ (22), అరుణ్ సోదరుడు నవీపేట మండలం సుభాష్‌నగర్‌కు చెందిన మ్యాదరి ప్రశాంత్ (30) ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో కారు (ఏపీ15ఏడీ 5050)లో బయల్దేరారు. ఎయిర్‌పోర్టులో అరుణ్‌ను విడిచి పెట్టిన అనంతరం లావణ్య కుమారుడి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

**అతివేగం, నిద్రమత్తే కారణం!**

అయితే, డ్రైవర్ సుశీల్ నిద్ర మత్తులో అతి వేగంగా నడపడంతో కారు అదుపు తప్పింది. సోమవారం తెల్లవారు జామున 4.30 గంటలకు భిక్కనూరు మండలం జంగంపల్లి వద్దకు రాగానే కారు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. పక్కనే ఉన్న కిలోమీటరు సూచిక రాయిని ఢీకొని, అదే వేగంతో వంద మీటర్ల దూరంలో ఉన్న మర్రి చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలు కారులో ఇరుక్కుపోవడంతో గ్యాస్ కట్టర్‌ను తెప్పించి కారు తలుపులను తొలగించి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ శ్వేత, డీఎస్పీ లక్ష్మీనారాయణ ఘటనా స్థలానికి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.





సోమవారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

# ఢిల్లీలో కదంతొక్కిన ఆదివాసీలు

- లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్
- ఆదివాసీలు తమ హక్కులు పొందలేకపోతున్నారని ఆవేదన

**సాక్షి, న్యూఢిల్లీ:** హక్కుల సాధన కోసం ఆదివాసీలు కదంతొక్కారు. అస్తిత్వ పోరాటాన్ని దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఉధృతం చేశారు. తమ హక్కులను కాలరాస్తున్న లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సోమవారం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం జోడెఘాట్ కేంద్రంగా పురుడుపోసుకున్న ఉద్యమం ఢిల్లీకి చేరింది. ఆదివాసీల హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాకు వేల సంఖ్యలో ఆదివాసీలు తరలివచ్చారు. ప్రత్యేక రైళ్లలో, వాహనాల్లో ఢిల్లీ బాటపట్టారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ ధర్నా చేట్టారు. అలాగే దేశవ్యాప్తంగా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అటవీ భూమిపై హక్కులు కల్పించాలని, ఆదివాసీలపై అటవీ అధికారుల దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల నుంచి ఆదివాసీలు ధర్నాలో పాల్గొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో సరైన విధానం పాటించకుండా లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చారని, దీనివల్ల ఆదివాసీలు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను పొందలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, భూములు, సంక్షేమ పథకాలను లంబాడాలే కొల్లగొడుతున్నారని, ఆదివాసీలు రాజ్యాంగ హక్కులను పొందలేకపోతున్నారని అన్నారు. తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ ఆందోళన చేపట్టినట్టు తెలిపారు. ధర్నాలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రంసక్కు, ములుగు ఎమ్మెల్యే సీతక్క సహా పలు రాష్ట్రాల ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## వందలో మూడు ఉద్యోగాలు దక్కడం లేదు: సోయం

లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల ఆదివాసీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, వందలో మూడు ఉద్యోగాలు కూడా ఆదివాసీలకు దక్కడం లేదని, 97 శాతం రిజర్వేషన్ ఫలాలు లంబాడాలకే దక్కుతున్నాయని బీజేపీ ఎంపీ, సమితి అధ్యక్షుడు సోయం బాపురావు అన్నారు. ఒక క్రమపద్ధతి లేకుండా ఎమర్జెన్సీ కాలంలో లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల ఆదివాసీలు హక్కులు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, న్యాయ, ఇతర కోర్సుల్లో ఆదివాసీలు తమ హక్కులను పొందలేకపోతున్నారని, ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ సభ నిర్వహించినట్టు తెలిపారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని, ఆర్టికల్ 342 ప్రకారం లంబాడాలకు ఎస్టీ హోదాపై చట్టబద్ధత లేదన్నారు. దీనిపై ఇప్పటికే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడినట్టు బాపురావు తెలిపారు.

# పోలీసులపై కేసు పెట్టారా?

**దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న**
**సుప్రీం మార్గదర్శకాల అమలు పత్రాల సమర్పణకు ఆదేశం • విచారణ 12వ తేదీకి వాయిదా**

సాక్షి, హైదరాబాద్

'దిశ' హత్యాచార నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారో లేదో వెల్లడించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పౌర హక్కుల సంఘం (పీయూసీఎల్)–మహారాష్ట్ర ప్రభుత్వం మధ్య కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాలను పోలీసులు అమలు చేసినదీ, లేనిదీ ఈ నెల 12న జరిగే విచారణ సమయంలో తెలియజేయాలని ఆదేశించింది. ఆ మార్గదర్శకాల ప్రకారం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉందని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలుకు సంబంధించిన ఆధార పత్రాలను అందజేయాలని ప్రతివాదులైన హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ ఇతరులను ఆదేశించింది. ఎన్‌కౌంటర్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన రెండు ప్రజాహిత వ్యాజ్యాలపై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో నిందితులను కాల్చి చంపారని, దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడంతోపాటు నిందితుల మృతదేహాలకు తిరిగి పోస్టుమార్టం నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ వివిధ మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు దాఖలు చేసిన ఫిర్యాదును హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ఇదే తరహాలో న్యాయవాది, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్ సభ్యుడు కె. రాఘవేంద్ర ప్రసాద్ దాఖలు చేసిన పిల్‌ను కలిపి ధర్మాసనం విచారించింది. ఉమ్మడి ఏపీలో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్యాచారం కేసులో శ్యాంబాబు అనే యువకుడి పాత్ర ఉందంటూ పోలీసులు అతన్ని మట్టుబెట్టాలని ప్రయత్నించారని, పౌరహక్కుల సంఘాలు సకాలంలో కేసులు వేయడంతో చివరకు ఆ కేసుతో శ్యాంబాబుకు ప్రమేయం లేదని హైకోర్టు తేల్చిందని ఈ సందర్భంగా పిటిషనర్లు గుర్తుచేశారు. 'దిశ' కేసులో నిందితులు రిమాండ్‌లో ఉండగా పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారణ పేరుతో ఘటనా స్థలానికి తీసుకువెళ్లి హత్య చేశారని ఆరోపించారు. పోస్టుమార్టం నివేదికను పరిశీలిస్తే నిందితులను సమీపం నుంచి హతమార్చారని స్పష్టం అవుతోందన్నారు.



### ఎఫ్ఐఆర్ నమోదు చేయక్కర్లేదు: ఏజీ

అనంతరం ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదిస్తూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై దాఖలైన కేసులో ఉమ్మడి ఏపీ హైకోర్టు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం వెలువరించిన తీర్పు అమలును నిలిపివేస్తూ సుప్రీంకోర్టు 2014లో స్టే జారీ చేసిందని గుర్తుచేశారు. పోలీసులపై 302 సెక్షన్ కింది కేసు నమోదు చేయాలని పిటిషనర్లు కోరడం చెల్లదని, ఆత్మరక్షణ కోసమే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారన్నారు. దీనిపై ధర్మాసనం ఘాటుగా స్పందిస్తూ పీయూసీఎల్–మహారాష్ట్ర మధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఆ కేసు తీర్పులోని పేజీ 5లో ఇది స్పష్టంగా ఉందని గుర్తుచేసింది. రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు చట్టం అవుతుందని గుర్తుచేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేసి ఉంటే వాటికి సంబంధించిన పత్రాలను సమర్పించాలని కోరింది. తిరిగి అడ్వొకేట్ జనరల్ వాదిస్తూ ఇదే తరహాలో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలను సుప్రీంకోర్టు సోమవారం విచారించి బుధవారానికి వాయిదా వేసిందని, అక్కడి కేసు విచారణ జరిగిన తర్వాత గురువారం ఈ పిల్స్‌ను విచారించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఏజీ అభ్యర్థన మేరకు ఇక్కడి కేసుల విచారణను 12వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈలోగా ఎన్‌కౌంటర్‌లో హతమైన నలుగురి మృతదేహాలను ఈ నెల 13 వరకూ భద్రపర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో మృతదేహాల్ని భద్రపర్చేందుకు తగిన సౌకర్యాలు లేనట్లయితే వాటిని ఏసీ ఉన్న వాహనంలో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించాలని ఆదేశించింది. మృతదేహాలు చెడిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని భద్రపర్చాలని మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కేసులో కోర్టుకు సహాయకారిగా ఉండేందుకు సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డిని అమికస్ క్యూరీగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

## హైకోర్టు ఆదేశాలతో గాంధీకి మృతదేహాలు

**సాక్షి, హైదరాబాద్:** చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌లో మరణించిన దిశ హత్యకేసు నిందితుల మృతదేహాలను సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఎన్‌కౌంటర్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణ చేపట్టడంతో పాటు పలు ప్రజా సంఘాలు కోర్టులో కేసులు వేశాయి. దీనిపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టడం, ఆ తర్వాత విచారణను గురువారానికి వాయిదా వేయడం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు భారీ బందోబస్తు మధ్య మృతదేహాలను ప్రత్యేక వాహనాల్లో గాంధీ మార్చురీకి తరలించారు. శుక్రవారం వరకు ఇక్కడే భద్రపర్చనున్నారు. మృతదేహాలు కుళ్లిపోకుండా వైద్యులు జాగ్రత్తలు తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రి మార్చురీ సమీపంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## క్లుప్తంగా...

### దిశ కేసులో మరిన్ని ఆధారాలు

**శంషాబాద్:** దిశపై దారుణానికి ఒడిగట్టిన నిందితులు అక్కడి నుంచి లారీలో ఆమెను తీసుకెళ్లిన దృశ్యాలు తాజాగా బయటికొచ్చాయి. నవంబర్ 27న రాత్రి 10.28 గంటలకు లారీ తొండుపల్లి టోల్‌ప్లాజా ముందు నుంచి శంషాబాద్ వైపు జాతీయ రహదారి గుండా వెళ్లింది. ఘటనాస్థలం నుంచి టోల్‌గేట్ కార్యాలయం మీదుగా యూటర్న్ తీసుకుని షాద్‌నగర్ వైపు లారీని మళ్లించినట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి చటాన్‌పల్లి వరకు వెళ్లారు. లారీ వెనుక మరో ఇద్దరు నిందితులు దిశ స్కూటీని తీసుకెళ్లారు. ఈ ఆధారాలు కేసు పురోగతిలో కీలకంగా మారినట్లు సమాచారం.

### ఎస్సై, కానిస్టేబుల్‌ను విచారించిన 'ఎన్‌హెచ్ఆర్సీ'

**గచ్చిబౌలి:** చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌లో గాయపడి చికిత్స పొందుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ అరవింద్‌గౌడ్‌లను విచారించేందుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) బృందం సోమవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రికి వచ్చింది. సాయంత్రం 4 గంటలకు ఆస్పత్రికి చేరుకున్న ఎన్‌హెచ్ఆర్సీ ప్రతినిధులు దాదాపు 3 గంటల పాటు వారిని ఆస్పత్రిలో విచారించింది. నిందితులు ఎలా దాడి చేశారు, గాయాలెక్కడ అయ్యాయి, ఏ సమయంలో ఎన్‌కౌంటర్ జరిగింది, ఆ సమయంలో పోలీసులు ఎవరెవరున్నారు, మొదట కాల్పులు జరిపిందెవరు, ఎదురు కాల్పులు ఎవరు జరిపారనే విషయాలపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.

### రెవెన్యూ, పోలీసు అధికారుల స్టేట్‌మెంట్ రికార్డు

**రాజేంద్రనగర్:** హిమాయత్‌సాగర్‌లోని రాజా బహదూర్ రామ్‌రెడ్డి పోలీస్ అకాడమీలో సోమవారం రెండో రోజు ఎన్‌హెచ్ఆర్సీ అధికారుల విచారణ కొనసాగింది. చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్ అనంతరం నిర్వహించిన పంచనామాలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు, సిబ్బందిని అకాడమీకి పిలిపించి వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఎన్‌కౌంటర్ సమయంలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందిని వేర్వేరుగా పిలిపించి వీరి స్టేట్‌మెంట్లను సైతం రికార్డు చేశారు. రెండ్రోజులుగా అకాడమీలో బస చేసిన ఎన్‌హెచ్ఆర్సీ బృందం ఇక్కడి నుంచే విచారణ కొనసాగిస్తోంది. స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు వచ్చిన వారిని మీడియా కంట పడకుండా పోలీసులు తరలించారు.

### ఎన్‌కౌంటర్ ప్రదేశం త్రీడీ స్కానర్‌తో చిత్రీకరణ

**షాద్‌నగర్‌టౌన్:** దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన ప్రదేశాన్ని క్లూస్ టీం సోమవారం మధ్యాహ్నం త్రీడీ స్కానర్‌తో చిత్రీకరించింది. 8 మంది సభ్యులతో కూడిన బృందం ప్రతినిధులు చటాన్‌పల్లి బ్రిడ్జి వద్దకు చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దిశను దహనం చేసిన స్థలంతో పాటు హంతకులను ఎన్‌కౌంటర్ చేసిన ప్రాంతాన్ని పూర్తి త్రీడీ స్కానర్‌తో చిత్రీకరించారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశ స్వభావం మారిపోయినా గుర్తించేందుకు వీలుగా క్లూస్‌టీం సభ్యులు ఆ ప్రాంతాన్ని మొత్తం స్కాన్ చేసి వీడియో చిత్రీకరణ చేయడంతో పాటుగా ఫొటోలు తీసుకున్నారు. ఎన్‌కౌంటర్ ఘటనాస్థలం వద్ద మరిన్ని ఆధారాలు సేకరించారు. సుమారు రెండున్నర గంటల పాటు టీం సభ్యులు ఇక్కడే ఉన్నారు. కాగా ఎన్‌కౌంటర్ జరిగిన చటాన్‌పల్లి బ్రిడ్జి వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది. సుమారు 50 మంది పోలీసులు ఇక్కడ విధుల్లో ఉన్నారు. ఎన్‌కౌంటర్ ఘటనా స్థలానికి ఎవరూ వెళ్లకుండా జాతీయ రహదారి వద్దే కట్టడి చేస్తున్నారు.

### ఏపీ సీఎం జగన్‌కు అభినందనలు



**సాక్షి, హైదరాబాద్:** దిశ హత్య లాంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగే విధంగా ఏపీ అసెంబ్లీలో కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టినందుకు ఆ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్‌పర్సన్ విజయశాంతి అభినందనలు తెలిపారు. సోషల్‌మీడియాలో మహిళలకు అసభ్య సందేశాలు పంపే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని అసెంబ్లీలో జగన్ చెప్పడం హర్షణీయమని సోమవారం ఆమె ఒక ప్రకటనలో వెల్లడించారు. మహిళల భద్రత కోసం ఏపీ తరహాలో తెలంగాణలో కూడా పకడ్బందీ చట్టాన్ని తీసుకురావాలని విజయశాంతి కోరారు.

### వైఎస్సార్‌సీపీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



**సాక్షి, హైదరాబాద్:** మహిళల భద్రత కోసం ఏపీ అసెంబ్లీలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తేవాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మృగాళ్లపై త్వరితగతిన విచారణ జరిపి, 21 రోజుల్లోపే ఉరిశిక్ష వేయాలని ఏపీ అసెంబ్లీలో ప్రతిపాదన చేయడం హర్షణీయమన్నారు. ఏపీ అసెంబ్లీని స్ఫూర్తిగా తీసుకుని, మిగిలిన రాష్ట్రాలూ అసెంబ్లీలో కూడా ఇదే తరహా తీర్మానాలు చేసి కేంద్రానికి పంపాలన్నారు. మహిళల భద్రత కోసం ప్రతిపాదించిన ఈ చట్టాన్ని మోదీ ప్రభుత్వం ఆమోదిస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

# ఈ 'సిట్' నివేదిక ఎప్పుడో?

- తెలంగాణలో ఆరోసారి ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు
- 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ కేసు విచారణకు 8 మంది అధికారులు
- డ్రగ్స్, నయీం, ఐటీగ్రిడ్ కేసుల్లో ఇప్పటికీ కానరాని పురోగతి

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ హత్యాచారం, నిందితుల ఎన్‌కౌంటర్‌పై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తెలంగాణలో ఆరవది. మొత్తం 8 మంది సభ్యులున్న ఈ సిట్‌కు రాచకొండ సీపీ మహేశ్ భగవత్ నేతృత్వం వహించనున్నారు. గతంలో ఆసిఫ్‌నగర్ బాలుడి దహనం, వికారుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసుల్లో సిట్ దర్యాప్తులు పూర్తయ్యాయి. కానీ, నయీం ఆస్తుల కేసు, టాలీవుడ్ డ్రగ్స్ కేసు, ఐటీ గ్రిడ్ కేసుల్లో ఇప్పటికీ దర్యాప్తు పూర్తికాలేదు.

**నయీం ఆస్తుల కేసు: 2016, ఆగస్టు 8**
తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక జరిగిన ఎన్‌కౌంటర్లలో అత్యంత సంచలనం రేపిన ఎన్‌కౌంటర్లలో నయీం ఎన్‌కౌంటర్ ఒకటి. దశాబ్దానికిపైగా పరారీలో ఉండి.. పలు హత్యలు, కిడ్నాప్‌లు, బెదిరింపులు, బలవంతపు వసూళ్లు, భూకబ్జాలకు పాల్పడ్డ గ్యాంగ్‌స్టర్ నయీం షాద్‌నగర్‌లోని మిలీనియం టౌన్‌షిప్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. తరువాత నయీం ఆస్తుల కేసు విచారణకు ప్రభుత్వం ఐజీ నాగిరెడ్డి నేతృత్వంలో 'సిట్'ఏర్పాటు చేసింది. ఇది ఇంకా రిపోర్టును సమర్పించలేదు.

**టాలీవుడ్ డ్రగ్స్ కేసు : 2017, ఏప్రిల్ 8**
దేశవ్యాప్తంగా సంచలనం రేపిన డ్రగ్స్ కేసుల్లో టాలీవుడ్ డ్రగ్స్ కేసు ప్రముఖమైనది. చిన్నారులను లక్ష్యంగా చేసుకుని నగరంలో సాగిన ఈ డ్రగ్స్ దందా అంతు తేల్చాలని అప్పటి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించింది. పలువురు టాలీవుడ్ అగ్ర తారలు, దర్శకులు, నిర్మాతలు, నటులు, టెక్నీషియన్లను సిట్ విచారించడంతో ఇది జాతీయ స్థాయిలో సంచలనంగా మారింది. తరువాత దర్యాప్తు అధికారులు మారారు. ఈ సిట్ కూడా ఇప్పటికీ నివేదిక సమర్పించలేదు.

**ఐటీ గ్రిడ్ కేసు : 2019, మార్చి 3**
ఏపీ, తెలంగాణ ప్రజలకు చెందిన వ్యక్తిగత సమాచారాన్ని తెలుగుదేశం పార్టీకి చెందిన సేవామిత్ర యాప్ ద్వారా తస్కరిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు మాదాపూర్‌లో మార్చి 3వ తేదీన కేసు నమోదైంది. రెండు రాష్ట్రాల ప్రజలకు చెందిన సమస్య కావడంతో ఈ కేసు విచారణకు ప్రభుత్వం ఐజీ స్టీఫెన్ రవీంద్ర నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ విచారణ మందకొడిగా సాగుతోంది.

## చీఫ్ మినిస్టర్ చీప్‌గా మాట్లాడుతున్నారు

**కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ధ్వజం**



**సాక్షి, హైదరాబాద్:** కేంద్రం నుంచి నిధులు సక్రమంగా రావడం లేదని, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు ఖర్చులు తగ్గించుకోవాలన్న సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ మండిపడ్డారు. తగ్గించుకోవాల్సింది ప్రభుత్వ శాఖల ఖర్చులు కాదని, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దోపిడీ అని ఎద్దేవా చేశారు. చీఫ్ మినిస్టర్ చాలా చీప్‌గా మాట్లాడుతున్నారని విమర్శించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడేళ్లుగా ఆర్థిక మందగమనం కొనసాగుతోందని అన్నారు. కేంద్రం నుంచి రావాల్సింది రూ.వెయ్యి కోట్లు అయితే రాష్ట్రం చెల్లించాల్సింది రూ.50 వేల కోట్లకు పైగా ఉందన్నారు. నిధులకు, బకాయిలకు పొంతన లేకుండా కేసీఆర్ రాష్ట్రాన్ని దివాలా తీయించారని విమర్శించారు. తన అసమర్థ ఆర్థిక విధానాలతో రాష్ట్రాన్ని ఆరేళ్లలో రూ.3 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. ఇప్పుడు నెలకు రూ.4 వేల కోట్ల అప్పులు చేస్తేనే కానీ గడవని పరిస్థితి నెలకొందని తెలిపారు. బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి బకాయిల తెలంగాణగా మార్చారని ఆరోపించారు. మద్యం మీద తప్ప ఇతర ఆదాయ మార్గాలు పెంచుకోకుండా కేంద్రంపై నెపం నెడుతున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ స్థాయి తగ్గించుకుని ప్రధాని మోదీపై చవకబారు విమర్శలు చేయడం మానుకోవాలని, తమపై ఎదురుదాడి చేస్తే ఎవరూ ఊరుకోరని స్పష్టం చేశారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## మేం వ్యతిరేకిస్తున్నాం

**పౌరసత్వ సవరణ బిల్లుపై నామా**



**సాక్షి, న్యూఢిల్లీ:** పౌరసత్వ (సవరణ) బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం లోక్‌సభలో బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'మేం లౌకిక విధానాలకు అనుగుణంగానే ఉంటాం. భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకుంటాం. ఈ బిల్లు మతప్రాతిపదికన పౌరసత్వం దఖలుపరచనుంది. ఇది మన రాజ్యాంగ మూల సూత్రాలకు వ్యతిరేకం. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 ఏళ్లు గడిచిన సందర్భాన్ని మనం ఇటీవలే సంబరంగా జరుపుకున్నాం. అయితే ఈ బిల్లు ముస్లిం మైనారిటీలు పౌరసత్వం పొందకుండా మినహాయిస్తోంది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఇది తగదు. విభిన్న భాషలు, విభిన్న సంస్కృతికి ఆలవాలంగా ఉన్న దేశంలో ఈ చర్య తగనిది. ముస్లింలకు వ్యతిరేకంగా ఈ బిల్లు ఉన్నందున మేం వ్యతిరేకిస్తున్నాం. భారతదేశం విభిన్న మతాలు, కులాలు ఉన్న దేశం. ఈ దేశంలో మైనారిటీ ముస్లిం సోదరులకు కూడా పౌరసత్వం పొందే జాబితాలో చోటు కల్పించాలని కేంద్రాన్ని కోరుతున్నాం. అలా చేయని పక్షంలో ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు మేం వ్యతిరేకంగా ఓటు వేస్తాం. ఇది టీఆర్ఎస్ విధానం. మైనారిటీ సోదరులకు అండగా ఉంటాం. వారిని కూడా ఈ బిల్లులో చేర్చాలి'అని పేర్కొన్నారు. ఈ సందర్భంలో బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అభ్యంతర పెట్టడంతో టీఆర్ఎస్ ఎంపీ వెంకటేశ్ నేత గొడవకు దిగారు. సంజయ్ లేచి హిందువుల ప్రయోజనాలు మాత్రం టీఆర్ఎస్‌కు పట్టవా, హిందువులు ఓట్లేయలేదా అంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17న విమోచన దినం ఎందుకు నిర్వహించడం లేదంటూ ప్రశ్నించారు. వాగ్వాదం వద్దులే అన్నట్టుగా హోంమంత్రి అమిత్ షా సంకేతం ఇవ్వడంతో సంజయ్ కూర్చున్నారు. అయితే దీనిపై వెంకటేశ్ తీవ్ర అభ్యంతరం చెబుతూ ఫ్లోర్‌లీడర్ మాట్లాడుతున్నప్పుడు ఇలా గొడవకు దిగడం ఏ నిబంధన కిందికి వస్తుందంటూ ప్రశ్నించారు.

# ఎన్‌ఏఐపీలో వెనుకబాటు

**పశువుల కృత్రిమ గర్భధారణలో వెనుకబడ్డ రాష్ట్రం | పనితీరు మెరుగుపరచుకోవాలంటూ కేంద్రం లేఖ**

**సాక్షి, హైదరాబాద్:** పశువుల కృత్రిమ గర్భధారణలో రాష్ట్రం వెనుకబడిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశంలో మేలుజాతి పశువుల ఉత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జాతీయస్థాయి కృత్రిమ గర్భధారణ కార్యక్రమం (ఎన్ఏఐపీ)లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 6.6 లక్షల పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాల్సి ఉంది. కానీ, 3 నెలల క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు కేవలం 80 వేల పశువులకు మాత్రమే చేయించగలిగారు. ఇందుకు రైతుల్లో అవగాహన కల్పించలేకపోవడంతో పాటు రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖల మధ్య సమన్వయ లోపమే కారణంగా కనిపిస్తోంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో ఉన్న పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించే విషయంలో ఈ రెండు విభాగాల మధ్య తలెత్తిన అనారోగ్యకర పోటీ కారణంగానే కార్యక్రమం సజావుగా జరగడం లేదని ఉన్నతాధికారుల స్థాయిలోనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా రెండు విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయించి సమన్వయంతో పనిచేయాలని సూచించాల్సి వచ్చింది. ఇక 24 జిల్లాల్లో కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ఓ మోస్తరుగా జరుగుతుండగా, ఆదిలాబాద్, హైదరాబాద్, కామారెడ్డి, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూలు, నారాయణపేట, నిజామాబాద్, సూర్యాపేట, వనపర్తి జిల్లాల్లో మాత్రం పూర్తిగా వెనుకబడ్డట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**వారానికోసారి కలెక్టర్లతో సమీక్షించండి**
రాష్ట్రంలో పశువుల కృత్రిమగర్భధారణ కార్యక్రమంపై కేంద్రం కూడా ఇటీవల ఓ ఘాటు లేఖ రాసింది. పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, వెటర్నరీ అధికారులకు కేంద్ర పశుసంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీ మిహిర్ కుమార్‌సింగ్ ఇటీవల రాసిన లేఖలో రాష్ట్రం పనితీరును ఆక్షేపించారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని గతంలో కూడా రెండు సార్లు లేఖలు రాశామని, అయినప్పటికీ తెలంగాణలో మార్పులేదని ఆ లేఖలో పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ నెలకోసారి సమావేశం జరపడంతో పాటు సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్లు వారానికోసారి సమీక్షించేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కలిగించడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతిరాజ్ ఇంజినీరింగ్ శాఖ
రీజినల్ ఆఫీసర్ కార్యాలయం, PR రీజినల్ ఆఫీస్, ఆదిలాబాద్
NIT No. 85 to 87/RO/2019-20, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది: 04.12.2019
పనుల సంఖ్య (3), పనుల పేరు: నిర్మల్, మంచిర్యాల, కుమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలలో ST సంఘం బిల్డింగ్ నిర్మాణం, గ్రీన్ ఫీల్డ్ స్టేడియం నిర్మాణం, రూరల్ లైవ్ స్టాక్ యూనిట్ నిర్మాణం కొరకు దిగువ సంతకదారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV రూ. 3.00 కోట్లు. టెండరు డాక్యుమెంట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో తేదీలు: 11.12.2019 నుండి 18.12.2019 మధ్య లభిస్తాయి మరియు ప్రచురించిన తేది నుండి పైన తెలిపిన తేదీల మధ్య 7 రోజుల కొరకు లభించును. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in లో పొందవచ్చును.
సం/- రీజినల్ ఆఫీసర్ (PR), రీజినల్ ఆఫీస్, ఆదిలాబాద్
DIPR RO.No.1919-DP/CL/Advt/1/2019-20, Dt: 09.12.2019

AP Content Corporation (APCC)
(A Government of AP Undertaking)
4th Floor, NTR Administrative Block, Pandit Nehru Bus Station, NH-65, Vijayawada-520001 (AP)
Notice Inviting Expression of Interest (EoI)
Rc.No. ENE68-OPCS0AGNC (AGMT)/2/2019-BDG, Dt. 05.12.2019
APCC is inviting EOI from eligible individuals for Empanelment to work on Freelance Basis for the various Content related works undertaken by APCC. Interested individuals may download the details https://www.apcc.ap.gov.in/from 10.12.2019 onwards.
Sd/- Chairman & Managing Director
DIPR Ro No: 263PP/CL/ADVT/1/1/2019-20 Dt: 09.12.2019

ICAR - నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్
రాజేంద్రనగర్, హైదరాబాద్-500030
& యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
దిగువ వాటి కోసం ఉమ్మడిగా అడ్మిషన్లు ప్రకటిస్తున్నారు
పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఇన్ అగ్రికల్చర్ (PGD-TMA)-2020
(ఒక సంవత్సరం డిస్టెన్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్)
అర్హత:
- అగ్రికల్చర్/సోషల్ సైన్సెస్/ఫిజికల్ సైన్సెస్ మేనేజ్‌మెంట్/లైఫ్ సైన్సెస్/ఇంజినీరింగ్/లా లో పోస్ట్ గ్రాడ్యుయేట్ (లేదా)
- అగ్రికల్చరల్ సైన్సెస్/సోషల్ సైన్సెస్/ఫిజికల్ సైన్సెస్ మేనేజ్‌మెంట్/లైఫ్ సైన్సెస్ ఇంజినీరింగ్ /లా లో గ్రాడ్యుయేట్, రెండు సంవత్సరాల పని అనుభవంతో
ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది : 10-12-2019
ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు ఆఖరు తేది: 31-01-2020
తదుపరి వివరాల కోసం https://www.naarm.org.inకు లాగాన్ అవండి.
సంప్రదించు నం.లు: 040-24581341 / 24581308/271
ఇ-మెయిల్: tma2020@naarm.org.in, pgsunit@naarm.org.in
JD (Admin) & రిజిస్ట్రార్

భారత ప్రభుత్వం
కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ
పోస్టల్ విభాగం, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్
పబ్లిక్ నోటిఫికేషన్
Lapsed PLI / RPLI పాలసీల విధానాల పునరుద్ధరణ
తపాలా జీవిత భీమా Lapsed పాలసీల రివైవల్ గురించి
భారత ప్రభుత్వ తపాలా శాఖ వారు అందించే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మరియు రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ వినియోగదారులకు తెలియజేయునది ఏమనగా సవరించబడిన తపాలా జీవిత భీమా నియమనిబంధనలు మరియు షరతులకు లోబడి తపాలా జీవిత భీమా / గ్రామీణ తపాలా జీవిత భీమా పాలసీలు చివరి ప్రీమియం చెల్లించిన నెల నుండి ఐదు సంవత్సరములు దాటిన పాలసీలను 01.01.2020 తేదీ నుండి తిరిగి పునరుద్ధరించబడవు. చివరి ప్రీమియం చెల్లించిన నెల నుండి ఐదు సంవత్సరాలు పూర్తయిన పాలసీలను సరైన ఆరోగ్య ధ్రువీకరణ పత్రముతో తిరిగి పునరుద్ధరించుకొనుటకు 31.12.2019 తేదీ వరకు మరొక అవకాశము ఇవ్వడమైనది. PLI / RPLI పాలసీదారులు భీమా ప్రయోజనాలు పొందడానికి వెంటనే మీ దగ్గరలో ఉన్న ఏదైనా తపాలా కార్యాలయములో పునరుద్ధరించుకోగలరు (రివైవల్), లేనిచో అర్హతలేని (Lapse అయిన) పాలసీలను 31.12.2019 తరువాత ఎటువంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా తొలగించ బడును . పూర్తి వివరములకై మీ దగ్గరలోని ఏదేని తపాలా కార్యాలయాన్ని సంప్రదించగలరు . ఈ సదావకాశమును PLI మరియు RPLI పాలసీదారులు వినియోగించుకోగలరు.
గమనిక: తేదీ 31.12.2019 మరియు తదుపరి నిలిపివేసిన పాలసీలు తిరిగి పునరిద్ధరించబడవు సరిగదా నియమ నిభందనలననుసరించి పూర్తిగా రద్దయిన పాలసిలుగా పరిగణించబడును.
Sd/-
చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్,
తెలంగాణ సర్కిల్, హైదరాబాద్- 500 001.

# పౌరసత్వ సవరణ బిల్లుకు ఆమోదం

**లోక్‌సభలో అనుకూలంగా 311, వ్యతిరేకంగా 80 ఓట్లు**

- సభలో వాడివేడి చర్చ
- సుదీర్ఘ సమాధానమిచ్చిన అమిత్ షా
- భారతీయ ముస్లింలకు ఈ బిల్లుతో సంబంధం లేదని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లుకు సోమవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. వాడి, వేడి చర్చ అనంతరం, విపక్ష సభ్యుల నిరసనల మధ్య బిల్లుపై స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. ఓటింగ్‌లో అనుకూలంగా 311, వ్యతిరేకంగా 80 ఓటేశారు. దాంతో, మూడు పొరుగు దేశాలు.. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొని భారత్‌కు వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లైంది. అంతకుముందు, పలువురు ఎంపీల సవరణ ప్రతిపాదనలను సభ మూజువాణి ఓటుతో తోసిపుచ్చింది. ఈ బిల్లుపై సభలో దాదాపు 7 గంటల పాటు చర్చ జరిగింది. అనంతరం, చర్చకు సమాధానమిస్తూ హోంమంత్రి అమిత్ షా సుదీర్ఘ వివరణ ఇచ్చారు. విపక్ష విమర్శలను తిప్పికొట్టారు. 'రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారమే ఈ బిల్లు ఉంది. సమానత్వ హక్కును కల్పించే ఆర్టికల్ 14 సహా రాజ్యాంగంలోని ఏ అధికరణకు కూడా ఈ బిల్లు ఉల్లంఘన కాదు' అని అన్నారు. భారత్‌లోని ముస్లింలకు ఈ బిల్లుతో ఏ విధమైన సంబంధం లేదని, ప్రధానిగా మోదీ ఉన్నంతవరకు మైనారిటీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

**రోహింగ్యాలకు నో.. ఎన్నార్సీకి ఎస్**

రోహింగ్యాలకు పౌరసత్వం కల్పించే ప్రసక్తే లేదని అమిత్ షా మరోసారి తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా ఎన్నార్సీని అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. పొరుగుదేశాల్లో మతపరమైన వేధింపులకు గురై భారత్‌కు వచ్చి, బాధాకర జీవనం గడుపుతున్నవారికి ఊరట కల్పించేందుకే ఈ బిల్లును తీసుకువచ్చామన్నారు. 1947లో మత ప్రాతిపదికన దేశ విభజన జరిగి ఉండకపోతే.. ఇప్పుడు ఈ బిల్లు అవసరమే ఉండేది కాదని అమిత్ షా వ్యాఖ్యానించారు. 'పాక్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ దేశాల్లో మత వివక్ష ఎదుర్కొంటూ 2014, డిసెంబర్ 31 లోపు భారత్‌కు వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులను అక్రమ శరణార్థులుగా భావించం. వారికి భారత పౌరసత్వం కల్పిస్తాం' అని ఆ బిల్లులో పేర్కొన్నారు. బిల్లు ఆమోదం పొందడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. శతాబ్దాల సంప్రదాయమైన ఆత్మీయీకరణ, మానవీయతలో భాగంగానే ఈ బిల్లు రూపొందిందన్నారు.

**డివిజన్ ఓట్‌తో..**

అంతకుముందు, విపక్షాల తీవ్ర నిరసనల మధ్య ఈ బిల్లును అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల్లో మతపరమైన వేధింపులు, మతహింస ఎదుర్కొన్న ముస్లిమేతరులకు భారతీయ పౌరసత్వం కల్పించే ఈ ప్రతిపాదనకు 130 కోట్ల భారతీయుల ఆమోదం ఉందని ఈ సందర్భంగా షా స్పష్టం చేశారు. డివిజన్ ఓట్ అనంతరం బిల్లును సభలో ప్రవేశపెట్టారు. డివిజన్ వోట్‌లో అనుకూలంగా 293 ఓట్లు, వ్యతిరేకంగా 82 ఓట్లు వచ్చాయి. రాజ్యాంగ విరుద్ధమని, ముస్లింలకు వ్యతిరేకమని విపక్ష సభ్యులు ఆధిర్ రంజన్ చౌధురి(కాంగ్రెస్), సౌగత రాయ్(టీఎంసీ), ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్(ఆర్‌ఎస్పీ), గౌరవ్ గొగొయి(కాంగ్రెస్), శశిథరూర్(కాంగ్రెస్), అసదుద్దీన్ ఒవైసీ(ఎంఐఎం) తదితరులు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లును ప్రవేశపెడ్తూ.. కాంగ్రెస్‌పై షా మండిపడ్డారు. 'శరణార్థులు, చొరబాటుదారుల మధ్య తేడాను మనమంతా గుర్తించాల్సి ఉంది. ఈ బిల్లు ఎవరికీ వ్యతిరేకం కాదు.ఎవరి హక్కులనూ లాక్కోదు' అని అన్నారు.

**'ఇన్నర్ లైట్ పర్మిట్'లోకి మణిపూర్**

ఈ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల ఆందోళనలపై స్పందిస్తూ.. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఈశాన్య ప్రాంత ప్రజల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉందని షా తెలిపారు. ఈ బిల్లు పరిధిలో లేని 'ఇన్నర్ లైన్ పర్మిట్' ప్రాంతంలోకి మణిపూర్‌ను కూడా చేరుస్తున్నామన్నారు. మూడు పొరుగుదేశాల్లో మత వేధింపులను ఎదుర్కొన్న ముస్లిమేతరులకు రేషన్ కార్డ్ సహా ఎలాంటి పత్రాలు లేనప్పటికీ.. భారతీయ పౌరసత్వం కల్పిస్తామన్నారు. గతంలోనూ ఇలాంటి హక్కులు కల్పించారని, ఆ కారణంగానే ప్రస్తుత పాకిస్తాన్ నుంచి వచ్చిన మన్మోహన్ సింగ్ ప్రధాని, ఎల్‌కే అడ్వాణీ ఉప ప్రధాని కాగలిగారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సభలో వాడివేడి చర్చ చోటు చేసుకుంది. ఈ బిల్లు లౌకికత అనే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని చర్చలో పాల్గొన్న కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ విమర్శించారు. 'సమానులను సమానం కాని వారుగా గుర్తించకూడదు. భారత్‌కు ఎవరు వచ్చినా వారు శరణార్థులే. మతం ప్రాతిపదికన వారిని వేరువేరుగా చూడకూడదు' అన్నారు. బిల్లుకు ఎన్డీయే మిత్ర పక్షాలైన జేడీయూ, ఎల్‌జేపీలు మద్దతు తెలిపాయి. ఈ బిల్లులో ముస్లింలను కూడా చేర్చాలని, బిల్లుకు మద్దతు తెలుపుతూ వైఎస్సార్సీపీ, బిజూ జనతాదళ్ సూచించాయి. ఈ బిల్లును వ్యతిరేకించే వారంతా హిందూ వ్యతిరేకులు అనే ప్రచారాన్ని ప్రభుత్వం చేస్తోందని కాంగ్రెస్ సభ్యుడు ఆధిర్ రంజన్ చౌధురి విమర్శించారు. 'ఈ బిల్లు వివక్షాపూరితం. రాజ్యాంగ పునాదులనే ఇది దెబ్బ తీస్తుంది. హిందూ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే దిశగా ఇది తొలి అడుగు' అని మండిపడ్డారు.

**మా రాష్ట్రంలో ఒప్పుకోం: మమత...** ఈ బిల్లును కానీ, జాతీయ పౌర రిజిస్టర్(ఎన్నార్సీ)ని కానీ తమ రాష్ట్రంలో అనుమతించబోమని పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ పునరుద్ఘాటించారు. పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెడ్తున్న నేపథ్యంలో.. ఈశాన్య రాష్ట్రాల్లో ఈ బిల్లుపై ఆందోళనలు ఊపందుకున్నాయి.



### బిల్లు ప్రతిని చించేసిన ఒవైసీ

పౌరసత్వ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్న ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. తన ప్రసంగం చివరలో ఈ బిల్లు ప్రతిని చించేశారు. 'ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. మేమూ మనుషులమే. ఈ వివక్షకు కారణమేంటి? అస్సాం ఎన్ఆర్సీలో 19 లక్షల మంది పేర్లు లేవు. ముస్లింలకు స్వదేశమంటూ లేకుండా చేయడం వీరి ఉద్దేశం. రెండోసారి విభజన జరగాలని మీరు కోరుకుంటున్నారా? ఈ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉంది' అంటూ ప్రతిని చించేసి తన ప్రసంగాన్ని ముగించారు.

## క్లుప్తంగా...

### దేశంలో ఎక్కడికైనా వలస వెళ్లొచ్చు: కేంద్ర మంత్రి

**న్యూఢిల్లీ:** మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందేందుకు దేశంలోని ఏ ప్రాంతానికైనా వలస వెళ్లేందుకు ప్రతి పౌరుడికి హక్కు ఉందని కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ గాంగ్వార్ అన్నారు. భారత రాజ్యాంగం ఈ హక్కును ప్రతి ఒక్కరికి కల్పిస్తుందని లోక్‌సభలో పేర్కొన్నారు. మెరుగైన అవకాశాలు, డిమాండ్, సప్లై మధ్య అంతరం, మార్కెట్ కారకాల వంటివి వలసల వైపు మొగ్గుచూపుతాయని, ప్రభుత్వ పథకాలను అమలు చేయడం ద్వారా ఉద్యోగితను సృష్టించవచ్చని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) క్లాజ్ (డీ), (ఈ)లు దేశంలోని ఏ ప్రాంతానికైనా వలస వెళ్లేందుకు అవకాశం కల్పిస్తాయని పేర్కొన్నారు.

### సైనిక్ స్కూళ్లలో బాలికలకు ప్రవేశాలు

**న్యూఢిల్లీ:** 2020–21 విద్యా సంవత్సరానికి పైలట్ ప్రాజెక్టుగా ఐదు సైనిక్ స్కూళ్లలో బాలికల ప్రవేశాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పుడు దేశంలో మరో 31 సైనిక్ స్కూళ్లలో బాలికల ప్రవేశాలకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. దీనికోసం కాలపరిమితి గల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామని రాజ్యసభలో సోమవారం వెల్లడించింది. కలికిరి (ఆంధ్రప్రదేశ్), కొడగు (కర్ణాటక), ఘోరఖల్ (ఉత్తరాఖండ్), చంద్రాపూర్ (మహారాష్ట్ర), బీజాపూర్ (కర్ణాటక)ల్లోని సైనిక్ స్కూళ్లలో బాలికల ప్రవేశాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రక్షణ సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్ ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు. ఆ స్కూళ్లలో బాలికలకు ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు.

### ఢిల్లీలో పగటివేళ మాత్రమే నిర్మాణాలు: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** ఢిల్లీ–నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్)లో జరుగుతున్న నిర్మాణాలపై ప్రస్తుతం అమలవుతున్న ఆంక్షలను సుప్రీంకోర్టు పాక్షికంగా ఎత్తివేసింది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు నిర్మాణాలు చేపట్టుకోవచ్చని స్పష్టంచేసింది. అయితే సాయంత్రం 6 నుంచి ఉదయం 6 వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనం స్పష్టం చేసింది. భవన నిర్మాణాలను, కూల్చివేతలను తాత్కాలికంగా ఆపివేయాలంటూ గత నెల 4న సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

# ఉప ఎన్నికల్లో బీజేపీ విజయభేరి

- 15కు గాను 12 సీట్లలో గెలుపు; 2 సీట్లు కాంగ్రెస్‌కు; జేడీఎస్‌కు సున్నా
- కర్ణాటకలో యడియూరప్ప సర్కారుకు పూర్తి మెజారిటీ



కొడుకు విజయేంద్రకు మిఠాయి తినిపిస్తున్న ముఖ్యమంత్రి యడియూరప్ప

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటక ఉప ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. 15 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 12 సీట్లను కమలం పార్టీ గెల్చుకుంది. రెండు స్థానాల్లో కాంగ్రెస్, ఒక స్థానంలో బీజేపీ రెబల్ విజయం సాధించారు. డిసెంబర్ 5న ఎన్నికలు జరగగా, ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఈ విజయంతో రాష్ట్రంలో యడియూరప్ప ప్రభుత్వం మెజారిటీ మార్క్‌ను సొంతంగా సాధించుకున్నట్లైంది. అసెంబ్లీలో మొత్తం 225 (ఒక నామినేటెడ్‌సహా) సీట్లు కాగా, రెండు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 223 స్థానాలకు 112 మెజారిటీ మార్క్. ప్రస్తుతం ఉన్న 105 స్థానాలకు తాజా విజయంతో మరో 12 సీట్లను బీజేపీ కలుపుకుంది. దాంతో, అసెంబ్లీలో బీజేపీ బలం 117కి చేరుకుని, మెజారిటీ మార్క్‌ను సునాయాసంగా దాటేసింది. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ఘోర పరాజయాన్ని మిగిల్చాయి. ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎల్పీ నేత సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు గుండూరావు తమ పదవులకు రాజీనామా చేశారు. శివాజీనగర, హుణసూరు నియోజకవర్గాల్లో మినహాయించి మిగిలిన అన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. శివాజీనగర్‌లో రిజ్వాన్ అర్షద్, హుణసూరులో మంజునాథ్‌లు గెల్చారు. హొసకోటలో బీజేపీ తిరుగుబాటు అభ్యర్థి శరత్ గెలుపొందారు. జేడీఎస్ అభ్యర్థులు పోటీ చేసిన 12 స్థానాల్లోనూ ఓడిపోయారు. ఉప ఎన్నికలు జరిగిన ఈ 15 సీట్లలో 12 కాంగ్రెస్‌వే. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ 15 సీట్లకు గానూ.. 12 స్థానాల్లో కాంగ్రెస్, 3 సీట్లలో జేడీఎస్ గెలుపొందాయి.

**ఆ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు**

ఈ ఎన్నికల్లో మెజారిటీని ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు యడియూరప్ప కృతజ్ఞతలు తెలిపారు. మిగతా మూడున్నరేళ్లు సుస్థిర, ప్రగతిశీల పాలన అందిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తానన్న హామీ విషయంలో వెనక్కు వెళ్లబోనన్నారు. ప్రస్తుతం, ముఖ్యమంత్రి సహా కేబినెట్‌లో 18 మంది మంత్రులున్నారు. మంత్రిమండలిలో మొత్తం 34 మందికి చోటు కల్పించే అవకాశం ఉంది.

**వెన్నుపోటుదారులకు మద్దతిచ్చారు**

ఉప ఎన్నికల ఫలితాలపై బహుభాషా నటుడు ప్రకాష్ రాజ్ ట్వీట్ చేశారు. 'అభినందనలు కర్ణాటక. వెన్నుపోటు పొడిచే వ్యక్తులు మళ్లీ ముందుకు వచ్చారు. వారే మీకు తిరుగుబాణం అవుతారని ఆశిస్తున్నాను. అనర్హులకు మద్దతు ఇచ్చారు, మంచిది' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

### తిరుగుబాటు ఎమ్మెల్యేల గెలుపు

కాంగ్రెస్, జేడీఎస్‌లకు చెందిన 17 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి, బీజేపీకి మద్దతివ్వడంతో, ఈ జూలై నెలలో జేడీఎస్ నేత కుమారస్వామి నేతృత్వంలోని కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వం కుప్పకూలింది. యడియూరప్ప ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. ఆ 17 మందిని స్పీకర్ అనర్హులుగా ప్రకటించారు. జూలై 29న యడియూరప్ప అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గారు. స్పీకర్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థిస్తూనే, ఆ ఎమ్మెల్యేలు ఉప ఎన్నికల్లో పోటీ చేసే చాన్సిచ్చింది. మస్కి, ఆర్‌ఆర్ నగర్ స్థానాలకు సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో ఆ స్థానాలను మినహాయించి, 15 స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్, జేడీఎస్‌లపై తిరుగుబాటు చేసి తమ పార్టీలో చేరి, అనర్హతకు గురైన ఎమ్మెల్యేల్లో 13 మందిని బీజేపీ పోటీలో నిలపగా 11 మంది గెల్చారు.

### ఏ కోర్టూ నన్నేమీ చేయలేదు: నిత్యానంద



**న్యూఢిల్లీ:** అత్యాచారం ఆరోపణలతో దేశం వదిలి పారిపోయిన వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు నిత్యానంద మరోసారి రెచ్చిపోయారు. ఏ వెదవ కోర్టూ తనను ఏమీ చేయలేదని, తానే పరమశివుడినని వ్యాఖ్యానించారు. గుర్తు తెలియని ప్రాంతం నుంచి విడుదల చేసిన ఓ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. 'నన్నెవరూ ముట్టుకోలేరు. నేను మీకు నిజం చెబుతా. నేనే పరమ శివుడిని. అర్థమైందా? ఈ నిజాన్ని ప్రకటించినందుకు ఏ వెదవ కోర్టూ నన్ను విచారించలేదు. నేనే పరమశివుడిని. నాదీ గ్యారెంటీ. మీకెవరికీ మరణం లేదు'అంటూ నిత్యానంద వ్యాఖ్యానించడం వీడియోలో కనిపించింది. ఇదిలా ఉండగా దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతిని రవీశ్‌కుమార్ మాట్లాడుతూ అన్ని దేశాల్లోని కార్యాలయాలను అప్రమత్తం చేశామని, నిత్యానంద గురించి స్థానిక ప్రభుత్వాలకు వివరించాలని స్పష్టం చేసినట్లు తెలిపారు.

**• పేలిన అగ్నిపర్వతం**



సోమవారం న్యూజిలాండ్ తూర్పు తీరం నుంచి 50 కి.మీ.ల దూరంలో ఉన్న తెల్లని అగ్నిపర్వతం బద్దలైన దృశ్యం. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. పేలిన సమయంలో దాదాపు 50 మంది అక్కడ ఉన్నారు. మిగిలిన వారిని రక్షించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

### కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పారు: మోదీ

**బర్హి/బొకారొ:** ఉప ఎన్నికల్లో కర్ణాటక ప్రజలు అద్భుత తీర్పునిచ్చారని ప్రధాని మోదీ అన్నారు. ఎన్నికల్లో తామిచ్చిన తీర్పును అపహాస్యం చేసి, వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్‌కు ఈ ఉప ఎన్నికల్లో మంచి గుణపాఠం చెప్పారన్నారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బర్హి, బొకారొల్లో జరిగిన బహిరంగ సభల్లో మోదీ ప్రసంగించారు. 'కర్ణాటక ఉప ఎన్నికలు మూడు విషయాలు చెబుతున్నాయి. ఒకటి, ప్రజలు సుస్థిర ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. రెండు, తమ తీర్పును అవమానించినవారికి గుణపాఠం చెప్పారు. మూడు, బీజేపీ ప్రజల కోసం పనిచేస్తుందని నమ్మారు' అని అన్నారు.

**• బుల్లెట్‌ప్రూఫ్ ట్రాక్టర్**



భారత్-పాక్ సరిహద్దులో పంటపొలాలు ఉన్న రైతుల రక్షణ కోసం సిద్ధంచేసిన ట్రాక్టర్ ఇది. కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘన సమయాల్లో పాక్ నుంచి దూసుకొచ్చే బుల్లెట్లను తట్టుకుని రైతుకు రక్షణ కల్పించడం దీని ప్రత్యేకత. సోమవారం కశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో తీసిందీ ఫొటో.

## యువతికి నిప్పంటించిన కీచకుడు

- బిహార్‌లో దారుణం
- కోమాలో బాధితురాలు



**పట్నా:** బిహార్‌లో యువతిపై మరో అకృత్యం చోటుచేసుకుంది. అత్యాచారం చేయబోతుండగా ప్రతిఘటించినందుకు 23 ఏళ్ల ఆ యువతికి ఓ కీచకుడు నిప్పంటించాడు. బిహార్‌లోని అహియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలిని వెంటనే ముజఫరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉంది. 85 శాతం కాలిన గాయాలతో ప్రస్తుతం ఆ యువతి కోమాలో కొట్టుమిట్టాడుతోంది. గత మూడేళ్లుగా తమ కుమార్తెను నిందితుడు వేధిస్తున్నాడని ఆమె తల్లి చెప్పింది. తాజా ఘటనతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్ట్‌చేశారు. ఈ ఘటనపై కేంద్ర మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) బిహార్ ప్రభుత్వానికి సోమవారం నోటీసులు ఇచ్చింది. దర్యాప్తు వివరాలను నాలుగు వారాల్లోగా తమకు తెలపాల్సిందిగా కోరింది. ఈ నోటీసులను రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, డీజీపీలకూ పంపింది.

## జేఎన్‌యూ విద్యార్థులపై లాఠీచార్జ్

**న్యూఢిల్లీ:** హాస్టల్ ఫీజుల పెంపుపై జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఫీజుల పెంపుపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసేందుకు ఆయన అపాయింట్‌మెంట్ కోసం రాష్ట్రపతి భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న జేఎన్‌యూ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. సోమవారం వర్సిటీ క్యాంపస్ నుంచి ర్యాలీగా బయలుదేరిన విద్యార్థులను భికాజీ కామాప్లేస్ మెట్రో స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. విద్యార్థులు బారికేడ్లను దూకేందుకు యత్నించడంతో లాఠీలతో విరుచుకుపడ్డారు. పోలీసుల దాడిలో దాదాపు 30 మందికి గాయాలైనట్లు విద్యార్థులు ఆరోపించారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, విద్యార్థులపై పోలీసులు దాడులు చేస్తున్నారని, క్యాంపస్‌లోకి తిరిగి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని జేఎన్‌యూ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షురాలు ఐషే ఘోష్ చెప్పారు. ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు తమ ఆందోళనలు ఆపబోమన్నారు.

## మరోసారి ట్రంప్‌పై జోకులు



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అందరిలో నగుబాటుకు గురయ్యారు. అమెరికన్లు ఒకసారికి బదులు పది, పదిహేనుసార్లు టాయిలెట్ ఫ్లష్‌ను వాడుతున్నారన్న ట్రంప్ వ్యాఖ్యలపై జోకులు పుట్టుకొచ్చేశాయి. శ్వేతసౌధంలో వాణిజ్యవేత్తలతో జరిగిన ఒక సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ తక్కువ నీటిని వాడే టాయిలెట్ల లేమి శాపమైపోయిందని వ్యాఖ్యానించడం జోకుల పుట్టుకకు కారణమైంది. అమెరికన్ చట్టాల ప్రకారం ఒకసారి టాయిలెట్ వాడిన తరువాత పలుమార్లు ఫ్లష్ చేయాల్సి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. 'కొళాయి తిప్పితే నీళ్లు రావు. షవర్‌లో నీళ్లు చుక్కచుక్కగా పడుతుంటాయి. ప్రజలేమో ఒకసారికి బదులు పది పదిహేనుసార్లు ఫ్లష్ చేస్తుంటారు. దీంతో నీళ్లు ఎక్కువ ఖర్చయిపోతాయి' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు వార్తలు రావడంతో నెటిజన్లు టాయిలెట్ ట్రంప్ పేరుతో హ్యాష్‌ట్యాగ్ మొదలుపెట్టేశారు. ఇది కాస్తా ట్విట్టర్‌లో ట్రెండ్ అవడం మొదలైంది. ట్రంప్‌పై మీమ్స్ రూపంలో పలు జోకులు ట్విట్టర్‌లో దర్శనమివ్వడం మొదలైంది.

## మానవాభివృద్ధి సూచీలో భారత్ @ 129



**న్యూఢిల్లీ:** ప్రపంచ మానవాభివృద్ధి సూచీలో భారత్ 129వ స్థానంలో ఉంది. ఐక్యరాజ్యసమితి సోమవారం ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) నివేదిక–2019ను విడుదల చేసింది. తొలి మూడు స్థానాల్లో నార్వే, స్విట్జర్లాండ్, ఐర్లాండ్ నిలిచాయి. పాకిస్తాన్ 152వ స్థానంలో ఉంది. అట్టడుగున 189 స్థానంలో నైగర్ ఉంది. 189 దేశాలతో జాబితా రూపొందించింది. 2005–06 నుంచి 2015–16 వరకు 27.1 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడినట్టు యూఎన్‌డీపీ ఇండియా ప్రతినిధి షోకో నోడా వెల్లడించారు. 2018లో భారత్ 130వ స్థానంలో ఉంది. మూడు దశాబ్దాలుగా జరుగుతున్న అభివృద్ధి కారణంగా పేదరికంలోనూ, భారతీయుల ఆయుర్దాయంలోనూ, విద్య, వైద్య సదుపాయాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని రిపోర్టు వెల్లడించింది.

- 1.3 బిలియన్ల మంది నిరుపేదల్లో 28 శాతం మంది భారత్‌లో ఉన్నారు. అయితే ఇక్కడ ఇంకా స్త్రీలు, బాలికలు అసమానతల సవాళ్ళను ఎదుర్కొంటూనే ఉన్నారు. ➡ భర్తల చేతిలో హింసకు గురౌతున్న మహిళలు సింగపూర్‌లో అతి తక్కువ.
- దక్షిణాసియాలో 31 శాతం మంది మహిళలు భర్తల చేతిలో హింసకు గురౌతున్నారు.
- లింగ అభివృద్ధి సూచీలో దక్షిణాసియా దేశాల సగటు కంటే భారత్ కొద్దిగా మెరుగైన స్థితిలో ఉంది.

# 10 ఉరితాళ్లు సిద్ధం చేయండి



- బిహార్‌లోని బక్సర్ జైలుకు జైళ్ల శాఖ ఆదేశాలు
- నిర్భయ దోషుల కోసమేనని ఊహాగానాలు
- 16వ తేదీన అమలు?

పట్నా

ఏడేళ్ల సుదీర్ఘ న్యాయ ప్రక్రియ తర్వాత నిర్భయ దోషులను త్వరలో ఉరితీయనున్నారా? ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరిగిపోతున్నాయా? అవునంటున్నాయి ఇటీవలి పరిణామాలు. ఉరితాళ్లను తయారు చేయడంలో దేశంలో పేరెన్నికగన్న ఓ జైలుకు 10 తాళ్లను ఈ వారాంతం లోగా సిద్ధంగా ఉంచాలన్న ఆదేశాలు రావడం దీనికి కారణం. డిసెంబర్ 14వ తేదీకల్లా పది ఉరితాళ్లను సిద్ధంగా ఉంచాలని తమకు జైళ్లశాఖ డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు వచ్చాయని, వీటిని ఎక్కడ ఉపయోగిస్తారో మాత్రం తెలియదని బక్సర్ జైలు సూపరింటెండెంట్ విజయ్ అరోరా తెలిపారు. ఒక్కో ఉరితాడు తయారీకి కనీసం మూడు రోజులు పడుతుందని, దాదాపు పెద్ద యంత్రాలేవీ వాడకుండా చేతులతోనే వీటిని తయారుచేస్తారని విజయ్ వివరించారు. పార్లమెంటుపై దాడి కేసులో దోషిగా తేలిన అఫ్జల్ గురును ఉరితీసిన తాడు కూడా ఈ బక్సర్ జైలులోనే తయారైందని చెప్పారు. 2016–17లో పటియాలా జైలు నుంచి కూడా ఉరితాళ్లు కావాలంటూ తమకు ఆర్డర్లు వచ్చాయని, కాకపోతే వినియోగించేది ఎక్కడ అనేది మాత్రం తెలియలేదని విజయ్ చెప్పారు. చివరిసారిగా తాము సరఫరా చేసిన ఒక్కో ఉరితాడుకు రూ.1,725 రూపాయలు ఖర్చయిందని, ఇనుము, ఇత్తడి ధరల్లో మార్పులను బట్టి ఉరితాడు ధర మారుతుందని తెలిపారు. తాళ్లను పురివేసి ఉరితాడుగా మార్చేటపుడు ఈ లోహాల తీగలనూ వినియోగిస్తారు. మెడచుట్టూ ఉరి బిగుతుగా ఉండేందుకు ఉరితాడులోని ఈ లోహాల తీగలు సాయపడతాయని, దోషి శరీరం వేలాడేటప్పుడు ముడి విడిపోకుండా చేస్తాయని విజయ్ వివరించారు.

**ఒక్క తాడు తయారీకి ఐదారుగురు**

ఒక ఉరితాడు తయారుచేయడానికి సుమారు ఐదారుగురు పనివాళ్లు అవసరమవుతారని విజయ్ అరోరా తెలిపారు. ఉరితాడు తయారీ ప్రక్రియలో భాగంగా మొదటగా 152 పోగులను పెనవేసి ఒక చిన్నపాటి తాడుగా చేస్తారని విజయ్ చెప్పారు. ఇలాంటి తాళ్లను పురివేసి ఉరితాడును తయారుచేస్తారు. మొత్తంగా చూస్తే ఒక ఉరితాడు తయారీలో దాదాపు 7000 దారాలను వినియోగిస్తారని తెలిపారు. ఈసారి నిర్దేశిత సమయంలోపే ఉరితాళ్లను సిద్ధం చేయగలమని, అనుభవజ్ఞులైన సిబ్బంది తగినంత మంది ఉన్నారని చెప్పారు. తాము తయారు చేసే ఉరితాళ్లను ఎక్కువ కాలం నిల్వ ఉంచితే పాడైపోతాయని స్పష్టం చేశారు. నిర్భయ దోషులను ఈ నెల పదహారున ఉరితీయనున్నారని ఒక వర్గం మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ఉరితాడు తయారీ వార్తకు ప్రాధాన్యమేర్పడింది.

### 'ఢిల్లీ' మృతదేహాల తరలింపు రోడ్డు మార్గంలోనే

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో ఆదివారం జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను రోడ్డుమార్గం ద్వారానే వారి స్వస్థలాలకు చేర్చాలని బిహార్ ప్రభుత్వం నిర్ణయించింది. సోమ, మంగళవారాల్లో స్వతంత్ర సేనానీ ఎక్స్‌ప్రెస్ రైల్లోని సాధారణ రైలుబోగీల్లో మృతదేహాలను తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని మృతుల కుటుంబాలు వ్యతిరేకించడంతో ఈ మేరకు మార్పు చేశారు. మృతదేహాలతో రైల్లో వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణించడంపై కుటుంబ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని అందువల్ల ఒక్కో అంబులెన్సులో రెండు మృతదేహాలను ఉంచి స్వస్థలాలకు తరలించాలని నిర్ణయించినట్లు బిహార్ భవన్ జాయింట్ లేబర్ కమిషనర్ కుమార్ దిగ్విజయ్ తెలిపారు. ఢిల్లీలోని అనాజ్‌మండీ ప్రాంతంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మొత్తం 43 మంది మరణించగా వీరిలో అత్యధికులు బిహార్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన కూలీలే కావడం తెలిసిందే.

### పుట్టినరోజు జరుపుకోని సోనియా

**న్యూఢిల్లీ:** దేశంలో మహిళలపై పెరిగిపోతున్న అఘాయిత్యాలకు నిరసనగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తన 73వ జన్మదిన వేడుకలకు దూరంగా ఉన్నారు. అయినా కానీ పలువురు నాయకులు సోమవారం సోనియాకు శుభాకాంక్షలు తెలిపారు. ట్విట్టర్ ద్వారా సోనియాకు ప్రధాని మోదీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సోనియాకు దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం ప్రసాదించాలని ఆ దేవుడిని కోరుకుంటున్నట్లు మోదీ ట్వీట్ చేశారు. అయితే సోనియా నిర్ణయానికి గౌరవమిస్తూ రాహుల్, ప్రియాంక, మరికొందరు సీనియర్ కాంగ్రెస్ నేతలు సోనియాకు బర్త్‌డే విషెష్ చెప్పలేదు. సోనియాకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో డీఎంకే అధినేత స్టాలిన్, ఎన్సీపీ నాయకురాలు సుప్రియా సూలే, కేంద్ర మంత్రి, ఎల్జేపీ నాయకుడు రాంవిలాస్ పాశ్వాన్, శివసేన నాయకుడు ఆదిత్య ఠాక్రే ఉన్నారు. సోమవారం ఉదయం కేంద్ర హోంమంత్రి అమిత్ షా పౌరసత్వ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టినప్పుడు సోనియా లోక్‌సభలోనే ఉన్నారు.

సాక్షి
మంగళవారం, డిసెంబర్, 10

# బీజేపీకి కర్ణాటక కిక్కు

ఎన్నికలు జరిగిన ప్రతిసారీ రాజకీయ సంక్షోభంలో కూరుకుపోతున్న కాంగ్రెస్‌కు సోమవారం వెలువడిన కర్ణాటక ఉప ఎన్నికల ఫలితాల్లోనూ అదే పునరావృతం అయింది. ఉప ఎన్నికలు జరిగిన 15 స్థానాల్లో కేవలం రెండే దక్కడంతో ఈ పరాజయానికి నైతికబాధ్యత వహించి కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత సిద్దరామయ్య, పీసీసీ అధ్యక్షుడు దినేష్ గుండూరావు రాజీనామా చేశారు. అంచనాలకు మించి 12 స్థానాలు గెల్చుకున్న బీజేపీ సంబరాలు చేసుకుంటోంది. అభ్యర్థుల ఎంపికనూ, ప్రచార బాధ్యతల్ని తన భుజస్కంధాలపై వేసుకున్న ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఉప ఎన్నికలు రాజకీయంగా ఆయన స్థానాన్ని సుస్థిరం చేశాయి. బీజేపీకి ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకమైనవి. మహారాష్ట్రలో ఊహించనివిధంగా కూటమి భాగస్వామి శివసేన విపక్షాలతో చేతులు కలిపి తమకు అధికారం దక్కకుండా చేసింది. పైగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న జార్ఖండ్‌లో ఇంకా మూడు దశలు పూర్తి కావలసి ఉంది. అక్కడ పాత మిత్రుల్ని వదిలించుకుని ఒంటరిగా బరిలోకి దిగాల్సివచ్చింది. ఇలాంటి సమయంలో అంచనాలను మించి ఉప ఎన్నికల్లో విజయం సాధించడం ఆ పార్టీకి జవసత్వాలనిచ్చింది. కర్ణాటకలో నిరుడు మే నెలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఈ 15 స్థానాల్లో పన్నెండింటిని కాంగ్రెస్ గెల్చుకోగా, మూడుచోట్ల జేడీఎస్ విజయం సాధించింది. వీరు, వీరితోపాటు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు బీజేపీ శిబిరానికి ఫిరాయించడంతో 14 నెలలపాటు పాలించిన హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలోని జేడీఎస్–కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం మొన్న జూలైలో కుప్పకూలింది. మరో రెండు స్థానాలకు సంబంధించి ఎన్నికల పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందువల్ల వాటికి ఉపఎన్నికలు జరగలేదు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో తమకు గరిష్టంగా 9 స్థానాలు రావొచ్చునని బీజేపీ అంచనా వేసుకుంది. కానీ ఫలితాలు దాని అంచనాలను మించాయి. పైగా జేడీఎస్‌కు కంచుకోట అయిన ఓల్డ్ మైసూరు ప్రాంతంలోని మాండ్యా జిల్లాలో తొలిసారి బీజేపీ విజయకేతనం ఎగరేసింది. అక్కడ కృష్ణరాజపేటె స్థానం తన ఖాతాలో వేసుకుంది. జేడీఎస్‌కు దన్నుగా ఉండే వొక్కళిగ జనాభా అధికంగా ఉన్న స్థానమిది. 224మంది సభ్యులుండే కర్ణాటక శాసనసభలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన కనీస మెజారిటీ 113. ఇప్పటికే బీజేపీకి 105 స్థానాలుండగా, ఉప ఎన్నికల తర్వాత దాని బలం 117కి చేరుకుంది.

ఫిరాయింపు రాజకీయాలను ప్రజలు అసహ్యించుకుంటారని, అందువల్ల ఫిరాయింపుల కారణంగా సభ్యత్వం కోల్పోయి, బరిలో నిలిచిన వారంతా ఓటమి పాలవుతారని రాజ్యాంగ నైతికతను కోరుకునే వారంతా ఆశించారు. ఈ ఫిరాయింపులతో అధికారం పోగొట్టుకున్న కాంగ్రెస్, జేడీఎస్‌లు సైతం అలాగే కోరుకున్నాయి. జనమంతా ఫిరాయింపుదార్లకు గట్టిగా బుద్ధి చెబుతారని భావించాయి. అయితే ప్రజలు కేవలం ఫిరాయింపుల అంశాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని భావించడం దురాశ. ఈ ఫిరాయింపుల కారణంగా పతనమైన కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వం అంతక్రితం 14 నెలలపాటు ఎలా పాలించిందో కూడా వారు అంచనా వేసుకున్నారు. ఆ 14 నెలలూ రెండు పార్టీలూ పరస్పరం దుమ్మెత్తిపోసుకోవడమే సరిపోయింది. రెండు మూడు సందర్భాల్లో అప్పటి సీఎం కుమారస్వామి కంటతడి పెట్టారు. ఏం చేద్దామనుకున్నా తనకు అడ్డంకులు ఎదురవుతున్నాయని ఆయన వాపోయారు. కేవలం బీజేపీని అధికారానికి దూరంగా ఉంచడం కోసం కలవడం తప్ప రాజకీయంగా ఆ రెండు పార్టీలూ ఒక ఉమ్మడి ఎజెండా రూపొందించుకోలేకపోయాయి. వరస వివాదాల్లో ఆ పార్టీలు తలమునకలై ఉండగా ఉపాధి లేమి, కరువుకాటకాలు రాష్ట్రాన్ని పీల్చిపిప్పి చేశాయి. వీటన్నిటినీ ప్రజలు మరిచిపోలేదు. కనుకనే ఫిరాయింపుదార్ల అనైతిక రాజకీయాల గురించి ఎంత ప్రచారం చేసినా వారు పట్టించుకోలేదు. బీజేపీ ప్రచారం చేసిన సుస్థిర పాలన, అభివృద్ధికే వారు ఓటేశారు. ఉదాహరణకు కృష్ణరాజపేటె స్థానం నుంచి నిరుడు తమ పార్టీ అభ్యర్థిగా గెలిచి బీజేపీకి ఫిరాయించిన నారాయణగౌడపై జేడీఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి గట్టిగా ప్రచారం చేశారు. రాజకీయంగా తమ గొంతు కోసిన ఆయనను చిత్తుగా ఓడించాలని ఎంతో ఉద్వేగంతో పిలుపునిచ్చారు. కానీ జనం నారాయణగౌడకే పట్టంగట్టారు. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న బెల్గాం జిల్లాలో గెలుపుపై బీజేపీ నేతల్లోనే అనుమానాలున్నాయి. పొరుగు రాష్ట్రంలోని పరిణామాలు ఈ ఉప ఎన్నికలపై ప్రభావాన్ని చూపుతాయని వారు భావించారు. కానీ అక్కడ కూడా విజయం సాధించడం వారిని ఉత్సాహపరిచింది.

ఈ ఉప ఎన్నికలు ముఖ్యమంత్రి యడియూరప్పకు రాజకీయంగా ఊపిరిపోశాయి. నిజానికి ఆయన ఒకరకంగా గడ్డుపరిస్థితిని ఎదుర్కొన్నారు. 75 ఏళ్లు దాటిన నేతలు ముఖ్య పదవుల నుంచి వైదొలగాలన్న సూత్రానికి విరుద్ధంగా బీజేపీ ఆయన్ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టక తప్పలేదు. ఫిరాయింపుదార్లందరికీ టికెట్లివ్వడానికి అధిష్టానం సుముఖంగా లేదన్న వార్తలొచ్చాయి. కానీ యడియూరప్ప పట్టుబట్టి పార్టీ టిక్కెట్లు వచ్చేలా చేశారు. పైగా గెలిస్తే వీరికి మంత్రి పదవులు ఇస్తామని కూడా ప్రచారసభల్లో చెప్పారు. అది ఎంతవరకూ సాధ్యమో చూడాల్సివుంది. పార్టీ కేంద్ర నాయకులెవ్వరూ ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఘన విజయం సాధించి రాష్ట్రంలో మాత్రమే కాదు... దేశంలో కూడా పార్టీ ప్రతిష్టను యడియూరప్ప పెంచగలిగారు. ఈ ఉప ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌ను మరింత కుంగదీసే ప్రమాదం ఉంది. ఆ పార్టీ జాతీయ నాయకత్వం నిస్తేజంగా ఉండటం, రాష్ట్రంలో పార్టీ సారథులు రాజీనామాలు చేయడం నైతికంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలను కుంగదీస్తుంది. రాజకీయంగా తమ భవిష్యత్తేమిటన్న గాభరా కలిగిస్తుంది. ఇప్పుడు సుస్థిర మెజారిటీ లభించింది గనుక బీజేపీ ప్రభుత్వం ఇక పాలనపై దృష్టి పెట్టాలి. ఆంతరంగిక కలహాల్లో తలమునకలైతే ఇప్పుడు కాంగ్రెస్, జేడీఎస్‌లకు ఎదురైన చేదు అనుభవమే మున్ముందు బీజేపీకి కూడా తప్పకపోవచ్చు.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు
మార్గశిర మాసం, తిథి శు.త్రయోదశి ఉ.9.56 వరకు
తదుపరి చతుర్దశి, నక్షత్రం కృత్తిక పూర్తి (24 గంటలు)
వర్జ్యం సా.5.31 నుంచి 7.12 వరకు, దుర్ముహూర్తం ఉ.8.33 నుంచి 9.17 వరకు, తదుపరి రా.10.33 నుంచి 11.25 వరకు
అమృతఘడియలు... రా.3.40 నుంచి 5.44 వరకు.

సూర్యోదయం : 6.23
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

# మరో అయోధ్య కానున్న 'పౌరసత్వం'


శేఖర్ గుప్తా

**ఆర్థిక కారణాలతో అస్సాంలోకి ముస్లింల వలస ప్రారంభం కాగా, విభజన తర్వాత హిందువుల వలస దానికి తోడైంది. 1947కి ముందే వచ్చిన ముస్లింలు చాలావరకు అస్సాంలోనే ఉండిపోగా, తర్వాత హిందువులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి చేరారు. దీంతో మొత్తం భూభాగంలోని జాతుల సమతూకం మారిపోయింది. జాతీయ పౌర పట్టిక ప్రకారం అనర్హులుగా తేలిన 19 లక్షలమందిలో 60 శాతం వరకు ముస్లిమేతరులే. ఈ చిక్కుముడిని విప్పడం కష్టమే కాబట్టి పౌరసత్వ సవరణ బిల్లును బీజేపీ ప్రజలను విభజించే ఎత్తుగడతో తీసుకొస్తోంది. ప్రత్యర్థులు వెంటనే ఈ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తారు. ముస్లింలను బుజ్జగిస్తున్నవారిగా బీజేపీ వారిపై ఆరోపణలకు దిగుతుంది. అంటే వచ్చే మూడు దశాబ్దాల్లో పౌరసత్వ సవరణ అంశం మరొక రామ మందిరం, లేక ఆర్టికల్ 370గా మారిపోతుంది. దీని వెనుక ఉన్న విభజన రాజకీయాలివే.**

గత కొన్ని రోజులుగా పౌరసత్వ చట్టం, 1955 లేక పౌరసత్వ సవరణ బిల్లు, 2019 (సీఏబీ)కు తాజా సవరణలపై అనేకమంది మద్దతిస్తూ దేశవిభజనను తిరిగి సమీక్షించాలని కోరుతున్నారు. పూర్తికాని వ్యవహారాన్ని మళ్లీ సమీక్షించాలి అనే మాట చెప్పనప్పటికీ, పూర్తి న్యాయం, ముగింపు, ముస్లిమేతర మైనారిటీలకు న్యాయం చేయడం అని చెప్పడంలో వీరు వెనుకాడటం లేదు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలోని మైనారిటీలకు చేసిన వాగ్దానాన్ని పౌరసత్వ సవరణ బిల్లు నెరవేరుస్తుందని వీరు నొక్కి చెబుతున్నారు. ఆ వాగ్దానం చర్చనీయాంశమే. ఉపఖండంలోని ముస్లింలకు మాతృభూమి కావాలనే ఊహను ప్రతిపాదించి, దాని కోసం పోరాడి, చివరకు పాకిస్తాన్‌ని సాధించడంలో విజయం పొందారనడంలో సందేహమే లేదు. విభజనకాలంలో మతపరంగా ప్రజలను అటూ ఇటూ మార్పిడి చేసుకున్నారన్నదీ వాస్తవమే. అయితే ప్రజల మార్పిడి ప్రక్రియ రక్తపాతంతో, మారణ కాండతో, అత్యాచారాలతో సాగింది. కొన్నేళ్లలోపే ఉపఖండం పశ్చిమ ప్రాంతంలో ఈ ప్రజల మార్పిడి ప్రక్రియ పూర్తయింది, దాదాపు ముగిసిపోయింది. భారత్ భూభాగంలోని పంజాబ్‌లో, ముస్లింలు, పాకిస్తాన్ భూభాగంలో హిందువులు, సిక్కులు చాలా తక్కువమంది మాత్రమే ఉండిపోయారు.

1960ల మధ్యవరకు విభజనకు సంబంధించి కొన్ని వింత ఘటనలు కొనసాగాయి. పాకిస్తాన్ కెప్టెన్‌గా వ్యవహరించిన క్రికెటర్ అసిఫ్ ఇక్బాల్ 1961లో మాత్రమే పాకిస్తాన్‌కు వలస వెళ్లాడు. అప్పటి వరకు అతడు హైదరాబాద్ జట్టు తరపున ఆడేవాడు. 1965 యుద్ధ కాలంలో చిన్న అలజడి చెలరేగింది కానీ త్వరలోనే అది ముగిసిపోయింది. కానీ తూర్పు భారత్‌లో విభిన్న చిత్రం చోటు చేసుకుంది. అనేక సంక్లిష్ట కారణాల రీత్యా తూర్పు పాకిస్తాన్, భారత్‌కి చెందిన పశ్చిమ బెంగాల్, అస్సాం, త్రిపురల మధ్య జనాభా మార్పిడి పూర్తి కాలేదు. బెంగాల్‌లోని అనేక వర్గాలకు చెందిన ముస్లింలు.. అలాగే తూర్పు బెంగాల్(పాకిస్తాన్)లోని హిందువులు భారత్‌లోనే ఉండిపోయారు. కానీ ఎత్తుకు పైఎత్తులు చోటు చేసుకోవడంతో ఇరుపక్షాల మధ్య ఘర్షణలు కొనసాగాయి.

అందుకే ఇలాంటి ఘటనలను నిలిపివేయడానికి 1950లోనే జవహర్‌లాల్ నెహ్రూ, నాటి పాకిస్తాన్ ప్రధాని లియాఖత్ అలీ ఖాన్ ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే చారిత్రాత్మకమైన నెహ్రూ–లియాఖత్ ఒప్పందం. ఈ ఒప్పందంలో అయిదు ప్రధాన అంశాలున్నాయి

1. ఇరుదేశాలూ తమ భూభాగంలోని మైనారిటీలను పరిరక్షిస్తూనే.. ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయాలు, సాయుధ బలగాల్లో చేర్చుకోవడంతోపాటు అన్ని హక్కులు, స్వేచ్ఛలను వారికి కల్పించాలి. 2. దాడుల కారణంగా తాత్కాలికంగా గూడు కోల్పోయి, వలసపోయినప్పటికీ, తిరిగి తమ ఇళ్లకు చేరుకోవాలని భావిస్తున్నవారికి ఇరుదేశాలూ ఆశ్రయం కల్పించి, పరిరక్షించాలి. 3. అలా వెనక్కు తిరిగి రాని వారిని రెండు దేశాలూ తమతమ పౌరులుగానే భావించాలి. 4. ఈలోగా, ఇరు దేశాల్లో ఉండిపోయిన వారు స్వేచ్ఛగా రాకపోకలు సాగించవచ్చు, ఇప్పటికీ తామున్న దేశం నుంచి మరొక దేశంలోకి వలస వెళ్లాలని కోరుకుంటున్నవారికి ఇరుదేశాలూ రక్షణ కల్పించి సహకరించాలి. 5. ఇరుదేశాలు శాంతిభద్రతలను కాపాడటానికి నిజాయితీగా ప్రయత్నించాలి. అప్పుడు మాత్రమే ప్రజలు తాము కోరుకున్న భూభాగాలపై సురక్షితంగా ఉన్నట్లు భావించగలరు.

### జాతిహితం



ఈ ఒప్పంద సూత్రాలను బట్టే, భారత్ తన జనాభా గణనను చేపట్టి, 1951లో ప్రథమ జాతీయ పౌర పట్టికను (ఎన్ఆర్సీ) రూపొందించింది. భారత్‌లో ముస్లిం జనాభా శాతం.. హిందువులు, సిక్కుల జనాభా కంటే కాస్త అధికంగానే పెరుగుతూవచ్చిందని, అదే సమయంలో తూర్పు, పశ్చిమ పాకిస్తాన్‌లో మైనారిటీలుగా ఉంటున్న హిందువుల జనాభా వేగంగా తగ్గుతూ వచ్చిందని ఇరుదేశాల జనగణన డేటా సూచిస్తోంది. అంటే హిందూ మైనారిటీలు పాక్‌ను, బంగ్లాదేశ్‌ను వదిలిపెట్టి భారత్‌లో స్థిరపడ్డారని చెప్పవచ్చు. దేశవిభజన సమయంలో పూర్తి చేయని కర్తవ్యానికి సమాధానంగా పౌరసత్వ సవరణ బిల్లును తీసుకురావడానికి కారణం ఇదేనని బీజేపీ చెబుతుండవచ్చు. పాకిస్తాన్ నెహ్రూ–లియాఖత్ ఒడంబడికలోని సూత్రాలను పాటించి గౌరవించడంలో విఫలమైందని, దీంతో భారత్ మైనారిటీల సహజ నిలయంగా మారిందని పాక్‌లో మైనారిటీలను నేటికీ పీడిస్తున్నారని బీజేపీ వాదన. ఇక్కడే మనం సంక్లిష్టతల్లోకి కూరుకుపోవడం ప్రారంభిస్తాం. మొదట, భారత్ నిర్మాతలు తమ లౌకిక రిపబ్లిక్ ఇలా ఉండాలని కోరుకున్న చట్రంలో జిన్నా రెండు దేశాల థియరీ ఇమడలేదు. రెండు, ఏ దశవద్ద పాత చరిత్ర ముగిసి కొత్త చరిత్ర ప్రారంభం కావాలి? ఇక మూడోది, దేశీయతతో కూడిన జాతీయ సమానార్థకమైనది ఏది? మతం జాతి, భాషతో సమానమైనదా?

తూర్పు భారత్‌లో ప్రత్యేకించి అస్సాంలో వలసల స్వభావం, సంక్లిష్టతను అర్థం చేసుకోవడానికి మనం కొన్ని దశాబ్దాల వెనక్కు వెళ్లడం అవసరం. అస్సాం సాపేక్షికంగా తక్కువ జనసాంద్రత కలిగిన విశాలమైన సారవంతమైన భూములతో, సమృద్ధిగా జలవనరులతో కూడిన ప్రాంతం. అందుకే ఈ రాష్ట్రంలోకి 20వ శతాబ్దిలో తూర్పు బెంగాల్ నుంచి తొలి దశ వలసలకు దారితీసింది. వీరిలో చాలామంది ఆర్థిక కారణాలతో వచ్చినవారే. భూములకోసం, మంచి జీవితం కోసం వీరొచ్చారు. ఇలా మన దేశంపైకి వలసరూపంలో చేసిన ఆక్రమణ గురించి ప్రస్తావించిన తొలి వ్యక్తి బ్రిటిష్ సూపరెంటెండెంట్ సీఎస్ ముల్లన్. 1931లో అస్సాంలో జనగణన కార్యకలాపాలను ఈయనే పర్యవేక్షించారు. తన మాటల్లోనే చెప్పాలంటే..

'బహుశా, గత 25 ఏళ్లలో అస్సాం ప్రావిన్స్‌లో జరిగిన అత్యంత ముఖ్యమైన ఘటన, అస్సామీయుల సంస్కృతి, నాగరికతలను పూర్తిగా ధ్వంసం చేసి అస్సాం భవిష్యత్తునే శాశ్వతంగా మార్చివేయగలిగిన ఘటన ఏమిటంటే, తూర్పు బెంగాల్ జిల్లాల నుంచి ప్రత్యేకించి మైమెన్‌సింగ్ జిల్లా నుంచి భూదాహంతో వలసవచ్చిన ముస్లింల భూ ఆక్రమణే' అని సీఎస్ ముల్లాన్ పేర్కొన్నారు. 'ఎక్కడ శవాలు ఉంటే అక్కడికి రాబందులు వచ్చి కూడతాయి. ఎక్కడ బీడు భూములుంటే అక్కడికల్లా మైమెన్‌సింగ్ జిల్లా నుంచి వలస వచ్చిన వారు గుమికూడతార'ని ఆయన ముగించారు. మరి అస్సాం ప్రజల జాతి, భాషా పరమైన ఆందోళనలు దీన్ని చూస్తే ఏమౌతాయో మరి.

ఆర్థిక కారణాలతో అస్సాంలోకి ముస్లింల వలస ప్రారంభంలోనే సమస్య కాగా, విభజన తర్వాత హిందువుల వలస దానికి మరింత తోడైంది. కాగా 1947కి ముందే వచ్చిన మైమెన్‌సింగ్ జిల్లాకు చెందిన ముస్లింలు చాలావరకు అస్సాంలోనే ఉండిపోగా, తర్వాత హిందువులు కూడా గుంపులు గుంపులుగా వచ్చి చేరారు. దీంతో మొత్తం భూభాగంలోని జాతుల సమతూకం మారిపోయింది. ఇదే సమస్యకు ప్రధాన కారణం. అస్సాం ఆందోళనలకు సమాధానం ఇవ్వడంలో పౌరసత్వ సవరణ చట్టం విఫలమవుతుండటానికి ఇదే ప్రధాన కారణం. మతంపై కాకుండా, జాతి, సంస్కృతి, భాష, రాజకీయ అధికారం వంటి అంశాల్లోనే అక్కడ అధిక ఆందోళనలు చోటుచేసుకుంటున్నాయి. గత మూడు దశాబ్దాలుగా దీన్ని మార్చడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు ప్రయత్నిస్తూ వచ్చాయి. పైగా ముస్లిం వలసప్రజలు దేశ విభజనకు ముందే వచ్చారు వీరికి పౌరసత్వాన్ని నిరాకరించలేరు. బెంగాలీ హిందువులు ఇటీవలి కాలంలో వచ్చినవారు. అందుకే జాతీయ పౌర పట్టిక ప్రకారం అనర్హులుగా తేలిన 19 లక్షలమందిలో 60 శాతం వరకు ముస్లిమేతరులే ఉండటం ఈ నిజాన్ని సూచిస్తోంది.

ఇక్కడే బీజేపీ ఇరుక్కుపోతోంది. పౌరసత్వ చట్టాన్ని అమలు చేసినట్లయితే, ముస్లింల కంటే హిందువులనే ఎక్కువగా దేశం నుంచి పంపించేయాల్సి ఉంటుంది. తాజా పౌరసత్వ సవరణ చట్టంతో దీన్ని పరిష్కరించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. కానీ దీనికి అస్సామీయులు అంగీకరించడం లేదు. తాజాగా తీసుకొస్తున్న జాతీయవ్యాప్త పౌరసత్వ సవరణ పట్టికతో పౌరసత్వ చట్టాన్ని కలిపినట్లయితే ప్రారంభంలోనే అది చచ్చి ఊరుకుంటుందని బీజేపీకి తెలుసు. అందుకే దీన్ని ప్రజలను విడదీసే సాధనంగా బీజేపీ ఎక్కుపెట్టింది. ప్రత్యర్థులు వెంటనే ఈ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తారు. ముస్లింలను బుజ్జగిస్తున్నవారిగా వారిపై బీజేపీ ఆరోపణలకు దిగుతుంది. అప్పుడేం జరుగుతుంది? వచ్చే మూడు దశాబ్దాల్లో జాతీయ పౌరసత్వ సవరణ అంశం మరొక రామ మందిరం, లేక ఆర్టికల్ 370గా మారిపోతుంది. ఈ అంశం వెనుక దాగిన విభజన రాజకీయాలు ఇవే మరి.

వ్యాసకర్త ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

---

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### దేశద్రోహం


"పౌరసత్వ సవరణ బిల్లు ప్రవేశ పెట్టడం మతవిద్వేషంలో భాగం. ఇది సారంలో ముస్లిం వ్యతిరేకమైనది. కుప్పకూలిపోతున్న ఆర్థిక వ్యవస్థ నుంచి దృష్టి మళ్లించడానికే ఈ బిల్లు తీసుకువచ్చారు"
– రామచంద్ర గుహ, చరిత్రకారుడు

### ఇక్కడికే ఎందుకు?


"పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లలో వేధింపులకు గురవుతున్న షియాలు తమ సరిహద్దు ఆవలనున్న షియా ప్రాబల్య దేశం ఇరాన్‌కు వలస పోతారు తప్ప మన దేశం ఎందుకొస్తారు? ఇండియాలో అయితే, షియా శరణార్థిని సున్నీలకంటే ప్రత్యేకంగా చూడటం జరగదు. నియంతృత్వ పోకడలు గలవారు ఇద్దరినీ ముస్లింలుగానే భావిస్తారు"
– ఇరేనా అక్బర్, కళాకారిణి

### తీర్పు


"అవకాశవాద రాజకీయాలపట్ల ప్రజలు ఎలా స్పందిస్తారనడానికి ఇదే నిదర్శనం. అధికార దాహంతో తిరస్కరణకు గురైన పార్టీలు ఏకమై ప్రజా తీర్పును వక్రీకరించడంపై అవకాశం వచ్చిన వెంటనే ఓటర్లు స్పందించారు. ప్రజాతీర్పుతో ఆటలాడుకుంటే ప్రజలు సహించరని కర్ణాటక ఉప ఎన్నికలు నిరూపించాయి"
– దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీ నేత

### నృత్యం


"దేశవిభజనను మహాత్మాగాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. ముస్లింలకు వేరే దేశం ఇవ్వాలనే ఆలోచనకు జిన్నా, బ్రిటిషర్లు బాధ్యులు. జిన్నాకు అధికారం కావాలి. ఇండియాలో ప్రధానిని కాలేనని భయపడ్డాడు. బ్రిటిషర్లు విభజించి పాలించారు. మన చరిత్రను వక్రీకరించారు"
– సధావి ఖోస్లా, రచయిత్రి

### మనోభావాలు


"2014, 2019 బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోల్లో CAB ఉందని అమిత్ షా చెబుతున్నారు. ప్రజలు ఓట్లు వేసింది దానికే. ఎన్నికల ఫలితాల్లో వారి మనోభావాలు ప్రతిఫలించాయి"
– కార్తికేయ శర్మ, జర్నలిస్ట్

### అరుపు


"కేంద్ర హోంమంత్రి అమిత్ షా బిల్లు ప్రవేశపెడుతూ పార్లమెంట్‌లో గట్టిగా అరవడం ద్వారా తన వాదనలోని విభజన స్వరం వినబడకుండా మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు"
– కృషన్ ప్రతాప్ సింగ్, రచయిత

### పౌరసత్వం


"అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో హిందూ, సిక్కు, బౌద్ధులు, క్రైస్తవులు, పార్శీలు, జైనులు వివక్షకు గురవుతున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. అహ్మదీయులు, బలోచ్‌లు, షియాలు, హాజారియాలను కూడా ఆ దేశాలలో పీడిస్తున్నారు. అటువంటప్పుడు కేవలం ముస్లింలను మాత్రమే బిల్లునుంచి ఎందుకు మినహాయించాలి?" – షమా మహమ్మద్, కాంగ్రెస్ నేత

### నివేదిక


"చానళ్లన్నీ వదిలిపెట్టేసిన అంశంపై కథనం చేసినందుకు బీబీసీకి అభినందనలు. పౌరసత్వ సవరణ బిల్లు అస్సాంలోని అనేక కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తోంది. పిల్లల నుంచి తల్లుల్ని వేరుచేయడంపై క్షేత్ర స్థాయి నివేదిక అందించడం అభినందనీయం"
– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

---

### ఇన్‌బాక్స్

## స్త్రీలు ఆయుధాలు ధరించాల్సిందే

శంషాబాద్‌కి చెందిన పశువైద్యురాలు 'దిశ'పై జరిగిన అరాచక కృత్యం యావత్ భారతీయులను తీవ్ర వేదనకు గురిచేసింది. నిర్భయ ఘటన తర్వాత జాతి చైతన్యాన్ని ఇంతగా కలవరపర్చిన, సంఘటిత పరిచిన ఘటన మరొకటి లేదు. నిత్యం జరుగుతున్న అమానుష కృత్యాలతో, పైశాచిక దాడులతో, హత్యాచారాలతో మన దేశంలో నేడు తమ మానప్రాణాలకు ఏమాత్రం భరోసా లేని ఒక అనిశ్చిత స్థితిలో స్త్రీలు ఉన్నారు.

అత్యాచారం వంటి దారుణ ఘటన జరిగిన తరవాత ఎవరు ఎన్ని సలహాలు, సూచనలు ఇచ్చినా ఆ దుస్సంఘటన మాసిపోదు. 'భవిష్యత్తులో ఇలాంటి సంఘటన తమకే జరిగితే...' అని ఆలోచిస్తే ఎవరికైనా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. భద్రతపై పూర్తి నమ్మకం కోల్పోయిన నేపథ్యంలో మహిళలు ఎల్లప్పుడు తమ వెంట ఒక ఆయుధం, స్ప్రే, మొబైల్ ఫోన్‌లో టోల్ ఫ్రీ నంబర్లు ఉంచుకోవడం ఎంతైనా అవసరం. వీటితో పాటు కొన్ని ప్రాణాంతకమైన పోరాట పద్ధతుల మెలకువలు నేర్చుకోవడం కూడా అవసరమే. ఈ సందర్భంగా దేశంలో పలు పోరాట విద్యల్లో శిక్షణ ఇస్తున్న శిక్షకులందరికీ ఒక విజ్ఞప్తి. మీ వద్దకు శిక్షణ కోసం వచ్చే మహిళలకు, బాలికలకు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా గ్రాయిన్ కిక్, సోలార్ ప్లెక్సస్, రిబ్స్, కణతలు, చెవులపై పంచులు రిలీజ్ చేయడం నేర్పగలరు.

ఇదంతా కేవలం ముప్పై నిమిషాల వ్యవధిలో మహిళలకు నేర్పవచ్చు. ప్రాక్టీసులో రాటుదేలితే ఈ టెక్నిక్స్ ప్రతి రోజూ పది నిమిషాల పాటు ఇంట్లో సాధన చేస్తే దాడిచేసే వారిని ఎలా ఎదుర్కోవాలన్న అంశంలో స్త్రీలకు ప్రావీణ్యత కచ్చితంగా అబ్బుతుంది. దారుణ అకృత్యాలను కొంత మేరకైనా అడ్డుకోగలిగితే పోరాట విద్యల లక్ష్యం నెరవేరుతుంది దానితో పాటు స్త్రీలకు మనోధైర్యం, శారీరక దృఢత్వం కూడా అలవడతాయి.

వి.యస్. పాణి,
బ్లాక్ బెల్ట్ 5వ డిగ్రీ హోల్డర్,
మహబూబాబాద్ జిల్లా,
తెలంగాణ

# లింగ సున్నితత్వ విద్య అవసరం

### సందర్భం


ఎమ్మెస్కే. కృష్ణ జ్యోతి

బాలికలపై, మహిళలపై మగవారు అత్యాచారాలు, దురాగతాలకు ఎందుకు పాల్పడతారు? వారికి 'అలా ప్రవర్తించకూడదు' అని బాల్యంలో బలంగా మనసులో నాటుకోవడం లేదు. దానికి భిన్నమైన భావనలు నాటుతున్నారు. దీనికి దీర్ఘకాలిక పరిష్కారం చూడాలి. అది బడిలోనే సాధ్యం. విద్యా కాలం దాటేలోపుగానే వారిలో లింగ సున్నితత్వం ఏర్పరచాలి. ఇందుకు ఒక చిన్న పుస్తకం కావాలి. ప్రాథమిక తరగతులకు ఇరవై పేజీలు ఉంటే సరిపోతుంది. ఆరో తరగతి నుంచీ అటూఇటుగా ముప్పై, నలభై పేజీలు చాలు. ఈ పుస్తకాన్ని మొదటి సబ్జెక్టుగా పెట్టాలి. అన్ని పరీక్షల కన్నా ముందు ఒక ఇరవై మార్కులకి ఈ పరీక్ష జరగాలి. ఈ పరీక్ష ఉత్తీర్ణత ప్రధానమైనదిగా కాక, భాగస్వామ్య ప్రధానంగా సాగాలి. పుస్తకంలో పేజీలు ఒకటి బాలుర కోసం, పక్కనే ఇంకొకటి బాలికల కోసం వుండాలి. అంటే, ఒక పేజీ సమాజంలో ఎదిగే బాలుడిని లక్ష్యంగా చేసుకుని తయారు చేయాలి, ఒక పేజీ బాలికల గురించి.

ఉదాహరణకి, ఆరో తరగతిలో ఒక పేజీలో, 'ఒసే, ఏమే, అది, ఇది అని నీ తరగతిలో బాలికలను పిలవకూడదు. వారి పేర్లతోనే వారిని పిలవాలి' అని రెండు వాక్యాలు ఇవ్వాలి. దాని గురించి చిన్న చర్చ. 'అది' 'ఇది' అని తరగతిలో వేటిని పిలుస్తాము? బాలికలకీ ఆ వస్తువులకీ తేడాలు ఏమిటి? బాలిక వస్తువు కాదు, ఒక మనిషి అని చెప్పాలి. అక్కడే ఒక బొమ్మ, వస్తువులకీ; ప్రాణం, అనుభూతులు గల బాలికకూ తేడా చూపేవిధంగా పెట్టాలి. పేజీ చివర, చిన్న ఖాళీ పంక్తులలో, వారు పేరు పెట్టి పిలిచే వ్యక్తులు ఎవరు? పై సంబోధనలు చేసేది ఎవరిని? ఎందుకు? ఈ అలవాటు ఎందుకు మానెయ్యాలి? అని స్పందన పత్రం రాయాలి.



ఇలాగే, ఎనిమిదో తరగతి పిల్లవాడికి, 'మగపిల్లలకి మీసాలు రావడం సహజం. వాటిని మెలితిప్పడంలో ఏవిధమైన ప్రత్యేకతా లేదు. అలాగే, తొడ కొట్టడం వల్ల కొత్త బలం రాదు. బల ప్రదర్శనా పోటీలో కూడా, విజేత హుందాగా గెలవాలి. పురుషత్వం ఒక సహజమైన అంశం. అది గొప్పా కాదు, తక్కువా కాదు' అని రాయాలి. ఇంకా, నీ చెల్లీ/అక్కా, నువ్వూ ఒక్కసారే భోజనం చేస్తున్నారా? మీ అమ్మా నాన్నా ఒకే విధంగా ఆహారం తీసుకుంటున్నారా? ముందు ఎవరు తింటున్నారు? ఎందుకు? ఎలా వుంటే బావుంటుంది? అని ప్రశ్నించవచ్చు.

అదే పుస్తకంలో బాలికలకు కూడా వాళ్లకి నేర్పవలసిన సంగతులు వుండాలి. ఉదాహరణకు ఒరే, పోరోయ్ అని కాకుండా బాలురని పేరుతో పిలవాలి. ఇంటి విషయాల్లో బాలికలు అన్ని రకాలుగా సమాన భాగస్వాములు. తల్లి, తండ్రి, రోజంతా పని చేసిన తరువాత; పిల్లలు బడి సమయం పూర్తి అయిన తరువాత, విశ్రాంతి కోసం చేరే స్థలాన్ని 'ఇల్లు' అంటాము. మీ ఇల్లు మీ కుటుంబం మొత్తానిది. దాని బాధ్యతలు కూడా అందరివీ. ఒక పేజీలో వంట ఇంట్లో పని చేస్తున్న మొత్తం కుటుంబ సభ్యుల చక్కని పెయింటింగ్/ఫొటో ప్రచురించాలి.

ఇల్లు భవిష్యత్తులో నేను 'పూర్తి' సమయం ఉండవలసిన స్థలం అనే భావన నుంచి బాలికలు బైటికి రావాలి. బాలురు కూడా, ఇల్లు స్త్రీకి చెందినది అనే భావన నుంచి బైటికి రావాలి. ఇలా ఒక పుస్తకం చేసి, దాన్నొక వేడుకగా పిల్లలకి ఇద్దాం. పెద్ద ఖర్చు కూడా కాదు. వచ్చే విద్యా సంవత్సరంనుంచీ ప్రభుత్వం విద్యా రంగంలో మార్పులు తేబోతోంది కాబట్టి, లింగ సున్నితత్వం విద్యా ప్రణాళికలో చేర్చడానికి ఇదే సరైన సమయం. ఈ పుస్తకాన్ని పిల్లలకు వారి వారి సొంత భాషలోనే అందించాలి. ఇక్కడ నేను వ్యక్తీకరించినవి ప్రాథమిక భావనలు. వీటిని మరింత మెరుగు చేసుకుని ఒక చక్కని సమాజాన్ని నిర్మించుకోవడానికి పిల్లలకోసం కొన్ని రంగు బొమ్మల పేజీలు ముద్రించగలం కదా.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్
(చరిత్ర విభాగం) । మొబైల్: 91107 28070

# గీతామృతం

ఓటమి లేకుండా రోగబాధలు ముసలితనపు కష్టాలు రాకుండా మృత్యువు కబళించకుండా రాక్షసులపై విజయాన్ని సొంతం చేసుకోవడానికి ఆనాడు దేవతలకు క్షీర సాగర మథనం తర్వాత అమృతం లభించింది. మానవులు విషాదానికి లోను కాకుండా, కర్తవ్యాన్ని విస్మరించకుండా, ఆహార వ్యవహారాల్లో నియంత్రణ కలిగి ఉండేందుకు, రాగద్వేషాలకు లోను కాకుండా, శత్రువులు, మిత్రులపట్ల, మానావమానాల్లో, కష్టసుఖాల్లో సమత్వాన్ని పాటించేందుకు, భుక్తికి లోటు లేకుండా ఆదర్శవంతంగా జీవించేందుకు భక్తిని అలవరచుకొనేందుకు, ముక్తిని పొందేందుకు అవసరమైన అమృతాన్ని ఉపదేశ రూపంలో శ్రీకృష్ణ పరమాత్మ మనకు అందించాడు. అదే గీతామృతం.




శాఖోపశాఖలతో అతి విస్తృతమైన వేద వాఙ్మయాన్ని, ఆరు వేదాంగాలను, 18 పురాణాలను, 24 వేల శ్లోకాలు కల శ్రీరామాయణాన్ని, లక్షా ఇరవై అయిదువేల శ్లోకాలుకల మహా భారతాన్ని, దర్శనాలను, ఉప పురాణాలను, ధర్మశాస్త్ర గ్రంథాలను అధ్యయనం చేయలేక పోయినా ఫరవాలేదు. పద్మనాభుడైన శ్రీకృష్ణ పరమాత్మ ముఖ పద్మం నుండి వెలువడిన 700 శ్లోకాలు కల ఒక్క భగవద్గీతామృతాన్ని లోతుగా అధ్యయనం చేసినా చాలును.

దేవతల క్షేమానికై శ్రీమన్నారాయణుడు క్షీర సాగర మథనం చేయించి మోహినీ అవతారంతో దేవతలకు అమృతాన్ని అందించినట్లే, దేశకాల భేదం లేకుండా అన్ని కాలాలకు, అన్ని దేశాలకు చెందిన మానవ సముదాయానికి శ్రేయస్సును కలిగించడానికి శ్రీకృష్ణుడు అర్జునుణ్ని ఒక కారణంగా ఏర్పాటు చేసుకొని భగవద్గీతామృతాన్ని అందించాడు. శరీర పోషణకు, రక్షణకు అవసరమైన ఉప దేశాలను మొదలుకొని పలికేమాట. వేసే అడుగు, చేసే వ్యవహారం ఎట్లా ఉండాలో తెలుసుకు నేందుకు సమాజంలో అసమానతలు తొలగేందుకు కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలను అనుసరించేందుకు, వైరాగ్యాన్ని అలవర్చుకునేందుకు ప్రతి వ్యక్తి సర్వాంగీన వికాసాన్ని పొందేందుకు అవసరమైన ఉపదేశాలను గీతాచార్యుడైన శ్రీకృష్ణుడు రసరమ్యంగా బోధించాడు.
– సముద్రాల శఠగోపాచార్యులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం
10-12-2019



పాసయ్యారు
సినిమా పేజీలో...



గత సంవత్సర విజేత చేతుల మీదుగా మిస్ యూనివర్స్ కిరీటాన్ని అందుకుంటున్న జొజిబిని తుంజి

## నలుపు సౌందర్యం కాదనుకునే లోకమా

# నేటితో నువ్వు మారు

‘ఈ ప్రపంచం నలుపును ఎలా చూస్తుందో నాకు తెలుసు. నాలాంటి తల వెంట్రుకలు, చర్మపు రంగు ఉన్నవారిని ఎలా వ్యాఖ్యానిస్తారో నాకు తెలుసు. ఈ రోజుతో ఆ అభిప్రాయాలన్నింటికీ చెల్లుచీటీ పాడండి’ అని ‘మిస్ యూనివర్స్ 2019’ విజేత జొజిబిని తుంజి అన్నారు.

26 సంవత్సరాల ఈ నల్లజాతి మోడల్, హక్కుల కార్యకర్త, స్త్రీల కార్యకర్త దక్షిణాఫ్రికా దేశం నుంచి ‘మిస్ యూనివర్స్’ పోటీలలో పాలు పంచుకుని తన కంఠాన్ని గట్టిగా వినిపించి హర్ష ధ్వానాల మధ్య విజేతగా శిరస్సున అందాల కిరీటాన్ని ధరించారు. 67 సంవత్సరాలుగా జరుగుతున్న మిస్ యూనివర్స్ పోటీలలో ఇలా నల్ల జాతీయురాలు టైటిల్ గెలుచుకోవడం మూడో సారి. గతంలో అంగోలా నుంచి, ట్రినిడాడ్ నుంచి మిస్ యూనివర్స్ అయిన వారున్నారు.

అమెరికా అట్లాంటాలో సోమవారం జరిగిన ఈ అందాలపోటీ వేడుకలో జొజిబిని తుంజి సాధించిన విజయం ప్రపంచవ్యాప్తంగా మూస కట్టు సౌందర్య ప్రమాణాలను దిగుదుడుపు అయ్యేలా చేసింది. తెల్లగా ఉంటేనే అందమని, పొడవైన వెంట్రుకలే సౌందర్యమని అనుకునేవారందరికీ ఇదొక చెంపపెట్టు, అలా లేని వానికి ఈ విజయం ఒక కొత్త స్ఫూర్తి అని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

‘తలుపు తెరిచి చూడండి. ఒక కొత్త వెలుతురు వస్తుంది. ప్రపంచంలోని ఆడపిల్లలంతా నా ముఖంలో తమ ప్రతిబింబాన్ని చూసుకోవాలని కోరుకుంటున్నాను. కలలు కనడానికి వెనుకంజ వేయవద్దని హితవు చెబుతున్నాను’ అని జొజిబిని తుంజి చెప్పారు. ‘నా పేరు జొజిబిని తుంజి. నాది దక్షిణాఫ్రికా. నేను మిస్ యూనివర్స్ విజేతను అని గర్వంగా చెబుతాను’ అని కూడా ఆమె అన్నారు.

90 దేశాల అతిలోక సౌందర్యవతులు ఈ కిరీటం కోసం పోటీ పడితే సౌందర్యవంతమైన దేహంతోపాటు సౌందర్యభరితమైన ఆలోచన కలగలిసిన జొజిబినికి విజయం లభించింది. ‘నేటి ఆడపిల్లలకు మనం ఎలాంటి పాఠాలు చెప్పాలి’ అని పోటీలో చివరి ప్రశ్నకు జొజిబిని ఏ మాత్రం తొట్రు పడకుండా ‘మనం వారికి నాయకులం కమ్మని చెప్పాలి. నాయకత్వం తమ పరిధిలోని సంగతి కాదని ఆడపిల్లలు అనుకుంటారు. వారు ఎదగాలి. వేదిక మీద తమ వాటా కోసం, దిశా నిర్దేశం చేయడం కోసం ఏ మాత్రం బెరుకు లేకుండా ప్రయత్నించాలి’ అని జొజొబిని చెప్పారు.

ఈ పోటీలలో మిస్ పోర్టో రీకో ఫస్ట్ రన్నరప్‌గా, మిస్ మెక్సికో సెకండ్ రన్నరప్‌గా నిలిస్తే భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన వర్తికా సింగ్ టాప్ 20 స్థానాలలో నిలిచి సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

దక్షిణాఫ్రికాలోని ట్సోలో అనే చిన్న మునిసిపాలిటీ సమీపంలోని పల్లెలో బాల్యం గడిచిన జొజొబిని కేప్‌టౌన్‌లో పబ్లిక్ రిలేషన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. లింగవివక్ష కారణంగా స్త్రీలకు దొరకని సమాన అవకాశాల గురించి విద్యార్థి దశ నుంచే ఆమె పోరాటం చేస్తున్నారు. ఇప్పుడు ‘మిస్ యూనివర్స్’ కిరీటం ద్వారా దొరికిన కీర్తితో తన గొంతును ప్రపంచమంతా వినిపించాలనుకుంటున్నారు.

స్త్రీ వికాసం కోసం ఆమె చేయబోయే ప్రయత్నాలకు శుభకామనలు తెలియచేద్దాం.

నేడు అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం

# స్త్రీల హక్కులు, భద్రతలో డెన్మార్క్ నం.1



డిసెంబర్ 10 ‘అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం’. ఈ సందర్భంగా గత రెండు వారాలుగా ఐక్యరాజ్య సమితి లింగ వివక్ష లేని, సమాన అవకాశాలు కలిగిన ప్రపంచమే లక్ష్యంగా విభిన్న కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా నవంబర్ 25ని ‘మహిళలపై హింసావ్యతిరేక దినోత్సవం’గా గుర్తించింది. అప్పటి నుంచి డిసెంబర్ 10 వరకు స్త్రీపురుష సమానత్వాన్ని చాటుతూ కార్యక్రమాలు జరుగుతున్నాయి. స్త్రీల హక్కులూ మానవహక్కులుగా గుర్తించమని చెప్పడమే ఈ కార్యక్రమాల ఉద్దేశ్యం.

**స్త్రీల హక్కులు మానవ హక్కులే**

స్త్రీల హక్కులు మానవ హక్కుల్లో ఎందుకు భాగం కాదు? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది. నిజానికి వారి శారీరక, మానసిక, భౌతిక అవసరాల రీత్యా స్త్రీలకు కొన్ని ప్రత్యేక హక్కులుండాలని ఐక్యరాజ్యసమితి గుర్తించి వాటిని సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా మలిచింది. అయితే వాటికిప్పటికింకా సమాజంలో ఆమోదముద్ర పడలేదన్నది కాదనలేని సత్యం. ఇప్పటికీ అది చేరుకోవాల్సిన లక్ష్యం. స్త్రీల హక్కులు మానవ హక్కుల్లో భాగమేనని గుర్తించిన దేశాలు బహు తక్కువని 2019 లింగ సమానత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 129 దేశాల్లో జరిపిన అధ్యయనంలో సంపూర్ణంగా లింగ సమానత్వాన్ని సాధించిన దేశాలు లేనేలేవన్న విషయం వెల్లడయ్యింది. అయితే స్త్రీపురుష సమానత్వం కోసం కృషి చేస్తోన్న దేశాల్లో కొంతలో కొంత మెరుగైన ఫలితాలను సాధించడం గమనించాల్సిన విషయం.

**కొన్ని దేశాల్లో కొంత మెరుగు...**

2019లో జరిగిన సర్వే ప్రకారం లింగ సమానత్వం వైపు పురోగమిస్తోన్న టాప్ టెన్ దేశాల్లో డెన్మార్క్‌ది తొలిస్థానం. ఫిన్‌లాండ్ ద్వితీయస్థానంలో; స్వీడన్ మూడవ స్థానంలో ఉన్నాయి. నార్వే నాలుగు, నెదర్లాండ్స్ ఐదు, స్లోవేనియా ఆరు, జెర్మనీ ఏడు స్థానాల్లో ఉన్నాయి. కెనడా ఎనిమిదవ స్థానంలో ఉండగా, ఐర్లాండ్ తొమ్మిదవ స్థానాన్ని, ఆస్ట్రేలియా పదో స్థానాన్ని దక్కించుకున్నాయి.

**సమానత్వంలో టాప్ డెన్మార్క్...**

స్త్రీల విషయంలో టాప్ వన్ స్థానంలో నిలిచిన డెన్మార్క్ గురించి ఇప్పుడు మిగిలిన దేశాలు దృష్టి పెట్టాయి. డెన్మార్క్‌లో నాలుగ్గంటలకే సూర్యాస్తమయం అవుతుంది. అంటే డెన్మార్క్‌లో దీర్ఘరాత్రులుంటాయి. అయితే అక్కడ చీకటి అభద్రతకు చిహ్నం కాదు. ఆ దేశంలో మహిళలు పగలే కాదు రాత్రిళ్ళు కూడా అత్యంత సురక్షితంగా ఉంటారు. స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించేందుకు ఆ దేశంలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. అంతే కాదు సంక్షేమ రాజ్యంగా కూడా డెన్మార్క్‌ని పేర్కొంటారు. ఆరోగ్యం, విద్య, ఉద్యోగావకాశాల్లో స్త్రీపురుష సమానత్వాన్ని విస్తృతంగా ముందుకు తెచ్చింది డెన్మార్క్ ప్రభుత్వం. డెన్మార్క్‌లో ఉపాధిరంగంలో ఉన్న మహిళలు అత్యధికంగా ఉన్నారు. స్త్రీ అయినా పురుషులు అయినా ఒకే విధమైన వేతన విధానాన్ని అనుసరించారు. ఆర్థిక రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ నిర్ణయాత్మక పాత్రలో మహిళలకూ సమ ప్రాధాన్యముంది. 2014 ఎన్నికల అనంతరం 30 శాతం మంది మంత్రులూ, 37 శాతం మంది పార్టీ నాయకులూ స్త్రీలే ఉన్నారు. వివిధ కంపెనీల్లో బోర్డు మెంబర్లుగా ఉన్న స్త్రీల శాతం పెరిగింది. ఇక్కడ స్త్రీలు 61 ఏళ్ళకు రిటైర్ అయితే, పురుషులకది 63 ఏళ్ళు.

**పునరుత్పత్తి హక్కులు...**

వివాహ వయస్సు, పునరుత్పత్తి హక్కుల విషయంలో డెన్మార్క్ ముందుంది. 2012లో ఇక్కడ స్త్రీలు తొలి బిడ్డను కనే వయస్సు 29. 52 వారాల పేరెంటల్ లీవ్ అమలుచేస్తున్నారు. అత్యధిక శాతం తల్లులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు. భర్తలకు ఇచ్చే పిల్లల పెంపకానికి సంబంధించిన సెలవుని సైతం పెంచారు.

**పిల్లల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత...**

మహిళా ఉద్యోగుల పిల్లల పెంపకానికి సంబంధించిన విషయాల్లో సైతం డెన్మార్క్ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. ప్రభుత్వమే పిల్లల సంరక్షణ బాధ్యతను వహిస్తోంది. వాటి పర్యవేక్షణకు సరిపడే అధికారులను, సిబ్బంది నియామకాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. 2013లో 0–2 ఏళ్ళ మధ్య వయస్సు పిల్లల్లో 67.9 శాతం మందిని ప్రభుత్వం నిర్వహించే చైల్డ్ కేర్ సెంటర్లలో చేర్పించారు. అదే ఏడాది 3–5 ఏళ్ళ మధ్యవయస్సు పిల్లల్లో 97.2 శాతం మందిని చేర్పించారు. మానవ అక్రమ రవాణానిషేధంపై డెన్మార్క్ ప్రత్యేక దృష్టి సారించింది.

–అరుణ అత్తలూరి

బ్లాక్ ఈజ్ బ్యూటీ!

# నల్లటి అపరంజి...



**తెల్లగా ఉన్న చాలామందిని జుజుబీ అంటూ తోసిరాజంది ఈ నల్లటి జోజిబిని తుంజి. విశ్వసుందరిగా విజయకేతనం ఎగరేసిన ఈ అమ్మాయి ఫెయిర్‌నెస్ ఫేట్‌ను సవాల్ చేసింది. తెల్లగా ఉంటేనే అందమా? నలుపులో నాణ్యమైన మెరుపుతో ఉంటే... మేని నిగారింపు జిగేలుమంటే అది అందం కాదా?... ఎన్నెన్నో సందేహాలు! నలుపులో అందం ఉంటుందో ఉండదో ఒకసారి కాస్త పరిశీలిద్దాం. పరికించిచూద్దాం.**

కార్యానికైనా, కదనానికైనా, కథనానికైనా శ్రీకారం చుట్టే ముందు కాస్త దైవప్రార్థన ఆనవాయితీ కదా. అందుకే దేముడైన రాముడి స్తుతితో మొదలుపెడదాం. శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం, సీతాపతిం, రఘుకులాన్వయ రత్నదీపం... అవునూ దేవుడికంటే అందమైన వారెవరైనా ఉంటారా? కోరి కోరి అరవింద దళాల్లాంటి కనువిందు చేసే కళ్లూ, ఆకర్షణీయమైన ఒళ్లూ లాంటి మంచి క్వాలిటీలన్నీ పుణికి పుచ్చుకున్న వాడు కావాలనుకుంటే తెల్లటి మేని ఛాయ పొందలేడా? ఈజీగా పొందగలడు. కానీ పొందలేదు. దీనికీ ఓ బ్యాక్‌గ్రౌండు స్టోరీ ఉంది. పుట్టింది ఉత్తర భారతదేశపు అయోధ్యలో! కావాలనుకుంటే ఫెయిర్ కాంప్లెక్షన్ పొందడం కష్టమేమీ కాదు. కాకపోతే... రేపు అరణ్యవాసంలో... కానల్లో మెలగాలి. కాలినడకన తిరగాలి. బండలెక్కాలి, కొండలెక్కాలి. మరి ఇన్ని పనులు చేయాల్సి ఉండగా ఎండకన్నెరగకుండా ఉంటే ఎలా? కన్నెర్ర జేసే ఎండలో తిరగకుండే ఎలా? కారడవుల్లో తిరగాలి కాబట్టే కారుమేఘపు రంగులో పుట్టాడు. దక్షిణభారత దేశపు కిష్కింధ వాసుల మేని ఛాయకు దగ్గర్లో ఉన్నాడు. మీరూ నేనూ ఒకటే రంగన్నాడు. అందుకే... అందం తెల్లదనంలో లేదు. నాణ్యమైన నల్లదనంలోనే ఉంది.

ఇక శ్రీకృష్ణుడి దగ్గరకు వద్దాం. ఆయనా అంతే. పాలసంద్రాన పవళించే స్వామికి, పాలరంగును మేనిరంగుగా పొందడం కష్టమా? కావాలనుకుంటే ఇంద్రజాలంతో చంద్రవర్ణం పొందలేడా? ఈయనకూ ఓ విజనుంది. ఓ మిషనుంది. రేపుమాపు గోపాలుడవ్వాలి. గోధూళి తగలాలి. గోవర్ధనమెత్తాలి. సైనైడ్ నిండి ఉన్న కాళిందిలో ఈదులాడితే సైడెఫెక్ట్ కొద్దీ శరీరం నల్లబడదూ? రేపు పొద్దస్తమానం యుద్ధక్షేత్రం కురుక్షేత్రంలో ఉన్నప్పుడు ఎర్రటెండకు మేనిరంగు మారిపోదూ! అదేదో అప్పుడు నల్లబడే బదులు... ముందుగానే నలుపులోనే ఆ బాలగోపాలుడు ఆబాలగోపాలమందరినీ ఆకర్షించేంత అందగాడిగా పుడితే పోదా అనుకున్నాడు.

దైవస్తుతి ముగిసింది. ఇహ ఇప్పుడు ఇహంలోకి వద్దాం. ఎలెక్స్ హేలీ రాసిన ఏడుతరాలు చదివారా? తన మూలాలు తెలుసుకుంటూ చేసిన ప్రయాణాన్ని చూశారా? ఏడు తరాల తర్వాత ఎలెక్స్ తెల్లటివాడేమో. కానీ తరాలను తవ్వుకుంటూ పోయినప్పుడు... వేరులను వెతుక్కుంటూ వెళ్లినప్పుడు... తాతల తండ్రులు... తండ్రుల తాతలు... వాళ్ల మూలపురుషుడు కింటాకుంటే నల్లనివాడని! కింటాకుంటే పుట్టిన రాత్రి ఆనవాయితీగా ఆ బిడ్డను తండ్రి ఉమరో చంద్రుడికి చూపాడు. ‘నీ కంటే గొప్పవాడు... ఇదుగో చూడు’ అనేసరికి నాణ్యమైన ఆ నల్లదనాన్ని చూసి తెల్లగా మెరుస్తున్న చంద్రుడు కాస్తా తెల్లబోయాడు. వెన్నెల రూపంలో వెలవెలబోయాడు.

చరిత్ర నుంచి కాసేపు పక్కకు వెళ్లి పక్షిలోకంలోకి వెళ్దాం. ఈ సంగతి వింటే... ఆర్నీ... వార్నీ... ఆర్నిథాలజీలో కూడా అదే చెబుతోందా అంటూ మీరు అచ్చెరువొందకమానరు. కళ్లముందు తెల్లగా కనిపిస్తూ తిరగాడే ఫారం కోళ్లంటే మీకిష్టమా? లేక నీలిరంగులో ఎగురుతూ ఉండే పాలపిట్టంటే మీకు గౌరవమా? నీలిపింఛం ఉన్నందుకేగా నెమలికి ఆ కంఠంలో క్రేంకార గీర.

అడవి పిట్టలను వదిలేసి మన సినిమాల్లోని ఆడపిల్లల అందాలకు వద్దాం. మన అలనాటి మేటి మహానటి సావిత్రి రంగులో ఓ వన్నె తక్కువే. ఆమె తెల్లటి తెలుపేమీ కాదు. రమణీయంగా, ఆకర్షణీయంగా ఉండే నటీమణుల్లో వాణిశ్రీ, వాణీవిశ్వనాథ్, అర్చన, భానుప్రియ, నల్ల రంగు పిల్లగా మరోచరిత్ర సృష్టించిన సరిత లాంటి వనితలంతా నల్లవారే. ఇక రేఖ, స్మితా పాటిల్, నందితా దాస్‌లు కన్నుతిప్పుకోలేనంతటి అందగత్తెలంటే కాదనే దమ్ములెవరికి ఉన్నాయ్ చెప్పండి?

కొందరు సైన్సును తప్ప మరోదాన్ని నమ్మరు. సైంటిఫిగ్గా నిరూపిస్తే చేస్తే తప్ప ఒక పట్టాన ఒప్పరు. అలాగే. నల్లదనం గొప్పదనాన్ని సైన్స్ సాయంతోనే చెబుదాం. అన్ని రంగుల్నీ బెదరగొట్టీ, చెదరగొట్టీ, తిరగబెట్టీ వెనక్కుపంపితే కనిపించేది తెలుపు. అన్ని వర్ణాల్నీ తన అక్కున చేర్చుకుని, తనలో ఇముడ్చుకుంటే వచ్చే వర్ణం నలుపు. అందుకే ఫిజిక్సు మ్యాజిక్సు ప్రకారం చూసినా అన్నింటినీ దగ్గర చేసుకునే గుణం ఒక్క నల్లదనానికే ఉంది. గొప్పదనాన్ని గుర్తించే గుణం తమిళులకుండబట్టే మంచిదనానికి ‘నల్ల’ అనే మాటతో గౌరవించారు వారు.

నలుపే అందం అని చెప్పడానికి ఇన్ని మాటలేల? నలుపంటే చిమ్మచీకటి కాదు... నిద్రలో కమ్మటి కలలవాకిలి. స్వప్నాల లోగిలి. ఒకింత ముదురు రంగు మంచిగంధానికే సౌరభం. ముగ్గు పిండికి కాదు. కారుమబ్బు చివరనున్న నల్లంచుకే వెండి తేజంపు మెరుపు. తెల్లమబ్బుకు కాదు. పేలవమైనదెప్పుడూ తెల్లగానే ఉంటుంది. నవనవలాడేదెప్పుడూ నల్లగానే ఉంటుంది. ఈ మాటనే జోజిబిని తుంజి మరోమారు నిరూపించింది.

– యాసీన్

న్యూనత వద్దు

# లావుగా ఉన్నా హాయిగా ఉండు

**కొలతల్లో ఉన్న రూపమే ప్రకృతికి సమ్మతమైతే అందరూ అలాగే పుట్టేవారు. మన రూపం మన చేతుల్లో ఉండదు. జన్మతః వచ్చిన శరీరాన్ని క్రమశిక్షణలో ఆరోగ్యవంతంగా ఉంచుకోవడం మన పని. అంతేతప్ప ఒకరు చెప్పిన కొలతల్లో దానిని కుదించాల్సిన పనిలేదు. సన్నగా లేకపోతే సిగ్గు పడాల్సిన అవసరమూ లేదు. ఆ మాటే అంటున్నారు అమేయ, పల్లవి.**



పల్లవి, అమేయ

‘‘చుట్టాల ఫంక్షన్స్‌కి, ఫ్రెండ్స్ గెట్ టు గెదర్ పార్టీలకి లేదంటే సినిమా, షాపింగ్.. ఇలా ఎక్కడికి వెళ్లినా దగ్గరివాళ్ల నుంచి అసలు ముక్కూ మొహం తెలియని అపరిచితుల దాకా ఎవరికి కనపడితే వాళ్లు సలహాలిస్తుంటారా?’’ అమేయ ప్రశ్న పూర్తవకముందే ‘‘ఓ భేషుగ్గా ఇస్తారు’’ అంటూ ఠక్కున సమాధానం చెప్పింది పల్లవి. ‘‘మంచి నీళ్లు బాగా తాగండి, ఉదయం లేవగానే గోరువెచ్చని నీటిలో తేనె కలుపుకొని తాగండి నెల రోజుల్లో సన్నగా అయిపోతారు. బీరకాయ, సొరకాయ తినండి.. వారంలోగా రివటలా కాకపోతే నన్ను అడగండి.. అంటూ.. అబ్బో ఎన్ని సలహాలో’’ వెటకారమాడింది పల్లవి.

‘‘అంతేనా.. ఇలాంటి డ్రెస్‌లు వేసుకోకు. చీర కట్టుకో.. ఒళ్లు దాస్తుంది. నిలువు డిజైన్లు వేసుకో.. లావుగా కనపడవు.. అలా జుట్టు విరబోసుకోకు. పోనీ వేసుకో మొహం కోలగా కనిపిస్తుంది.. అంటూ జీతంలేని స్టయిలిస్ట్‌లు పుట్టుకురారూ?’’ అంతకన్నా వ్యంగ్యంగా అమేయ.

ఫ్యాట్ డాట్ సో (fat.so?) అనే పోడ్‌కాస్ట్ (ఆడియో) షో కోసం వాళ్ల సంభాషణ అలా సాగుతోంది. ఫ్యాట్ డాట్ సో ఏంటి అంటే.. ఎవరూ కావాలని లావు కారు. అనారోగ్యం, ప్రసవం, తన మీద తాను శ్రద్ధ పెట్టుకునే స్పృహను కల్పించని కుటుంబ వ్యవస్థ... ఇవన్నీ మహిళల ఊబకాయానికి కారణాలే. చూసేవాళ్లకు ఇవన్నీ అనవసరం కదా. కానీ ఖర్చులేని సలహాలు, సూచనలు ఇస్తూంటారు స్థూలకాయానికి సంబంధించి. మానసిక స్థయిర్యాన్ని దెబ్బతీస్తూనే ఉంటారు. దీన్నే థీమ్‌గా తీసుకొని ‘‘అవును లావే. అయితే ఏంటీ? అంటూ అమ్మాయిలు ఆత్మ విశ్వాసంతో ముందడుగువేసేలా ‘‘ఫ్యాట్ డాట్ సో?’ షోను నిర్వహిస్తున్నారు ఆ ఇద్దరూ. ఒక్కమాటలో చెప్పాలంటే ‘బాడీ పాజిటివిటీ జర్నీ’ ని ఓ ఉద్యమంలా ప్రారంభించారు. వీళ్లిద్దరూ లావే. అందుకే ఈ షోలో వాళ్ల మీద వాళ్లే జోక్స్,సెటైర్లు వేసుకుంటూ షోను నడిపిస్తుంటారు.

**ఆడవాళ్లకు మాత్రమే.. ఫిఫ్టీ డేట్స్ ఇన్ దిల్లీ**

అమేయ, పల్లవి నాథ్.. ఢిల్లీలో స్థిరపడ్డ హైదరాబాదీయులు. అమేయకు 37 ఏళ్లు. పల్లవి వయసు నలభై. ఓ మీడియా డెవలప్‌మెంట్ స్టార్టప్ కోసం అమేయ పనిచేస్తోంది. పల్లవి కార్పొరేట్ ఉద్యోగిని. ఇద్దరికీ తెలుసున్న ఓ స్నేహితురాలి ద్వారా ఈ ఇద్దరూ ఒకరికొకరు పరిచయం అయ్యారు. ఆ స్నేహితురాలు ఢిల్లీలో వారం వారం ‘‘ఆడవాళ్లకు మాత్రమే’’ అనే సమావేశం పెట్టేవారు. అందులో మహిళలకు సంబంధించిన ఆరోగ్య, ఆర్థిక, సామాజిక భద్రత సమస్యలన్నిటినీ చర్చిస్తారు. టీచర్లు, లెక్చరర్లు, థియేటర్ ఆర్టిస్టులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, డాక్టర్లు, లాయర్లు, గృహిణులు కూడా హాజరవుతారు. అలా ఒకసారి ఆ సమావేశంలో పల్లవి.. తను లావుగా ఉండడం మీద మాట్లాడింది. ‘‘నలభై ఏళ్ల ఫాట్.. విడాకులు పొందిన సెల్ఫ్ ఎంప్లాయ్డ్ మహిళను నేను’’ అంటూ పల్లవి తనను తాను పరిచయం చేసుకున్న తీరు, ఆ ఆత్మ విశ్వాసం, వివిధ అంశాల మీద ఆమెకున్న స్పష్టమైన అభిప్రాయాలు అమేయకు నచ్చాయి. సమావేశం అయిపోయాక పల్లవిని పలకరించింది. తన గురించి చెప్పుకుంది. అమేయ బ్లాగు రాసేది. ‘‘50 డేట్స్ ఇన్ ఢిల్లీ’’గా ఆ బ్లాగ్ చాలా పాపులర్. అందులో తను తన ఢిల్లీ జీవితాన్ని, డేటింగ్ లైఫ్ వంటి వ్యక్తిగత విషయాలను కథనాల రూపంలో రాసేది. ఆ బ్లాగ్‌కు పల్లవి పెద్ద ఫాలోవర్. ఆ అమేయే ఈ అమేయ అని తెలిసి సంతోషపడింది. ఇద్దరి మధ్య స్నేహం గట్టిపడింది.

**ఫ్యాట్ డాట్ సో?**

అమేయ రాత, తన మాట రెండూ కలిస్తే మంచి షో అవుతుందన్న ఆలోచన వచ్చింది పల్లవికే. ఆ విషయాన్ని అమేయతో పంచుకుంది.



రూపం ఉల్లాసానికి విఘాతం కాదు

వెంటనే ఒప్పేసుకుంది అమేయ. ఆలస్యం చేయకుండా మొదలుపెట్టారు. వాక్చాతుర్యం, సమయస్ఫూర్తి ఇద్దరికీ ఉన్న కామన్ లక్షణాలు. తమ నిజ జీవితంలోని బాధలు, సమస్యలు, ఇబ్బందులకు వాటిని జోడించి సంభాషించడం.. రికార్డ్ చేయడం.. వాటిని వినడం. అంతే.. వాళ్ల మీద వాళ్లకు నమ్మకం కలిగింది. వాళ్లు చేసిన మొదటి రెండు షోలను ‘సునో ఇండియా’పాడ్‌కాస్ట్ చానెల్ విని.. ముచ్చటపడింది. స్పాన్సర్ చేయడానికి ముందుకు వచ్చింది. ప్రస్తుతం ‘ఫ్యాట్ డాట్ సో?’ పది ఎపిసోడ్లు రిలీజ్ అయ్యాయి. ‘‘అవి విని మా చిన్నప్పటి ఫ్రెండ్స్ అందరూ కాల్ చేస్తున్నారు. చిన్నప్పుడు ఎంత షైగా ఉండేదానివి... ఆ అమేయవా? అని తనకు, ఓహ్.. పల్లవీ.. మీ షో సూపర్. ఎంత బాగుంటుందో? మా పిల్లలకూ వినిపిస్తున్నాం. వాళ్ల కాన్ఫిడెన్స్ లెవెల్స్ ఎంత మెరుగవుతున్నాయో తెలుసా? అమేజింగ్ డియర్ ’ అంటూ నాకు కాల్స్ వస్తున్నాయి’ అని అంటుంది పల్లవి. ‘‘నిజమే. ఈ షో హిట్ కావడానికి కారణం.. మేం గొప్పలు చెప్పట్లేదు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడుతున్నాం. చిన్నప్పుడు నేను చాలా సన్నగా.. అందంగా చురుగ్గా ఉండేదాన్ని. అన్నిట్లో ఫస్ట్ వచ్చేదాన్ని అంటూ గొప్పలతో మా సంభాషణ స్టార్ట్ కాదు. మా శరీరం.. దానిపట్ల మాకున్న అంగీకారంతోనే సంభాషణ మొదలువుతుంది.. సాగుతుంది.. ముగుస్తుంది. దీనివల్ల స్థూలకాయులే కాదు.. రంగు తక్కువని బాధపడే వాళ్లు,హేళనకు గురయ్యేవాళ్లు, పొట్టి, పొడుగు అనే భేదంతో ఇబ్బంది పడేవాళ్లు... ఇలా దేన్నయినా లోపంగా ఊహించుకునేవాళ్లు, చూసేవాళ్లు మా మాటల్లో తమను తాము వింటున్నారు. ముందు తమను తాము ప్రేమించుకోవాలి.. గౌరవించుకోవాలి అని గ్రహిస్తున్నారు. బాడీ షేమింగ్ చేసిన వాళ్లకు తగు సమాధానమిస్తున్నారు. ఇమ్‌పర్‌ఫెక్షనే పర్‌ఫెక్షన్ అని అర్థంచేసుకుంటున్నారు కాబట్టే మా షో నచ్చుతోంది’’ అంటుంది అమేయ.

ఆడవాళ్ల మీద పెరుగుతున్న హింస, అభద్రత వంటి వాటినీ అంశాలుగా తీసుకొనీ షో చేస్తామని చెప్పారిద్దరూ!

నిజమే.. ప్రపంచంలో ఎవరూ పర్‌ఫెక్ట్ కారు.. ఏదీ పర్‌ఫెక్ట్‌గా ఉండదు. అలా ఉండకపోవడమే జీవితం. అందుకే ఆత్మవిశ్వాసం అవసరం. అప్పుడే మనల్ని మనం స్వీకరించుకోగలుతాం. ఆ విశ్వాసమే ఎదుటి వారికి మన మీద గౌరవాన్ని పెంచుతుంది. ఫ్యాట్ డాట్ సో? చెప్పేదీ అదే!

2019 ఇయర్లీ రౌండప్ 1


● శ్రద్ధా శ్రీనాథ్ ● శివాత్మికా రాజశేఖర్ ● ఐశ్వర్యా రాజేశ్

# పాసయ్యారు

ఇండస్ట్రీ సముద్రం లాంటిది. కొత్త నీరు ఎప్పటికప్పుడు సముద్రంలో చేరినట్టే, ఇండస్ట్రీలోనూ కొత్త ముఖాలు కనిపిస్తూనే ఉంటాయి. ప్రవాహం సాగుతుంటుంది. ఈ ప్రయాణంలో ప్రామిసింగ్‌గా కొందరు మాత్రమే అనిపిస్తారు. నిజానికి గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మెరిసిన కొత్తవాళ్ల సంఖ్య అభినందనీయంగా లేదు. గత ఏడాది కొత్త దర్శకులు నెలకో వారం చొప్పున మెరిశారు. ఈసారి అదీ కనిపించలేదు. హీరోహీరోయిన్లు విషయంలోనూ అంతే. అలా ఈ ఏడాది తెలుగులో పరిచయమైనవాళ్లల్లో ఫస్ట్ టెస్ట్‌లో పాస్ అయి, ఇటు ఇండస్ట్రీ అటు ప్రేక్షకులకు బాగా రీచ్ అయినవారి గురించి మాట్లాడుకుందాం.

### హీరోలిద్దరే!

- డిటెక్టివ్ అనేవాడికి తన మీద తనకి నమ్మకం, కొంచెం ఓపిక ఉండాలి అనేది ఏజెంట్ ఆత్రేయ ఫిలాసఫీ. నవీన్ పొలిశెట్టి జర్నీని గమనిస్తే ఇలాంటి థియరీనే తన లైఫ్‌లోనూ పాటించినట్టున్నారు. యూట్యూబ్ వీడియోలతో మొదలయి, సినిమాల్లో అవకాశాల కోసం ఓపికగా ఎదురు చూశారు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ'తో హీరోగా పరిచయం అయ్యారు నవీన్ పొలిశెట్టి. ఈ ఏడాది వచ్చిన చిన్న చిత్రాల్లో పెద్ద విజయం అందుకున్న సినిమా 'ఏజెంట్.. ఆత్రేయ'. వన్ మ్యాన్ షోగా సినిమాను నడిపించారు నవీన్. ప్రస్తుతం 'జాతి రత్నాలు'లో నటిస్తున్నారు.
- అన్నయ్యేమో యూత్ క్రేజీ స్టార్. ఏం చేసినా సెన్సేషనే. ఆయన తమ్ముడిగా ఇండస్ట్రీలో పరిచయం అయ్యేటప్పుడు అంచనాలుండటం సహజం. ఒత్తిడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎంట్రీ ఇచ్చారు ఆనంద్ దేవరకొండ.. బ్రదర్ ఆఫ్ విజయ్ దేవరకొండ. 'దొరసాని' అంటూ ఓ కొత్త తరహా ప్రేమకథను ప్రేక్షకులకు చూపించారు. స్టార్ అన్నయ్య తమ్ముడు కాబట్టి ఎంట్రీ ఈజీ అయింది. ప్రస్తుతం రెండు, మూడు చిత్రాలతో బిజీగా ఉన్నారు ఆనంద్. ఇలా ఈ ఏడాది పరిచయమైన హీరోల్లో ప్రేక్షకులకు ఎక్కువ రీచ్ అయినది ఈ ఇద్దరే అని చెప్పొచ్చు.


● ఆనంద్ దేవరకొండ


● నవీన్ పొలిశెట్టి

### ఆ ఆరుగురు...

ఈ ఏడాది చాలామంది డైరెక్టర్లు పరిచయం అయ్యారు. అయితే సక్సెస్ పర్సంటేజ్ పరంగా ఎక్కువగా రీచ్ అయినవారి గురించి ప్రస్తావించాలంటే.. 'డియర్ కామ్రేడ్'తో భరత్ కమ్మ, 'ఎవరు'తో వెంకట్ రామ్‌జీ, 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో స్వరూప్ ఆర్‌ఎస్‌జే, 'దొరసాని'తో కేవీఆర్ మహేంద్ర, 'మల్లేశం'తో రాజ్.ఆర్, 'రాజావారు రాణిగారు'తో రవికిరణ్ దర్శకులుగా పరిచయం అయ్యారు. హిట్ కొట్టారు. నెక్ట్స్ సినిమా ఏం చేస్తారు? అనే ఆలోచన ప్రేక్షకుడిలో కలిగించడంలో సక్సెస్ అయ్యారు.

లైంగిక వేధింపులు, లైంగిక హింస.. ప్రస్తుతం మాట్లాడాల్సిన విషయాలు. అవగాహన కలిగించాల్సిన సమయం. ఇలాంటి కథతో 'డియర్ కామ్రేడ్' కథను చెప్పారు భరత్ కమ్మ. ఈ ఏడాది మన దేశం నుంచి ఆస్కార్‌కు పంపే సినిమాల లిస్ట్‌లో 'డియర్ కామ్రేడ్' కూడా ఉండటం విశేషం. 'డిటెక్టివ్' కథలు తెలుగులో వచ్చి చాలా కాలం అయింది. అలాంటి సీరియస్ డిటెక్టివ్ కథకు హ్యూమర్ జత చేసి 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ'తో బాక్సాఫీస్‌కి కితకితలు పెట్టారు స్వరూప్. ఈ అల్లరి ఏజెంట్ అందరినీ నవ్వించి, అందరికీ నచ్చేశాడు. ఏజెంట్‌ను ఓ ఫ్రాంచైజీగా కొనసాగించే ఆలోచన ఉందని దర్శకుడు ఓ సందర్భంలో తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో 1980లలో జరిగే అపురూపమైన ప్రేమకథగా 'దొరసాని' చిత్రాన్ని తెరకెక్కించారు మహేంద్ర. ఈ కథను మూడేళ్లు పాటు సుమారు 42 వెర్షన్లు రాసినట్టు దర్శకుడు పేర్కొన్నారు. కథ 1980లలో జరిగేట్టు చూపించడంలో దర్శకుడు సూపర్ సక్సెస్ అయ్యారనే చెప్పాలి. చిన్న బడ్జెట్ సూపర్ స్టార్ అడివి శేష్ ఈ ఏడాది మరో కొత్త దర్శకుడిని పరిచయం చేశారు. ఫ్రెంచ్ సినిమా 'ది ఇన్విజిబుల్ గెస్ట్' కథను తీసుకుని అద్భుతంగా మన భారతీయతను జోడించి 'ఎవరు'గా తీశారు దర్శకుడు వెంకట్ రామ్ జీ. సినిమా పూర్తయ్యేసరికి ప్రేక్షకుల గోళ్లు ఏమాత్రం మిగలకుండా పూర్తిగా కొరికేసుకునే రేంజ్ థ్రిల్లర్ తీయడంలో పక్కాగా సక్సెస్ అయ్యారు రామ్‌జీ. మరో మీడియమ్ బడ్జెట్ హిట్‌ను అడవి శేష్ హిట్ లిస్ట్‌లోకి అందించారు రామ్‌జీ. ఎన్ని కమర్షియల్ సినిమాలొచ్చినా, కాన్సెప్ట్ చిత్రాలొచ్చినా మన కథలు, మన సంస్కృతులను గుర్తు చేసే సినిమాలు ప్రత్యేకం.. అవసరం. అమ్మ కష్టాన్ని చూడలేక ఆసు యంత్రాన్ని కనిపెట్టిన సూపర్ హీరో 'చింత కింది మల్లేశం' జీవితకథను 'మల్లేశం'గా తెరకెక్కించారు రాజ్ ఆర్. నిజాయతీగా కథను చెప్పిన తీరు ప్రశంసలు అందుకుంది. కొత్త దర్శకులకు ప్రియమైన జానర్‌లో ప్రేమకథ ఎప్పుడూ ముందుంటుంది. ఆ పాత ఫార్ములాను ఎంత కొత్తగా చెప్పడం అనేదాన్ని బట్టి దర్శకుడి ప్రతిభ దాగి ఉంటుంది. 'రాజావారు రాణిగారు' అనే పల్లెటూరి ప్రేమకథను కనువిందుగా చూపించారు దర్శకుడు రవికిరణ్. దర్శకుల్లో ఈ ఆరుగురి రీచ్ బాగుందనొచ్చు.

### మెరిసిన నాయికలు

తెలుగు మూలాలున్న అమ్మాయి ఐశ్వర్యా రాజేశ్. తమిళంలో మంచి పేరు సంపాదించారు. తమిళంలో ఆమె నటించిన సూపర్ హిట్ చిత్రం 'కణా'. ఈ చిత్రం రీమేక్ 'కౌసల్య కృష్ణమూర్తి'తో తెలుగులో పరిచయం అయ్యారామె. ప్రస్తుతం విజయ్ దేవరకొండతో 'వరల్డ్ ఫేమస్ లవర్' పూర్తి చేసి, నానీతో 'టక్ జగదీష్' కమిట్ అయ్యారు. కన్నడంలో మంచి పెర్ఫార్మర్ అనిపించుకున్న శ్రద్ధా శ్రీనాథ్ తెలుగులో 'జెర్సీ'తో ఎంట్రీ ఇచ్చారు. నాని పాత్రకు దీటుగా నటించి ఆడియన్స్‌లో ఆసక్తి కలిగించారు. ప్రస్తుతం 'క్షణం' దర్శకుడు రవికాంత్ పేరెపు దర్శకత్వంలో ఓ సినిమా పూర్తి చేశారామె. రాజశేఖర్, జీవిత దంపతుల కుమార్తెగా ఎంట్రీ ఇచ్చిన శివాత్మికా రాజశేఖర్ 'దొరసాని'లో మంచి నటనను కనబరిచారు. అలానే 'గద్దలకొండ గణేష్'లో మృణాలినీ రవి, 'గ్యాంగ్ లీడర్'లో ప్రియాంకా మోహనన్ ప్రేక్షకుడి అటెన్షన్ రాబట్టగలిగారు.

పేరు రావడం.. రాకపోవడం అనేది ఎవరి చేతుల్లోనూ ఉండదు. సినిమా హిట్ వారి వారి కెరీర్‌ని నిర్ణయిస్తుంది. ఈ ఏడాది పెద్దగా గుర్తింపు తెచ్చుకోనివారికి 2020 కలిసొస్తుందేమో. అలాగే ఈ ఏడాది ఎక్కువగా రీచ్ అయినవారు వచ్చే ఏడాది ఇంకా విజయాలు చూస్తారేమో.

– గౌతమ్ మల్లాది


● భరత్ కమ్మ ● స్వరూప్ ● రాజ్ ఆర్. ● కేవీఆర్ మహేంద్ర ● వెంకట్ రామ్‌జీ ● రవికిరణ్


● అల్లు అర్జున్

## టీజర్ రెడీ

టీజర్ రెడీ అయింది. టీజర్‌లో ఏముందో చిన్న శాంపిల్ కూడా చూపించేశారు. ఫుల్ టీజర్‌ను డిసెంబర్ 11న చూపిస్తాం అంటోంది 'అల వైకుంఠపురములో..' చిత్రబృందం. అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూడవ చిత్రం 'అల వైకుంఠపురములో'. గతంలో 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి' వంటి సినిమాలు ఈ కాంబినేషన్‌లో వచ్చాయి. ప్రస్తుతం చేస్తున్న 'అల వైకుంఠపురములో' సినిమాను గీతా ఆర్ట్స్, హారికా హాసినీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. పూజా హెగ్డే కథానాయిక. టబు, రాజేంద్రప్రసాద్, జయరామ్, నివేదా పేతురాజ్, సుశాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం టీజర్ ఈ నెల 11న రిలీజ్ కానుంది. టీజర్‌లో కార్పొరేట్ ఆఫీస్ బోర్డ్ మీటింగ్ జరుగుతున్న సమయంలో బల్ల ఎక్కి వాక్ చేస్తూ అల్లు అర్జున్ కనిపించే చిన్న బిట్‌ను రిలీజ్ చేసింది టీమ్. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ఈ చిత్రం రిలీజ్ కానుంది.


● మహేశ్‌బాబు

## సూర్యుడివో చంద్రుడివో...

మహేశ్‌బాబు అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలోని రెండో పాటని సోమవారం విడుదల చేశారు చిత్రబృందం. 'సూర్యుడివో చంద్రుడివో...' అనే పల్లవితో సాగే ఈ పాట ఫ్యామిలీ మెలోడీగా అలరిస్తోంది. మహేశ్‌బాబు, రష్మికా మందన్నా జంటగా విజయశాంతి ప్రత్యేక పాత్రలో నటించిన చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర, 'దిల్' రాజు, మహేశ్‌బాబు నిర్మించిన ఈ సినిమా జనవరి 11 విడుదలవుతోంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందించిన 'సూర్యుడివో చంద్రుడివో...' పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ పాటని ప్రముఖ పంజాబీ సింగర్, కంపోజర్ బి.ప్రాక్ పాడారు. నిర్మాతలు మాట్లాడుతూ– ''అవుట్ అండ్ అవుట్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సాంగ్‌కి అనూహ్యమైన స్పందన వచ్చింది. 'సూర్యుడివో...' పాట ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఆకట్టుకునేలా దేవిశ్రీ ప్రసాద్ కంపోజ్ చేశారు'' అన్నారు.

## తప్పులే ఎక్కువగా కనిపిస్తున్నాయి

– సురేశ్‌బాబు


● టీజీ విశ్వప్రసాద్, సురేశ్‌బాబు

''37 ఏళ్లుగా నిర్మాణంలో ఉన్నాను. మన పాత హిట్ సినిమాలతో పోలిస్తే ఇప్పుడు సినిమాలు సంతృప్తిగా అనిపించవు. హిట్ అవుతాయి. కానీ ఏదో వెలితిగా ఉంటుంది. సొంత యాక్టర్స్‌ని పెట్టి సరైన సినిమాలు తీయకపోతే ప్రేక్షకులు నవ్వుతారనే భయం ఉంటుంది. అందుకే కథలను సులువుగా అంగీకరించలేను'' అన్నారు సురేశ్ బాబు. వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా కేయస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో సురేశ్ బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం 'వెంకీ మామ'. వివేక్ కూచిభొట్ల సహనిర్మాత. ఈ శుక్రవారం చిత్రం రిలీజ్ సందర్భంగా సురేశ్‌బాబు, టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడారు.

**సురేశ్‌బాబు మాట్లాడుతూ** – ''వెంకీ మామ' కథను జనార్ధన మహర్షి రాశారు. ఐడియా బావుంది. కానీ ట్రీట్‌మెంట్‌లో చాలా మార్పులు చేయాల్సి ఉంది. ఈ ఐడియాను కోన వెంకట్‌కు చెప్పాను. వర్క్ చేయొచ్చు అన్నారు. బాబీ పేరుని కోన వెంకట్ సూచించారు. బాబీ తన టీమ్‌తో తన స్టయిల్లో వర్క్ చేసి నాకు చెప్పాడు. మామాఅల్లుడి బంధాన్ని చూపించే ఓ సన్నివేశాన్ని నాకు వివరించగానే నా కళ్లలో నీళ్లు ఆగకుండా వచ్చాయి. ఈ సినిమా చేస్తున్నాం అన్నాను.

- 'వెంకీ మామ' సినిమా సూపర్, బంపర్ అలాంటివి చెప్పలేను. పూర్తి స్థాయి తెలుగు సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుంది. వెంకటేశ్, నాగచైతన్య కెమిస్ట్రీ హైలైట్‌గా ఉంటుంది. వెంకీ, చైతన్య ఇద్దరి ఫ్యాన్స్ హ్యాపీగా ఫీల్ అయ్యే సినిమా.
- 'వెంకీ మామ'ను దసరాకు రిలీజ్ చేయాలనుకున్నాం. వెంకటేశ్ కాలికి గాయం కావడంతో ఆలస్యం అయింది. నవంబర్ అనుకున్నాం. ఆ తర్వాత డిసెంబర్ 13కి ఫిక్స్ చేశాం. రిలీజ్ డేట్ విషయంలో కన్‌ఫ్యూజ్ అయ్యాం. సంక్రాంతి పండక్కి రిలీజ్ చేయాలనే ఆలోచన మాత్రం ఎప్పుడూ లేదు.
- డిజిటల్ మాధ్యమాలు అమేజాన్, నెట్‌ఫ్లిక్స్ రావడంతో థియేటర్‌కి వెళ్లే ప్రేక్షకులు తగ్గుతున్నారు అంటున్నారు. వాళ్లను థియేటర్‌కి రప్పించే సినిమాలు చేయడం మీద దృష్టిపెట్టాలి. హీరోలందరూ ఏడాదికి రెండు సినిమాలు చేస్తే బావుంటుంది. సినిమా మేకింగ్‌లో చాలా శాతం అసమర్థత కనిపిస్తోంది. దాన్ని తొలగించే ప్రయత్నం చేయాలి.
- గతంలో దాసరి గురువు పాత్రను పోషించారు. ఇప్పుడు ఎవరూ ఆ బాధ్యతను తీసుకోవడంలేదనే ప్రశ్నకు స్పందిస్తూ – ''దాసరిగారిని గురువులా అందరూ అంగీకరించారు. ఆ స్థానంలో ఇప్పుడు ఎవర్నీ అంగీకరించలేకపోతున్నారు'' అని అన్నారు.
- ఇంతకుముందు కథ విన్న తర్వాత 'కానీ... ఏదో మిస్ అయింది' అనేవాణ్ణి. ఇప్పుడు ఏం మిస్ అయిందో చెప్పగలుగుతున్నాను. సినిమా గురించి ఎక్కువ తెలుసుకుంటున్న కొద్దీ అందులో తప్పులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కథ చెప్పే దశలోనే ఉన్న సందేహాలు ఎక్కువగా అడిగేస్తుంటాను. కథలు అంత సులువుగా ఓకే చేయనని కూడా అనుకోవచ్చు(నవ్వుతూ). ఇంతకుముందు షూటింగ్‌కి వెళ్లాక కూడా డౌట్స్ అడిగేవాణ్ణి. ఇప్పుడు వేలు పెట్టడం తగ్గించేశాను(నవ్వుతూ).
- గుణశేఖర్ దర్శకత్వంలో రానా చేసే 'హిరణ్య'కు రెండేళ్లుగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తున్నాం. ఫిల్మ్ మేకింగ్ ప్రాసెస్‌ను సక్రమంగా అనుసరించి ఆ సినిమాను తక్కువ టైమ్‌లో వరల్డ్ క్లాస్ మూవీగా రూపొందించనున్నాం. 'అసురన్' రీమేక్‌తో పాటు, తరుణ్ భాస్కర్‌తో, త్రినాథ రావు నక్కినలతో సినిమాలు చేస్తారు వెంకటేశ్.

**టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ** – ''సురేశ్ ప్రొడక్షన్స్‌తో కలిసి పని చేయడంతో నమ్మకం ఏర్పడింది. ఈ కథను మొదట వివేక్ కూచిభొట్ల విన్నారు. ఆ తర్వాత సురేశ్‌బాబుగారి దగ్గరకు తీసుకెళ్లాం. దేనికైనా ప్లానింగ్ ముఖ్యం. మా బేనర్‌లో 20 సినిమాల వరకూ సిద్ధం కాబోతున్నాయి'' అన్నారు.


● కీర్తీ సురేశ్

## మ్యాజికల్ మైల్‌స్టోన్

కెరీర్‌లో 'మైల్‌స్టోన్' అని చెప్పుకునే అవకాశాలు అప్పుడప్పుడూ వస్తుంటాయి. 'మహానటి' రూపంలో కీర్తి సురేష్ కెరీర్‌లో ఓ మంచి మైల్‌స్టోన్ వచ్చి చేరింది. నటిగా సినిమా సినిమాకీ ప్రూవ్ చేసుకుంటూ ముందుకెళుతోన్న కీర్తి ఇప్పుడు తన కెరీర్‌లో 'మ్యాజికల్ మైల్‌స్టోన్' చేరుకున్నానని అంటున్నారు. మరి.. సూపర్ స్టార్ రజనీకాంత్ సరసన అవకాశం అంటే.. ఏదో మ్యాజిక్ జరిగినట్లే కదా. రజనీ 168వ సినిమాలో కీర్తికి ఈ చాన్స్ దక్కింది. ఈ చిత్రాన్ని శివ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ నిర్మించనుంది. ''రజనీకాంత్ సార్ సరసన నటించడం అనేది నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే తీపి జ్ఞాపకంలాంటిది. నా సినిమా కెరీర్‌లో ఇదొక 'మ్యాజికల్ మైల్‌స్టోన్'' అన్నారు కీర్తి సురేష్.

## టైటిల్ నాకు బాగా నచ్చింది

– కొరటాల శివ


● ప్రసాద్, రసూల్, సుకుమార్, కొరటాల శివ, జోనాథన్

విజయ్‌రామ్, శివశక్తి సచ్‌దేవ్ జంటగా జోనాథన్ ఎడ్వర్డ్ దర్శకత్వంలో వీఈవీకేడీఎస్ ప్రసాద్ నిర్మించిన చిత్రం 'అమరం అఖిలం ప్రేమ'. 'ప్రేమించటం అంటే ప్రేమిస్తూనే ఉండటం' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రం టీజర్‌ను ప్రముఖ దర్శకులు సుకుమార్, కొరటాల శివ ఆవిష్కరించారు. ''అమరం అఖిలం ప్రేమ' టైటిల్ నాకు బాగా నచ్చింది. ప్రసాద్‌గారు నిర్మాతగా సక్సెస్ కావాలి'' అన్నారు కొరటాల శివ. ''ప్రసాద్, నేను లెక్చరర్స్‌గా కలిసి పనిచేశాం. ఆయన ఈ సినిమాతో నిర్మాతగా మారడం చాలా సంతోషంగా ఉంది. ఆర్టిస్టుగా బాగా పెర్ఫార్మ్ చేయగలిగితే, హీరోగా చేయడానికి అంత కన్నా పెద్ద లక్షణం అవసరం లేదు. అది విజయ్‌రామ్‌లో చూశాను. జోనాథన్ తీసిన ఓ షార్ట్ ఫిల్మ్ చూసి స్ఫూర్తి పొందాను. జోనాథన్ మంచి ప్రతిభ ఉన్న దర్శకుడు. ఈ సినిమాకు శ్రీకాంత్ మంచి డైలాగ్స్ రాశాడు. అల్లు అర్జున్‌తో నేను తెరకెక్కిస్తున్న సినిమాకు శ్రీకాంత్ మాటలు రాస్తున్నాడు'' అన్నారు. ''సుకుమార్‌గారు లేకుంటే ఈ సినిమా ప్రారంభం అయ్యేది కాదు. ప్రసాద్‌గారు సహనశీలి'' అన్నారు జోనాథన్. ''చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేదు. ఆడిన సినిమా పెద్ద సినిమా అవుతుంది. విజయ్‌రామ్ హీరోగా సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు నిర్మాత ప్రసాద్. కెమెరామెన్ రసూల్ ఎల్లోర్, సంగీత దర్శకుడు రధన్, దర్శకుడు హరి ప్రసాద్ జక్కా, మాటల రచయిత శ్రీకాంత్ విస్సా తదితరులు పాల్గొన్నారు.

## 5 భాషల్లో ఫైటర్


● పూరి జగన్నాథ్

కథలో సత్తా ఉంటే ఒక్క భాష అని హద్దులు పెట్టలేం. ఇప్పుడు కథలన్నీ హద్దులు దాటుతున్నాయి. దర్శకులందరూ ప్యాన్ ఇండియా సినిమాలపై దృష్టిపెడుతున్నారు. దర్శకుడు పూరి జగన్నాథ్ కూడా ఓ ప్యాన్ ఇండియా మూవీ ప్లాన్ చేశారు. విజయ్ దేవరకొండతో 'ఫైటర్' అనే సినిమాను తెరకెక్కించనున్నారు పూరి. చార్మితో కలసి ఈ సినిమాను నిర్మిస్తారాయన. ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. హిందీ వెర్షన్‌కు కరణ్ జోహార్ భాగస్వామిగా వ్యవహరించనున్నారట. త్వరలో అధికారిక ప్రకటన రానుంది. మార్షల్ ఆర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగనున్న ఈ కథలో విజయ్ కొత్త లుక్‌లో కనిపిస్తారట. దీనికి సంబంధించిన శిక్షణ కూడా మొదలుపెట్టారు. జనవరిలో చిత్రీకరణ ప్రారంభం కానుంది.

## సరికొత్త డీటీయస్


● ఆశిష్ గాంధి, పూజా జవేరి

'నాటకం' మూవీ ఫేమ్ ఆశిష్ గాంధీ హీరోగా రూపొందుతున్న చిత్రం 'డీటీయస్'. పూజా జవేరి కథానాయిక. అభిరామ్ పిల్లాను దర్శకునిగా పరిచయం చేస్తూ గంగారెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆశిష్ గాంధీ మాట్లాడుతూ– ''నాటకం' తర్వాత కొత్త కథల కోసం ఎదురు చూస్తున్న సమయంలో అభిరామ్ చెప్పిన కథ నచ్చింది. గంగారెడ్డిగారికి కాన్సెప్ట్ నచ్చడంతో సినిమా ప్రారంభించారు'' అన్నారు. ''ఇప్పటి వరకూ తెలుగు తెరమీద చూడని సరికొత్త కథతో ఈ సినిమా ఉంటుంది. ఈ నెల చివరి వారంలో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది'' అన్నారు. ''యంగ్ టీమ్ చేస్తోన్న చిత్రమిది. ఇలాంటి కథకు సంగీతం అందించడం సంతోషంగా ఉంది'' అన్నారు సాయి కార్తీక్.

## సేఫ్‌గా సినిమాలు తీస్తున్నాడు

– సి. కల్యాణ్


● రామసత్యనారాయణ, ఐషా, సి.కల్యాణ్, శైలేష్ సాగర్, డీఎస్ రావు

''చిన్న సినిమాలు మాత్రమే తీస్తాను అని ఒట్టు పెట్టుకుని బడ్జెట్ దాటకుండా చిత్రాలు తీస్తున్నాడు రామ సత్యనారాయణ. ఒక ఫ్లాప్ తీస్తే ఆ నిర్మాత మళ్లీ సినిమా తీయలేని పరిస్థితులున్న ఈ రోజుల్లో హిట్, ఫ్లాప్‌కి అతీతంగా సేఫ్‌గా సినిమాలు తీస్తున్నాడు. ఈ 'శివ 143' సినిమా విజయం సాధించాలి'' అన్నారు నిర్మాత సి.కళ్యాణ్. శైలేష్ సాగర్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'శివ 143'. తుమ్మలపల్లి రామ సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. రామసత్యనారాయణ మాట్లాడుతూ– ''నేను హైదరాబాద్ వచ్చినప్పుడు ఓనమాలు దిద్దించారు కళ్యాణ్‌గారు. నేను ఇన్ని సినిమాలు తీశానంటే అది ఆయన నేర్పిన విద్యే'' అన్నారు. ''భీమవరం టాకీస్ బ్యానర్‌లో నేను చేస్తున్న రెండో సినిమా ఇది'' అన్నారు శైలేష్ సాగర్. ఈ చిత్రానికి కెమెరా: సుధాకర్, సంగీతం: మనోజ్.

## కొత్త కాన్సెప్ట్


● రుద్రాక్ష, ధన్య

రుద్రాక్ష, ధన్య బాలకృష్ణ జంటగా శ్రీపతి కర్రి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హల్ చల్'. గణేష్ కొల్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను 'అర్జున్ రెడ్డి' దర్శకుడు సందీప్ రెడ్డి విడుదల చేసి, మాట్లాడుతూ– ''ట్రైలర్ బాగుంది. కాన్సెప్ట్ కొత్తగా ఉందనిపిస్తోంది. ట్రైలర్ చూసిన వారు తప్పకుండా సినిమా చూస్తారు'' అన్నారు. ''మూడు సంవత్సరాలు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి నిర్మించిన ఈ చిత్రాన్ని ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం. ఎమ్‌ఎస్‌కె డిజిటల్ ద్వారా మల్కాపురం శివకుమార్‌గారు మా సినిమాను రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు గణేష్ కొల్లూరి. ''మంచి కథతో కూడిన ఇలాంటి సినిమాతో హీరోగా పరిచయం కావడం నా అదృష్టం'' అన్నారు రుద్రాక్ష్. ''సరికొత్త కథతో రూపొందిన చిత్రమిది. గణేష్‌గారు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కించాను'' అన్నారు శ్రీపతి కర్రి.

సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 10-12-2019

ప్రాణం ఉన్న తెలివైన 'జీవి' మట్టి. వేటిని కుళ్లబెట్టాలి, వేటిని మొలకెత్తించాలి అనే విచక్షణ మట్టికి ఉంది!
– సుల్తాన్ ఇస్మాయిల్, ప్రసిద్ధ శాస్త్రవేత్త



జ్యేష్ఠ కార్తె : డిసెంబర్ 15 వరకు

● వరి పొలం





● పత్తి+జొన్న చేనులో కృష్ణ, బాపిరాజు సోదరులు

- ఏడేళ్లుగా సోదరుడితో కలసి 135 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం
- ఎకరానికి 40 బస్తాల వరకు వరి ధాన్యం దిగుబడి
- పత్తిలో అంతరపంటగా జొన్న సాగుతో అధిక దిగుబడి
- 14 ఎకరాల్లో సిరిధాన్యాల సాగు
- ప్రదర్శన క్షేత్రంగా, రైతు శిక్షణా కేంద్రంగా మారిన కృష్ణ, బాపిరాజుల పొలం

# అన్నదమ్ముల అపూర్వ సేద్యం

ఆరిమిల్లి కృష్ణ, బాపిరాజు సోదరులు 135 ఎకరాల సొంత భూమిలో ఉమ్మడి వ్యవసాయం చేస్తున్న పెద్దరైతులు. కర్నూలు జిల్లా కోసిగి మండలం కోల్‌మాన్‌పేట వారి స్వగ్రామం. పశ్చిమగోదావరి జిల్లా నుంచి 1960లో వీరి తండ్రి వలస వచ్చి కోల్‌మాన్‌పేటలో స్థిరనివాసం ఏర్పరచుకొని పాడి పశువుల పోషణతోపాటు పంటలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కృష్ణ బీటెక్ చదువుకున్నప్పటికీ తండ్రి చూపిన బాటలో వ్యవసాయాన్నే వృత్తిగా ఎంపిక చేసుకున్నారు. అంతేకాదు, ఎన్నో ఏళ్లుగా చేస్తున్న రసాయనిక వ్యవసాయం అనేక విధాలుగా ఎలా నష్టదాయకమో గ్రహించి కుటుంబంలో అందర్నీ ఒప్పించి ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడం విశేషం. 40 దేశవాళీ ఆవులను పోషిస్తూ.. వాటి పేడ, మూత్రంతో జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకొని భూములను సజీవవంతంగా మార్చుకుంటూ ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని పండిస్తున్నారు.

రసాయనిక వ్యవసాయంలో ఎరువులు, పురుగుమందుల ఖర్చులు పెరిగిపోయి క్రమంగా నికరాదాయం తగ్గిపోతూ వస్తున్న తరుణంలో 2012 ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ శిక్షణా శిబిరంలో కృష్ణ పాల్గొన్నారు.

రసాయనిక వ్యవసాయంతో ప్రజారోగ్యానికి, భూమికి, పర్యావరణానికి, ఆరోగ్యానికి జరుగుతున్న నష్టాన్ని అర్థం చేసుకున్న కృష్ణ.. పాలేకర్ చెప్పిన విధంగా 2012 ఖరీఫ్ పంట కాలం నుంచే ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. ఏకంగా 90 ఎకరాల్లో వరి సేద్యాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలోకి మార్చేశారు. అయితే, కొత్త కావడం, సందేహాలను నివృత్తి చేసే వారు అందుబాటులో లేకపోవడంతో వరి ధాన్యం దిగుబడి తొలి ఏడాది ఎకరానికి 18 బస్తాలకు పడిపోయింది. మొదటి ఏడాది రూ. లక్షల ఆదాయం తగ్గిపోయింది. అయినా, మొక్కవోని దీక్షతో ప్రకృతి వ్యవసాయంలో మెలకువలను నేర్చుకుంటూ వ్యవసాయాన్ని కొనసాగించారు. అంతేకాదు, అప్పటివరకు నిర్వహిస్తున్న రసాయనిక ఎరువులు, పురుగుమందుల దుకాణం (ఏటా రూ. 30 లక్షలకు పైగా టర్నోవర్) కూడా అదే సంవత్సరం మూసివేసి మరీ ప్రకృతి వ్యవసాయానికి కట్టుబడిన ప్రకృతి వ్యవసాయ కుటుంబం వారిది.

## ప్రకృతి వ్యవసాయమే నా సర్వస్వం



ప్రకృతి వ్యవసాయమే నా సర్వస్వం. గతంలో రసాయన ఎరువులతో వ్యవసాయం చేసి నష్టాలను మూట కట్టుకున్నాను. సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో 2012 నుంచి తమ్ముడు బాపిరాజుతో కలసి 135 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అనేక మంది రైతులకు శిక్షణ కూడా ఇస్తున్నాం. మా గ్రామంలో దాదాపు 150 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. 40 దేశవాళీ ఆవులను పోషిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం వల్ల నాణ్యమైన ఆహారాన్ని పండిస్తున్నాం. భూమి ఆరోగ్యం అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వం కూడా ఈ పద్ధతిని ప్రోత్సహిస్తుండటం శుభపరిణామం. మా ఊళ్లో రైతులందరినీ ప్రకృతి వ్యవసాయదారులుగా మార్చాలని ప్రయత్నిస్తున్నాను.

– ఆరిమిల్లి కృష్ణ (95533 42667),
బీటెక్, ప్రకృతి వ్యవసాయదారుడు, కోల్‌మాన్ పేట, కొసిగి మం, కర్నూలు జిల్లా

### దిగుబడి 18 నుంచి 52 బస్తాల వరకు..

ప్రకృతి వ్యవసాయంలో పట్టు సాధిస్తున్న కొద్దీ ఏటేటా దిగుబడులు పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం తమ ప్రాంతంలో రసాయనిక వ్యవసాయదారుల కన్నా ఎక్కువగానే ప్రకృతి వ్యవసాయంలో తాము వరి ధాన్యం దిగుబడి తీయగలుగుతున్నామని గర్వంగా చెప్పుకునే స్థితికి కృష్ణ ఎదిగారు. మొదటి ఏడాదే 90 ఎకరాల్లో వరిసాగును ప్రకృతి వ్యవసాయంలో చేపట్టినప్పుడు కొన్ని పొరపాట్ల వల్ల ఎకరానికి 18 బస్తాల వరి ధాన్యం దిగుబడి వచ్చింది. ప్రస్తుతం ఎకరానికి 35 నుంచి 40 బస్తాల (బస్తా 72 కిలోలు) దిగుబడి సాధిస్తున్నారు. రెండేళ్ల క్రితం చీడపీడల బెడద ఎక్కువగా ఉండటంతో రసాయనిక వ్యవసాయం చేసిన రైతులకు ధాన్యం దిగుబడి బాగా తగ్గిపోయినా తమ పొలంలో చీడపీడలూ లేవు, దిగుబడీ తగ్గలేదని కృష్ణ తెలిపారు.

రెండు ఎకరాల్లో ప్రయోగాత్మకంగా పచ్చి పేడ స్లర్రీని బకెట్లతో పొలంలో కూలీలతో తరచూ పోయిస్తూ వచ్చానని, దిగుబడి ఎకరానికి 52 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చిందని కృష్ణ తెలిపారు. అయితే, పేడ స్లర్రీని బక్కెట్లతో పోయించడం శ్రమతోటి, ఖర్చుతోటి కూడిన పని కాబట్టి కొనసాగించడం లేదన్నారు.

### పత్తిలో అంతర పంటగా తెల్ల జొన్న

కృష్ణ సోదరులకు 12 ఎకరాల్లో మామిడి తోట ఉంది. ఈ ఏడాది 56 ఎకరాల్లో వరి (బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048, ఎన్‌డిఎల్‌ఆర్–7 రకాలు) సాగు చేశారు. ఆర్‌ఎన్‌ఆర్ ఎకరానికి 38 బస్తాల దిగుబడి వచ్చింది. ఆముదం 20 ఎకరాల్లో, 4 ఎకరాల్లో కంది సాగు చేస్తున్నారు. 14 ఎకరాల్లో అండు కొర్రలు, కొర్రలు, ఊదలు, సామలు, వరిగలు సాగు చేశారు. 6 ఎకరాల్లో బీటీ పత్తి వేసి, జొన్నను అంతరపంటగా సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి 6 క్వింటాళ్ల పత్తి తీశారు. మరో 6 క్వింటాళ్లు రావచ్చు. పత్తి సాళ్ల మధ్య 48 అంగుళాల దూరం పెట్టారు. పత్తి సాళ్ల మధ్య రెండు వరుసలుగా తెల్ల జొన్నను విత్తారు. ఎకరానికి పది క్వింటాళ్ల జొన్న దిగుబడి వస్తుందని కృష్ణ ఆశిస్తున్నారు.

### షాంపూ, వేప చెక్క+గోమూత్ర కషాయం

సోప్ షాంపూ, వేప చెక్క+గోమూత్రంతో చేసిన కషాయం పిచికారీ చేశాక కత్తెర పురుగు ఉధృతి రసాయనిక వ్యవసాయ పొలాల్లో కన్నా తమ పొలంలో తక్కువగా ఉందని కృష్ణ తెలిపారు. సోప్ షాంపూని రెండు సార్లు పిచికారీ చేశారు. వేప చక్క 3 కిలోలు, 12 లీటర్ల గోమూత్రం కలిపి 3 పొంగులు పొంగిస్తే 8–9 లీటర్ల కషాయం వస్తుంది. కాచిన తెల్లారి 20 లీటర్ల పంపునకు ఒక లీటరు కషాయాన్ని, 1 లీటరు గోమూత్రం, 18 లీటర్ల నీటిని కలిపి పత్తిపై పిచికారీ చేస్తున్నారు. ఈ రబీలో మినుము, పెసర, గోధుమను సాగు చేయనున్నామన్నారు.

### మిర్చిలో అంతరపంటలుగా జొన్న, సజ్జ

గత ఏడాది ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన ఎల్‌సిఏ 625 నాటు రకం మిర్చి (వరుసల మధ్య 36 అంగుళాలు, మొక్కల మధ్య 1.5 అంగుళాల దూరం)లో జొన్న, సజ్జ (3–4 మిరప మొక్కలకు ఒక జొన్న, సజ్జ మొక్కలు నాటారు) అంతర పంటలుగా వేసి మిర్చిలో 12 క్వింటాళ్ల దిగుబడులు సాధించానని కృష్ణ తెలిపారు. జొన్న, సజ్జ అంతరపంటగా వేయడం వల్ల ఫిబ్రవరి తర్వాత ఎండ తీవ్రత నుంచి మిర్చి పంటకు నీడ దొరకడంతో ఒక కాపు ఎక్కువగా వచ్చిందన్నారు. ఈ రకం మిరప విత్తనాన్ని తిరిగి వాడుకోవచ్చని, అయితే వేరే పొలంలో పండిన లేదా లాం ఫాం నుంచి విత్తనాలు తెచ్చి వేసుకుంటే మంచిదన్నారు. వేప చెక్క+గోమూత్ర కషాయాన్ని అమావాస్యకు ముందు ఒకసారి, తర్వాత మరోసారి ఈ కషాయాన్ని పిచికారీ చేసి మంచి ఫలితాలు సాధించామని కృష్ణ తెలిపారు.

### ప్రదర్శనా క్షేత్రం.. శిక్షణా కేంద్రం..

కృష్ణ, బాపిరాజు సోదరులు మక్కువతో ప్రకృతి వ్యవసాయం చేస్తూ వరి, పత్తి, మిర్చి నుంచి చిరుధాన్యాలు, మామిడి తోటల వరకు బహుళ పంటలు సాగు చేస్తూ భళా అనిపించుకుంటుండటంతో వారి వ్యవసాయ క్షేత్రం వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాలతో పాటు కర్ణాటకలోని బళ్లారి ప్రాంత రైతులకు సైతం ప్రదర్శన క్షేత్రంగా, రైతు శిక్షణా కేంద్రంగా రూపుదాల్చింది. సీజన్‌లో కనీసం రెండు సార్లు రైతులకు శిక్షణ ఇస్తున్నామని, నిరంతరం రైతులు, అధికారులు, శాస్త్రవేత్తలు ఫీల్డ్ విజిట్‌కు వస్తూ వుంటారని కృష్ణ గర్వంగా చెప్పారు.

గ్రామంలో పెద్ద రైతు రసాయనిక వ్యవసాయానికి స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయం చేపట్టి, మిగతా రైతులకు తోడ్పాటునందిస్తూ ఉంటే ఆ గ్రామంలో చిన్న రైతులు అనుసరించడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. కోల్‌మాన్‌పేటలో కూడా అదే జరుగుతోంది. ఇప్పటికి 150 మంది రైతులు ప్రకృతి వ్యవసాయ బాట పట్టారని కృష్ణ తెలిపారు. తాము జీవామృతం, ఘనజీవామృతం, తదితర కషాయాలను రైతులకు నామమాత్రపు ధరలకు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటుతో గ్రామంలో మిగతా రైతులను కూడా ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాని కృష్ణ ఆనందంగా చెప్పారు. స్ఫూర్తిదాయకమైన కృషి చేస్తున్న కృష్ణ సోదరులకు 'సాగుబడి' జేజేలు!

– గవిని శ్రీనివాసులు,
సాక్షి, కర్నూలు (అగ్రికల్చర్)

## వెయ్యి లీటర్ల బ్యారెల్స్‌లో జీవామృతం సరఫరా



● జీవామృతాన్ని పొలానికి తరలించడానికి వాడుతున్న భారీ ట్యాంకులు

అలవాటైపోయిన రసాయనిక వ్యవసాయం వదిలేసి ప్రకృతి వ్యవసాయం చేపట్టే రైతుల్లో వారి ఆర్థిక స్తోమతను బట్టి ఎవరి బాధలు వాళ్లకుంటాయి. చిన్న రైతులకు ఉండే సమస్యలు ఒక రకమైతే, పెద్ద రైతులకు ఉండే సమస్యలు ఇంకో రకం.

పాలేకర్ శిక్షణా తరగతుల్లో 200 లీటర్ల నీటిలో ఆవు పేడ, మూత్రం, బెల్లం, పప్పుల పిండి కలిపి ఎకరానికి సరిపడా జీవామృతం ఎలా తయారు చేసుకోవాలో చెబుతుంటారు. అయితే, ప్రకృతి వ్యవసాయం ప్రారంభించిన తొలినాళ్లలో ఈ సూచనలను కృష్ణ అలాగే పాటించారు. పొలం విస్తీర్ణం ఎక్కువ కావడంతో కొద్ది పరిమాణాల్లో చిన్న డ్రమ్ముల్లో చేసిన జీవామృతం సరిపోక పంట అనుకున్నంత దిగుబడినివ్వలేదు. దీంతో, ఇలా కాదని తమ పెద్ద వ్యవసాయ క్షేత్రానికి అనుగుణంగా జీవామృతం తయారీ పద్ధతిని కృష్ణ నేర్పుగా మార్చుకున్నారు. వెయ్యి లీటర్ల ఫైబర్ బ్యారెల్స్ తెప్పించి వాటిలో జీవామృతం తయారు చేసి భూములకు అందించడం ప్రారంభించిన తర్వాత సమస్య తీరింది. పంటల దిగుబడీ పెరిగింది. జీవామృతంతో కూడిన వెయ్యిలీటర్ల బ్యారెల్స్ మూడింటిని ఒక ట్రాలీలో తరలించి ఒక విడతకు 10–15 ఎకరాలకు అందిస్తుండడంతో ఇప్పుడు పుష్కలంగా జీవామృతం పంటలకు అందుతోంది. దీంతోపాటు పల్వరైజింగ్ మిషన్‌ను తెచ్చిన తర్వాత.. 135 ఎకరాలకు సరిపడా వివిధ రకాల కషాయాల తయారీ ప్రక్రియ కూడా సులభంగా మారిందని కృష్ణ సంతృప్తిగా చెప్పారు.

## 22న కాకినాడలో ప్రకృతి వ్యవసాయ శిక్షణ

ప్రకృతి వ్యవసాయంపై లోతైన అవగాహన కలిగించే లక్ష్యంతో సొసైటీ ఫర్ అవేర్‌నెస్ అండ్ విజన్ ఆన్ ఎన్విరాన్‌మెంట్(సేవ్) స్వచ్ఛంద సంస్థ ఈ నెల 22 (ఆదివారం)న కాకినాడలో రైతులకు శిక్షణ ఇవ్వనుంది. ప్రకృతి వ్యవసాయం అంటే ఏమిటి? పెట్టుబడి, ఖర్చులు తగ్గించుకునే మార్గాలు, రైతులు పంట దిగుబడులను మొత్తం నేరుగా అమ్ముకోకుండా కొంత మొత్తాన్ని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అమ్ముకోవడం, అధికాదాయం కోసం ప్రయత్నాలు, దేశీ విత్తనాల ఆవశ్యకత, దేశీ ఆవు విశిష్టత తదితర అంశాలపై సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరామ్ శిక్షణ ఇస్తారు. ఆసక్తి గల రైతులు ముందుగా తమ పేర్లను ఫోన్ చేసి నమోదు చేసుకోవాలి. 86889 98047 94495 96039.
**వేదిక:** చల్లా ఫంక్షన్ హాల్, వినాయకుని గుడి ఎదుట, విద్యుత్ నగర్, కాకినాడ.

## వ్యవసాయం-ప్రపంచీకరణపై 14న సదస్సు

వ్యవసాయ రంగ సమస్యలు– ప్రపంచీకరణపై పునరాలోచన అనే అంశంపై ఈ నెల 14 (శనివారం) ఉ. 9 గంటల నుంచి సికింద్రాబాద్ తార్నాకలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌లో సదస్సు అవేర్‌నెస్ ఇన్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో జరగనుంది. వ్యవసాయ వాణిజ్యంలో ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల ప్రభావం, సుంకాలు, ఆహార సబ్సిడీలు తదితర అంశాలపై చర్చ జరుగుతుంది. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు.. 72859 18294

● డెయిరీ డైరీ-19

## పశువుల్లో బాక్టీరియా వ్యాధులు



శీతాకాలంలో పశువులను వ్యాధుల బారి నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

గొంతువాపు: పాస్టురెల్లా మల్టోసైడా అనే బ్యాక్టీరియా వల్ల గొంతువాపు వస్తుంది. ఒక్కసారిగా జ్వరం రావడం, నోటి చొంగ, ఊపిరి కష్టంగా ఉండటం లాంటివి చూపిస్తుంది. 24 గంటల్లో పశువు చనిపోతుంది. చలికాలంలో పశువులు దగ్గర దగ్గరగా ఉంటుంటాయి. అందువల్ల చొంగ ద్వారా ఈ వ్యాధి త్వరగా వ్యాపించవచ్చు. ఇంతకుముందే టీకాలు వేయించుకొని ఉంటే గొంతువ్యాపు రాదు. ఇప్పుడు కూడా టీకా వేయించుకోవచ్చు. వైద్యము ఖరీదు కాబట్టి నివారణ మేలు.

**పింక్ ఐ:** ఇన్‌ఫెచ్యువస్ బొవైన్ కెరెటో కంజెక్టువైటిస్ అనే వ్యాధికి పింక్ ఐ అని కూడా పేరు. దీని తీవ్రత వర్షాకాలంలో ఎక్కువైనప్పటికీ శీతాకాలంలోనూ వ్యాపిస్తుంది. మోరాక్సెల్లా బోవిస్ అనే బ్యాక్టీరియా వల్ల పింక్ ఐ సోకుతుంది. వ్యాధి బారిన పడి తేరుకున్న పశువుల ముక్కు రంధ్రాల ద్వారా ఈ బాక్టీరియా బయటకు వ్యాప్తి చెందుతుంది. త్వరగా వైద్యం మొదలు పెట్టడం, పశువైద్యుని సలహా మేరకు టెట్రాసైక్లిన్స్ గల ఆంటీబయోటిక్స్‌ని వాడాలి.

**ఫుట్ రాట్:** దీనినే గొర్రెల్లో వాడుక భాషలో కుంట్లు అంటారు. గిట్టల మధ్య వాచి, నొప్పిగా ఉండి, పశువులు కుంటుతూ ఉంటాయి. ఫ్యూసోబ్యాక్టీరియమ్ నెక్రోఫోగమ్ అనే బ్యాక్టీరియా వలన కలుగుతుంది. చిత్తడి నేలల్లో పశువులను ఉంచినట్లయితే ఈ పరిస్థితి వస్తుంది. కాళ్ల మీద బరువు మోపలేకపోవడం, నొప్పి కనబరచడం, వాసన కలిగి ఉండడం, మేత మేయలేకపోవడం లాంటి లక్షణాలను పశువు చూపిస్తుంది. పశువులను పొడి నేలల్లో ఉండడం, పెన్సిలిన్, సెప్టియోఫర్, టెట్రాసైక్లిన్ లాంటి యాంటీ బయోటిక్స్‌ను వాడాలి.

**కాఫ్ డిప్తీరియా/లారిన్‌జైటిస్:** ఇది కూడా ఫూసోబ్యాక్టీరియమ్ నెక్రోఫోరమ్ వల్లనే కలుగుతుంది. 3 నుంచి 18 నెలల వయసున్న దూడల్లో ఎక్కువగా కనబడుతుంది. జ్వరం, దగ్గు, రొప్పడం వంటి లక్షణాలు కనబడతాయి. పక్కపక్కనే ఉన్న పశువులకు సోకుతుంది. పశువైద్యుని సలహా మేరకు యాంటిబయోటిక్స్‌ను వాడాలి.

**కంటేజియస్ బొవైన్ ప్లూరో నిమోనియా:** చలికాలంలో పశువుల ఊపిరితిత్తులు వాచి, 107 డిగ్రీల ఫారన్‌హీట్ వరకు జ్వరం రావడం, కళ్ల వెంబడి పుసులు రావడం, పశువు బాగా చిక్కిపోవడం, కష్టసాధ్యమైన ఊపిరి.. ఇవీ లక్షణాలు. పశువు 1–3 వారాల్లో చనిపోయే ప్రమాదం ఉంది. ఖచ్చితమైన పరిశుభ్రత పాటించాలి. టైలోసిస్ లాంటి యాంటిబయోటిక్స్ కొంత ఉపయోగకరం.

– డా. ఎం.వి.ఎ.యన్. సూర్యనారాయణ (99485 90506), ప్రొఫెసర్ – అధిపతి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఫామ్ కాంప్లెక్స్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, తిరుపతి

## ఆశావహ సేద్యం!



● హర్యానాలోని తన పండ్ల తోటలో మహిళా రైతు ఆశా

రసాయనిక వ్యవసాయానికి పెట్టింది పేరైన హర్యానా రాష్ట్రంలో ఆశా వంటి ప్రకృతి వ్యవసాయదారులు అరుదుగా కనిపిస్తారు. ఆశ తన కుటుంబ సభ్యులు, కూలీల సహకారంతో గత పదేళ్లగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా పండ్ల తోటలు, పంటలు సాగు చేస్తానంటే వాళ్ల ఇంట్లో వాళ్లే ఎగతాళి చేశారు. అయినా, ఆశా వెనకంజ వెయ్యలేదు.

జిల్లా కేంద్రం చర్కి–దద్రి జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో పిచొంప కలన్ గ్రామం ఆమెది. 3,200 గడప ఉంటుంది. ఆశా, ఆమె కోడలు జ్యోతితోపాటు ఆ ఊళ్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు చాలా కొద్దిమంది మాత్రమే. వాళ్లకు మూడెకరాల భూమి ఉంది. అందులో నారింజ, నిమ్మ, బత్తాయి చెట్లతో కూడిన పండ్ల తోటను సాగు చేస్తున్నారు. పరస్పరం పోటీ పడని సీజనల్ పంటలను అంతర పంటలుగా సాగు చేయడం ప్రకృతి వ్యవసాయంలో ఓ ముఖ్య సూత్రం. ఆశా ఆ సూత్రాన్ని పాటిస్తున్నారు. పాలకూర, మెంతికూర, శనగలు, సజ్జలు, గోధుమలను కూడా అంతరపంటలుగా సాగు చేస్తూ ఉత్తమ రైతుగా ఆశా పేరు గడించారు. అదే తోటలో సీతాఫలం మొక్కలను కూడా నాటాలని ఆమె అనుకుంటున్నారు. తొలుత రెండేళ్ల పాటు సాధారణ దిగుబడితో పోల్చితే 40 శాతం మేరకే దిగుబడి వచ్చిందని, అయినా మక్కువతో ప్రారంభించిన ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగించి, ఇప్పుడు మంచి దిగుబడులు పొందుతున్నానని ఆశా తెలిపారు.

ఏ రోజైనా ఇంటిపనులు చేసుకున్న తర్వాత ఉదయం, సాయంత్రం తోటలోకి వెళ్లి పనులు స్వయంగా చేసుకోవడం ఆశాకు, ఆమె కోడలికి అలవాటు. ప్రతిరోజూ శ్రద్ధగా తోటను గమనించుకుంటూ.. ఎక్కడైనా చీడపీడల జాడ కనిపిస్తే వెంటనే కషాయాలు, ద్రావణాలు పిచికారీ చేసి అదుపు చేయడం ముఖ్యమైన సంగతి అని ఆశ అంటున్నారు. గొయ్యిలో పాతిపెట్టిన మట్టి పాత్రలో పుల్లమజ్జిగ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. చీడపీడలకు దాన్ని నీటిలో కలిపి పిచికారీ చేస్తారు. ఔషధ చెట్ల నుంచి సేకరించిన జిగురుకు నిప్పు అంటించి తోటలో పొగబెట్టడం ద్వారా చీడపీడలను సంప్రదాయ పద్ధతిలో ఆశా పారదోలుతున్నారు. 'పంటలు పూత దశలో మా బామ్మ ఇలాగే చేసేది' అంటున్నారామె.

ప్రతి రెండు నెలలకోసారి ద్రవ జీవామృతాన్ని తోటకు అందిస్తూ భూసారాన్ని పెంపొందిస్తున్నారు. వర్మీకంపోస్టును సైతం తయారు చేసి పంటలకు వాడుతున్నారు. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకొని ఎరువులు, పురుగు మందులను తయారు చేసుకుంటున్నారు. బయట ఏవీ కొనడం లేదు. బోరు నీటిని స్ప్రింక్లర్లు, డ్రిప్ ద్వారా పంటలకు అందిస్తున్నారు. 'ఈ తరహా ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి చాలా తక్కువే. అయితే, కష్టపడి పనిచేయాల్సి ఉంటుంది' అంటున్నారు ఆశా కోడలు జ్యోతి.

సతత్ సంపద అనే స్వచ్ఛందసంస్థ హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులను పరిచయం చేస్తూ ఉంటుంది. ఆశకు ఈ సంస్థ తోడ్పాటునందించింది. సతత్ సంపద డైరెక్టర్ జ్యోతి అవస్థి ఇలా అంటున్నారు.. 'భూమిలో డీఏపీ, యూరియా వెయ్యకుండా పంటలు ఎలా పండుతాయి? అని రైతులు మమ్మల్ని ప్రశ్నిస్తూ ఉంటారు. భూమిలో సారం పెరగడానికి రెండేళ్లు పడుతుంది. అందుకే ప్రకృతి వ్యవసాయం మొదలు పెట్టిన తొలి రెండేళ్లలో దిగుబడి తక్కువగా ఉంటుంది. ఎంతో మక్కువతో ప్రారంభించిన ఆశ వంటి రైతులు తట్టుకొని నిలబడగలరు. కానీ, మరీ చిన్న రైతులు దీనికి తట్టుకోలేరు. అందుకే మేం ఈ రైతులతో పనిచేస్తున్నాం. మార్పు నెమ్మదిగా వస్తుంది..'.

ఇంటి పంట



● లత కృష్ణమూర్తి మిద్దెతోటలో ఆకుకూరలు



● కాకర కాయను చూపుతున్న లత కృష్ణమూర్తి

## ఇంటిపంటలే ఆరోగ్యదాయకం

హైదరాబాద్ కుషాయిగూడలో లత, కృష్ణమూర్తి వృద్ధ దంపతులు రెండేళ్ల నుంచి తాము నివాసం ఉంటున్న బంధువుల ఇంటిపైన సేంద్రియ ఇంటిపంటలు పండించుకొని తింటూ ఆరోగ్యంగా, సంతోషంగా గడుపుతున్నారు. కృష్ణమూర్తి ప్రభుత్వ రంగ సంస్థలో డిప్యూటీ మేనేజర్‌గా రిటైరైన తర్వాత కుషాయిగూడలోని బావ గారి ఇంటి మొదటి అంతస్థులో నివాసం ఉంటున్నారు. ఆకుకూరలు, కూరగాయలను కలుషిత జలాలతో పండిస్తున్నారన్న వార్తలు చదివిన తర్వాత తమ ఆరోగ్యం కోసం మిద్దె తోటలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించుకోవాలని నిర్ణయించుకున్నామని లత కృష్ణమూర్తి తెలిపారు.

బరువు తక్కువగా ఉంటుందని గ్రోబాగ్స్‌లోనే ఎక్కువ భాగం ఇంటిపంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వారి మిద్దెపై 300–400 గ్రోబాగ్స్‌లో పచ్చని పంటలు పండుతున్నాయి. ఆకుకూరలు, కూరగాయలతోపాటు పండ్ల మొక్కలు కూడా ఇందులో ఉన్నాయి. బోరు లేదు. నీటి అవసరాలకు కుళాయి నీరే ఆధారం కాబట్టి డ్రిప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గ్రోబాగ్స్‌లో కొయ్య తోటకూర, మెంతికూర, చుక్క కూరలతో ఇంటిపంటల సాగుకు శ్రీకారం చుట్టానని లత తెలిపారు. మొదట్లో చాలా సమస్యలు వచ్చినా అనుభవం నుంచి నేర్చుకున్నారు.

### చౌహాన్ క్యు, పాలేకర్ బాటలో...

ఎర్రమట్టి 20 శాతం, కొబ్బరిపొట్టు 25 శాతం, 55 శాతం పశువుల ఎరువు+వర్మీకంపోస్టుతోపాటు గుప్పెడు వేపపిండి కలిపి మట్టి మిశ్రమాన్ని తయారు చేసుకొని గ్రోబాగ్స్‌లో నింపి ఇంటిపంటలను దిగ్విజయంగా సాగు చేస్తున్నారు లత కృష్ణమూర్తి. సౌత్ కొరియా ప్రకృతి వ్యవసాయ నిపుణుడు చౌహాన్‌క్యు చూపిన బాటలో ఇంటిలో లభించే ముడి సరుకులతోనే పోషకద్రావణాలను తయారు చేసుకొని పంటలకు ప్రతి వారం, పది రోజులకోసారి పిచికారీ చేయడం, మొక్కల మొదళ్లలో పోయడం ద్వారా మంచి దిగుబడులు సాధిస్తున్నారామె. జీవామృతం స్వయంగా తయారు చేసుకొని ప్రతి 15 రోజులకోసారి పంటలకు అందిస్తున్నారు.

మునగాకు లేదా వేపాకు బరువుతో సమానంగా బెల్లం కలిపి 20 రోజుల తర్వాత లీటరుకు 1–2 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయడం, మట్టిలో పోయడం ద్వారా అధిక దిగుబడి పొందుతున్నామని, చీడపీడల బెడద లేకుండా చక్కని ఆరోగ్యదాయకమైన కూరగాయలు పండుతున్నాయని లత సంతృప్తిగా చెప్పారు. ఈ ఏడాది జూలై నుంచి గత వారం వరకు అసలు కూరగాయలు కొనాల్సిన అవసరం లేకుండా పూర్తిగా తమకు ఇంటిపంటలే సరిపోయాయని ఆమె తెలిపారు.



● లత కృష్ణమూర్తి మిద్దెతోటలో పండిన కూరగాయలు

## అందరూ ఇంటిపంటలు పండించాలి



కలుషిత నీరు, విషరసాయనాలతో పండించే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లకు బదులు నగరవాసులు అందరూ తమ ఇళ్లమీద పండించుకోవడం మంచిది. వారానికి కనీసం 3–4 రోజులైనా తాము పండించిన సేంద్రియ, తాజా కూరగాయలు తింటే ఆరోగ్యంగా ఉంటారు. వాకింగ్‌కు వెళ్లేబదులు ఉదయం గంట, సాయంత్రం గంట పాటు ఇంటిపంటల్లో పనులు చేసుకుంటే మేలు. ఇంటి పంటల పనుల్లో నిమగ్నం అయితే టైం కూడా తెలవదు. మనసు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. మేము మంచి ఆహారం తీసుకోవడంతోపాటు విదేశాల్లో ఉన్న మా పిల్లలకు కూడా పొన్నగంటి కూర వంటి ముఖ్యమైన ఆకుకూరలను నీడలో ఆరబెట్టి పంపుతున్నందుకు ఆనందంగా ఉంది.

– లత కృష్ణమూర్తి,
ఇంటిపంటల సాగుదారు, కుషాయిగూడ, హైదరాబాద్



epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
మంగళవారం
10-12-2019





# ఐటీ.. ఇవెంతో మేటీ

**ఇంజనీరింగ్, ఎంటెక్, ఎంసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ వంటి కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఐటీ రంగంలో అవకాశాలకు కొదవలేదు. అయితే ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న తాజా మార్పులకు అనుగుణంగా ప్రోగ్రామింగ్ నైపుణ్యాలపై పట్టు సాధించడం ప్రధానం అంటున్నారు నిపుణులు. ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో ఎలాంటి నైపుణ్యాలు ఉన్న వారికి అవకాశాలు దక్కుతున్నాయి.. ఏయే ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌పై పట్టు సాధించడం లాభిస్తుందో తెలుసుకుందాం...**

» సాఫ్ట్‌వేర్ రంగంలో హాట్‌కేక్‌లుగా పలు కంప్యూటర్ లాంగ్వేజెస్
» ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు ప్రధానం అంటున్న నిపుణులు
» ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటాసైన్స్‌కు విస్తృత అవకాశాలు

## కొత్త టెక్నాలజీ

ఐటీ రంగంలో టెక్నాలజీ ఒరవడి నిరంతరం మారుతూనే ఉంటుంది. నూతన టెక్నాలజీలు, కంప్యూటర్ లాంగ్వేజెస్ ఎప్పటికప్పుడు సవాళ్లు విసురుతూనే ఉంటాయి. సరికొత్త కంప్యూటర్ లాంగ్వేజెస్ మార్కెట్‌లో హడావుడి చేస్తుంటాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, బ్లాక్ చెయిన్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ), ఏఆర్, వీఆర్ రియాలిటీ, క్లౌడ్ టెక్నాలజీలు ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో ఉపాధి కల్పనలో ముందు వరుసలో నిలుస్తున్నాయి.




## యూఐ, యూఎక్స్

వెబ్‌సైట్లు, యాప్స్ రూపకల్పనలో యూజర్ ఇంటర్‌ఫేస్(యూఐ), యూజర్ ఎక్స్‌పీరియెన్స్(యూఎక్స్) టెక్నాలజీలకు డిమాండ్ అధికం. వీరికి మొబైల్ ప్లాట్‌ఫామ్స్‌పై ఎక్కువగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. అలాగే ట్రెండింగ్ టెక్నాలజీలైన వీఆర్, ఏఆర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), ఐవోటీ టెక్నాలజీల్లో..యూఐ, యూఎక్స్ టెక్నాలజీ తెలిసిన వారికి చక్కటి అవకాశాలు లభిస్తున్నాయి. ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్‌గా పిలిచే ఈ టెక్నాలజీల్లో బహుళ నైపుణ్యాలు అవసరం. జావా స్క్రిప్ట్ స్కిల్స్ ఉన్న వారు ఉద్యోగం సొంతం చేసుకోవడం తేలిక. ఇక హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్ ఫ్రంట్ ఎండ్ వెబ్ డెవలప్‌మెంట్‌కు ఉపయోగపడతాయి. ప్రధానంగా యాంగులర్ జేఎస్, రియాక్ట జేఎస్, నోడ్ జేఎస్, జెక్వెరీ తదితర టెక్నాలజీలపై దృష్టి పెట్టడం మేలు.

### హెచ్‌టీఎంఎల్

వెబ్ పేజీలను డెవలప్ చేయడంలో హెచ్‌టీఎంఎల్(హైపర్ టెక్ట్స్ మార్కప్ లాంగ్వేజ్)ది ప్రధాన పాత్ర. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ కాకున్నా.. వెబ్ అప్లికేషన్ల క్రియేట్‌చేయడంలో హెచ్‌టీఎంఎల్‌ని ఉపయోగిస్తారు. దీనితో ప్రత్యేకంగా ఉద్యోగాలు పొందే అవకాశం లేకున్నా.. వెబ్ డిజైనర్‌గా, వెబ్ డెవలపర్‌గా రాణించాలంటే.. మాత్రం హెచ్‌టీఎంఎల్ పరిజ్ఞానం అవసరం.

### సీఎస్ఎస్

కాస్కేడింగ్ స్టైల్ షీట్స్(సీఎస్ఎస్)ను హెచ్‌టీఎంఎల్ వెబ్‌పేజీలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం కోసం ఉపయోగిస్తారు. వెబ్‌పేజీలో కలర్స్, ఫాంట్, టెక్ట్స్, ఇమేజ్, లింక్స్, టేబుల్స్, బార్డర్స్, మార్జిన్స్, ఔట్‌లైన్స్, డైమెన్షన్స్, స్క్రోల్‌బార్, పొజిషనింగ్, యానిమేషన్స్.. మొదలైన ఎన్నో ఫీచర్లు హెచ్‌టీఎంఎల్ పేజీలకు సీఎస్ఎస్ ద్వారా ఇచ్చే వీలుంది. హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్‌లను డిజైనింగ్, డెవలప్‌మెంట్ కోసం వినియోగించే ఇతర సాఫ్ట్‌వేర్‌లలోనూ ఉపయోగిస్తారు. యాంగులర్ జేఎస్, పీహెచ్‌పీ టెక్నాలజీలపై పనిచేసే క్రమంలో.. హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్‌లు ఉపయోగించాల్సి ఉంటుంది.

## ఎస్క్యూఎల్

డేటాబేస్ డెవలప్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. వీరికి వేతనాలు కూడా ఎక్కువే. డేటాబేస్‌కు సంబంధించి ఎస్క్యూఎల్ (స్ట్రక్చర్ క్వెరీ లాంగ్వేజ్)ను ప్రాథమిక లాంగ్వేజ్‌గా చెప్పొచ్చు. డేటాబేస్‌లో సమాచారాన్ని స్టోర్ చేయడానికి, దాన్ని అవసరాల మేరకు వినియోగించుకోవడానికి క్వెరీ లాంగ్వేజ్ ఉపయోగపడుతుంది. సంస్థల రిలేషనల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టం (డీబీఎంఎస్)ల నుంచి డేటాయాక్సెస్, స్టోరింగ్ కోసం ఎస్క్యూఎల్‌ను ఉపయోగిస్తున్నారు. మైఎస్క్యూఎల్, ఒరాకిల్, ఇన్ఫోమిక్స్, సైబేస్, ఎంఎస్ యాక్సెస్ వంటివన్నీ ఆర్(రిలేషనల్) డీబీఎంఎస్‌లు ఎస్క్యూఎల్‌ను ప్రామాణిక డేటా క్వెరీ లాంగ్వేజ్‌గా ఉపయోగిస్తున్నాయి. ఐటీ రంగంలో ఇతర కోర్సులు, టెక్నాలజీలు కొత్తగా ప్రవేశిస్తున్నా... రిలేషనల్ డీబీఎంఎస్‌కు సంబంధించి ఎస్క్యూఎల్‌కు ఉన్న ఫీచర్స్ దృష్ట్యా ఉత్తమ కోర్సుగా నిలుస్తోంది. ఎస్క్యూఎల్‌తో పాటు ఇతర డేటాబేస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులకు ఐటీ రంగంలో ఎప్పటికీ అవకాశాలు తగ్గవని నిపుణులు చెబుతున్నారు.




### పీహెచ్‌పీ

వెబ్ డెవలప్‌మెంట్‌లో పీహెచ్‌పీతోనూ అవకాశాలు అందుకోవచ్చు. వెబ్ బేస్డ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్ డెవలప్ చేయడానికి పీహెచ్‌పీ (హైపర్ టెక్ట్స్ ప్రీ-ప్రాసెసర్) ఉపయోగిస్తారు. డైనమిక్ కంటెంట్ క్రియేట్ చేసి.. దాన్ని డేటాబేస్‌తో అనుసంధానం చేయడానికి పీహెచ్‌పీని వినియోగిస్తారు. దీన్ని సర్వర్ సైడ్ లాంగ్వేజ్‌గా పరిగణిస్తారు. ఇది ఉచిత లాంగ్వేజ్ కావడంతో మార్కెట్‌లో, వెబ్ ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానం ఉంది. ఇది మై ఎస్క్యూఎల్, ఓరాకిల్, సైబేస్ లాంటి ఆర్‌డీబీఎంఎస్‌లను సపోర్ట్ చేస్తుంది. పీహెచ్‌పీలో ఉన్న సులువైన ఫంక్షన్స్, మెథడ్స్, సింటాక్స్ వల్ల ఈ లాంగ్వేజ్‌కు మార్కెట్‌లో ఆదరణ ఎక్కువ. ఇతర టెక్నాలజీలు, లాంగ్వేజ్‌లతో పోలిస్తే పీహెచ్‌పీ నేర్చుకోవడం సులువు.

## పైథాన్

ఉద్యోగ సాధనలో కీలకమైన కంప్యూటర్ లాంగ్వేజ్.. పైథాన్. డేటాసైన్స్‌లో అనలిటిక్స్, కోడింగ్‌కు పైథాన్ లాంగ్వేజ్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. డేటాసైన్స్‌లో పైథాన్‌తోపాటు ఆర్, మట్‌ల్యాబ్, అక్టేవ్, మ్యాథమెటికా/సాగా వంటి టెక్నాలజీలు వస్తున్నా.. పైథాన్‌లో ఉన్న లైబ్రరీలు, కమ్యూనిటీ మద్దతు వల్ల జాబ్ మార్కెట్‌లో దీనికే ఆదరణ ఎక్కువగా ఉంది. పైగా పైథాన్‌ను సులువుగా నేర్చుకోవచ్చనేది సాఫ్ట్‌వేర్ నిపుణులు చెబుతున్న మాట. కోడింగ్ రాయడానికి సమర్థవంతమైన లైబ్రరీలు అందుబాటులో ఉండటం వల్ల సీ, సీ++, జావా కంటే పైథాన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. జాబ్ మార్కెట్‌లో అత్యంత ఆదరణ కలిగిన కంప్యూటర్ లాంగ్వేజ్‌గా పైథాన్‌ను పేర్కొనొచ్చు.




## జావా స్క్రిప్ట్

హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్ తెలిసి ఉంటే.. జావాస్క్రిప్ట్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ నేర్చుకోవడం సులువు. జావా స్క్రిప్ట్‌ను క్లైయింట్ సైడ్ స్క్రిప్టింగ్ లాంగ్వేజ్‌గా ఉపయోగిస్తారు. హెచ్‌టీఎంఎల్ పేజీల్లో జావాస్క్రిప్ట్‌ను రాస్తే.. అది బ్రౌజర్‌లో ఎగ్జిక్యూట్ చేస్తారు. వెబ్‌సైట్ డెవలప్‌మెంట్‌లో.. హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్ కంటే శక్తివంతమైన ఫీచర్లు ఇందులో ఉంటాయి. హెచ్‌టీఎంఎల్‌లో వెబ్ కంటెంట్‌లో పేరాగ్రాఫ్స్, హెడ్డింగ్స్, డేటాటేబుల్స్, ఎంబెడెడ్ ఇమేజెస్, వీడియోస్ వంటివి పేజీలో కుదర్చవచ్చు. సీఎస్ఎస్‌లో ఆ కంటెంట్‌కు బ్యాక్‌గ్రౌండ్ కలర్స్, ఫాంట్స్, లేఅవుట్ లాంటి డిజైన్లు చేసే అవకాశం ఉంది. జావాస్క్రిప్ట్‌తో వెబ్ పేజీలకు 'డైనమిజం' ఇవ్వొచ్చు. ఇంకా మల్టీమీడియా కంట్రోల్,2డీ,3డీ యానిమేషన్ ఇమేజ్‌లు ప్రవేశపెట్టే ఆధునిక ఫీచర్లుంటాయి. మొత్తంగా వెబ్‌సైట్‌ను ఆకర్షణీయంగా, రిచ్‌గా తీర్చిదిద్ది, యూజర్ ఫ్రెండ్లీగా రూపొందించడంలో జావాస్క్రిప్ట్ ఉత్తమ టూల్. ఈ జావా స్క్రిప్ట్ లాంగ్వేజ్‌పై పట్టు సాధిస్తే.. ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ డెవలప్‌మెంట్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. డెస్క్‌టాప్, గేమ్ డెవలప్‌మెంట్, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్‌లో జావాస్క్రిప్ట్‌ను ఉపయోగిస్తారు.


```
<!DOCTYPE html PUBLIC "-//W3C//DTD XHTML 1.0 St
<html xmlns="http://www.w3.org/1999/xhtml" xml:
  <head>
    <meta http-equiv="Content-Type" content="te
    <meta http-equiv="Content-Script-Type" cont
    <meta http-equiv="Content-Style-Type" conte
    <title>Document Title</title>
    <link rev="made" href="mailto:validator@ml.
    <link rev="start" href="./" title="Main Pag
    <style type="text/css" media="all">
      @import "style/base.css";
    </style>
    <script type="text/javascript" src="scripts
    <script type="text/javascript" src="scripts
  </head>
```

## జావా

ఐటీ రంగంలో జావా కంప్యూటర్ లాంగ్వేజ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. సాధారణంగా కంప్యూటర్ లాంగ్వేజ్‌లు కొంత కాలానికే కనుమరుగైపోతాయి. కానీ జావా మాత్రం మరింత ఆదరణ పొందుతూ వస్తోంది. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో జావా లాంగ్వేజ్‌దే అగ్రస్థానం. ప్రపంచంలోని అత్యధిక మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు కలిగి ఉన్న స్కిల్ జావా. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు కోటి మంది జావా డెవలపర్లు ఉన్నట్లు అంచనా. జావా లాంగ్వేజ్ నైపుణ్యాలుంటే.. మార్కెట్‌లో వచ్చే ఇతర టెక్నాలజీలను సులువుగా నేర్చుకోవచ్చనేది నిపుణుల అభిప్రాయం. ఫ్రెషర్స్.. కోర్ జావా, అడ్వాన్స్‌డ్ జావాపై శిక్షణ పొందితే ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి.

### క్లౌడ్ టెక్నాలజీలు

ప్రపంచవ్యాప్తంగా సంస్థలన్నీ తమ కార్యకలాపాల నిర్వహణకు క్లౌడ్ టెక్నాలజీపై ఆధారపడుతున్నాయి. ప్రముఖ కంపెనీల క్లౌడ్ సర్వీసెస్‌పై శిక్షణ పొందిన మానవ వనరులకు డిమాండ్ ఏర్పడింది. సేల్స్‌ఫోర్స్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థల క్లౌడ్ టెక్నాలజీపై ఉద్యోగాలు లభిస్తాయి.



### డెవాప్స్

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగుతోంది. ప్లాన్, కోడింగ్, టెస్టింగ్, ప్రొడక్ట్‌ను మార్కెట్‌లోకి రిలీజ్ చేయడం, డిప్లాయ్, ఆపరేషన్, మానిటరింగ్, మార్పులు-చేర్పులు.. ఇలా అనేక దశలు. సాఫ్ట్‌వేర్ సంస్థలు కొన్ని 'మోడల్స్' ప్రకారం మొత్తం ప్రక్రియను పూర్తి చేస్తాయి. అందులో భాగంగా వాటర్‌ఫాల్ మోడల్, ఏజైల్ మోడల్స్ లాంటి వాటిని సంస్థలు అనుసరిస్తూ ఉంటాయి. ఆయా 'మోడల్స్'లోని కొన్ని ప్రతికూలతలు సంస్థలకు సవాలుగా మారుతున్నాయి. వాటిని అధిగమించేందుకు 'డెవాప్స్ (Devops)' ఉపయోగపడుతుంది. ఇందులో డెవలపర్స్, ఆపరేషన్స్ విభాగాల సభ్యులు కలిసి 'ఉత్పాదకత' పెంచేందుకు కృషి చేస్తారు. అంటే.. ఏ ఒక్క ఉద్యోగి పని ఒక దశలోనే ఆగిపోకుండా.. ఒక జట్టుగా సాఫ్ట్‌వేర్ డెలివరీ, మెయింటెనెన్స్ వరకు కలిసి పనిచేస్తారు. డెవలపర్స్, సిస్టమ్ అడ్మిన్స్, టెస్టర్స్.. మొదలైన వాళ్లందరూ డెవాప్స్ ఇంజనీర్లుగా కలిసి పనిచేస్తారు. డెవాప్స్ నైపుణ్యాలు ఉన్నవారు ప్రస్తుతం ఉద్యోగం పొందడం సులభం.

### ఏఐతో అవకాశాలు

ఐటీ, మ్యానుఫ్యాక్చరింగ్, ఈ కామర్స్ రంగాల్లో ఇంజనీర్లకు ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ మొదలైన ట్రెండింగ్ కోర్సులపై కనీస అవగాహన ఉన్నా.. ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. భవిష్యత్‌లో ఏఐ ప్రొఫెషనల్స్‌కు విస్తృత అవకాశాలు లభిస్తాయని చెప్పొచ్చు. సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఫ్రెషర్స్ ఏఐ స్కిల్స్ పొందేందుకు కృషి చేయాలి.

–జాయిస్ మాస్టర్,
సీఈవో, షైన్ డాట్ కామ్.

---

# క్రేజీ కన్సల్టింగ్

కవర్ స్టోరీ

**కన్సల్టింగ్.. కార్పొరేట్ రంగంలో.. హాట్ కేక్! సేవల నుంచి తయారీ వరకు.. ఏ రంగంలో చూసినా.. కన్సల్టింగ్ జాబ్ ప్రొఫైల్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఏ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను చూసినా... క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, పీపీఓల్లో అధికశాతం ఆఫర్స్ కన్సల్టింగ్‌లోనే! ఐఐటీల్లో, ఐఐఎంల్లో కన్సల్టింగ్ హవా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. కన్సల్టింగ్ ఎందుకంత క్రేజ్? సంస్థల్లో కన్సల్టింగ్ విభాగం విధులు.. కన్సల్టింగ్ కెరీర్ స్కోప్‌పై ప్రత్యేక కథనం...**



» కన్సల్టింగ్, అనలిటిక్స్ విభాగాల్లో భారీగా ఆఫర్లు
» ఐఐఎంల్లో 40 శాతం మేరకు కన్సల్టింగ్ విభాగాల్లోనే నియామకాలు
» ఐఐటీల్లోనూ పెరుగుతున్న కన్సల్టింగ్ ఉద్యోగాలు

ఒక సంస్థను ప్రారంభించాలన్నా.. లేదా అప్పటికే ఉన్న సంస్థను మార్కెట్లో మరింత ముందంజలో నిలపాలన్నా.. అందుకు తగిన ప్రణాళికలు, వ్యూహాలు తప్పనిసరి. వీటిని రూపొందించేదే.. కన్సల్టింగ్ విభాగం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంస్థలు భవిష్యత్తు మనుగడ, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుండటంతో కన్సల్టింగ్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఐఐటీలు, ఐఐఎంల్లో కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులను కన్సల్టింగ్ కొలువుల్లో నియమించుకునేందుకు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. వీరికి సంబంధిత నైపుణ్యాలు ఉంటాయని సంస్థలు భావిస్తుండటమే ఇందుకు కారణం. ఇటీవల ఐఐఎంలలో ముగిసిన ఎస్‌పీఓలు (సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్), ఐఐటీల్లో కొనసాగుతున్న పీపీఓ(ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్)ల్లో సగటున 30 శాతం మేరకు కన్సల్టింగ్ జాబ్ ప్రొఫైల్స్ ఉండటమే ఇందుకు నిదర్శనం.

### స్ట్రాటజిక్ కన్సల్టింగ్

కన్సల్టింగ్ విభాగంలో స్ట్రాటజిక్ కన్సల్టింగ్, ఆపరేషన్స్ కన్సల్టింగ్ అని రెండు రకాలు. వీటిలో స్ట్రాటజిక్ కన్సల్టింగ్‌కు మరింత ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. కారణం.. కొత్తగా సంస్థను ప్రారంభించే లక్ష్యంతో ఉన్న వారు తమ ఉత్పత్తికి సంబంధించి మార్కెట్ రీసెర్చ్, ప్రాజెక్ట్ రిపోర్ట్, అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పన వంటి వాటిపై దృష్టిపెడుతున్నాయి. ఈ కార్యకలాపాలను సమగ్రంగా నిర్వహించేదే స్ట్రాటజిక్ కన్సల్టింగ్.

### ఆపరేషన్స్ కన్సల్టింగ్

సంస్థలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఆపరేషన్స్ కన్సల్టింగ్ దోహదం చేస్తుంది. ఇప్పటికే వ్యాపారాలు నిర్వహిస్తున్న సంస్థలు.. వృద్ధిబాట పట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తుంది. ఆయా సంస్థల ఉత్పత్తులకు మార్కెట్‌లో ఉన్న పోటీని బేరీజు వేస్తూ.. దానికి అనుగుణంగా సంస్థ అనుసరించాల్సిన వ్యూహాలు తయారుచేస్తుంది. మార్కెట్లో పోటీని తట్టుకోవడానికి సంస్థ చేపట్టాల్సిన చర్యలపై ఆపరేషన్ కన్సల్టింగ్ విభాగం సలహాలు ఇస్తుంది. సంస్థల విలీనాలు, టేకోవర్స్ వంటి ప్రక్రియల్లోనూ ఆపరేషన్ కన్సల్టింగ్ విభాగం మధ్యవర్తిగా వ్యవహరిస్తుంది. సదరు ప్రక్రియలు పూర్తయ్యేలా చూస్తుంది.

### పెరుగుతున్న డిమాండ్

కన్సల్టింగ్ విభాగంలో నిపుణులకు డిమాండ్ ఏటేటా పెరుగుతోంది. ఇటీవల ఐఐఎంలలో ముగిసిన ఎస్‌పీఓ ప్రక్రియలో మొత్తం ఆఫర్స్‌లో 40 శాతం కన్సల్టింగ్ సంస్థల్లో ఉండటమే ఇందుకు నిదర్శనం. అదే విధంగా ఐఐటీల్లో ప్రీ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియలోనూ సగటున 30 శాతం కన్సల్టింగ్ సంస్థల నియామకాలే నమోదైనట్లు చెబుతున్నారు. కన్సల్టింగ్ విభాగంలో ఎస్‌పీఓలు, పీపీఓలు అందుకున్న వారికి రూ.లక్ష నుంచి రూ. మూడు లక్షల వరకు స్టయిఫండ్ అందించడం కూడా కన్సల్టింగ్ విభాగానికి పెరుగుతున్న డిమాండ్‌కు నిదర్శనంగా చెప్పొచ్చు.

### అనలిటిక్స్ కీలకం

డేటా అనలిటిక్స్ విభాగంలోనూ డిమాండ్ పెరుగుతోంది. వినియోగదారుల ఆసక్తులకు అనుగుణంగా సంస్థలు తమ కార్యకలాపాలను, ఉత్పత్తులను రూపొందించడం.. అందుకోసం డేటాను విశ్లేషించడం వంటివి కీలకంగా మారుతుండటమే ఇందుకు కారణం. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ వంటి కోర్సులు పూర్తి చేసిన వారికి అనలిటిక్స్ ఎక్స్‌పర్ట్ ఉద్యోగాలు లభిస్తున్నాయి. డేటా అనలిస్ట్; డేటాసైంటిస్ట్; డేటావిజువలైజేషన్ స్పెషలిస్ట్; డేటాఇంజనీర్; అనలిటిక్స్ మేనేజర్ వంటి హోదాల్లో ఐఐటీలు, ఐఐఎంల అభ్యర్థులను సంస్థలు నియమించుకుంటున్నాయి. వీరికి ఎంట్రీ లెవల్‌లోనే సగటున రూ.5 లక్షల వార్షిక వేతనం అందుతోంది. అనలిటిక్స్ పరంగా సంస్థలు టెక్నికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ విభాగంలో ఎక్కువ ఉద్యోగాలు లభిస్తున్నాయని చెప్పొచ్చు.

### ఆఫ్ క్యాంపస్ నియామకాలు

కన్సల్టింగ్‌లో విభాగాల్లో ఆఫ్ క్యాంపస్ నియామకాలు ఉండవా? అనే సందేహం అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. అయితే ప్రస్తుతం కంపెనీలు ఎక్కువ శాతం ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌ల క్యాంపస్‌లకే పరిమితం అవుతున్నాయి. ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ల పరంగా సంస్థలు జాబ్ పోర్టల్స్‌ను అనుసంధాన వేదికలుగా మార్చుకుంటున్నాయి. అభ్యర్థులు తమ ప్రొఫైల్స్‌ను జాబ్ పోర్టల్స్‌లో అప్‌లోడ్ చేసుకోవడం ద్వారా అవకాశాలు అందుకునే వీలుందని నిపుణులు సూచిస్తున్నారు. అదేవిధంగా సంస్థల రిక్రూట్‌మెంట్ లింక్స్‌లోనూ అప్‌లోడ్ చేసుకోవాలంటున్నారు.

### ఈ నైపుణ్యాలు ఉండాలి

కన్సల్టింగ్ సంస్థల్లో కొలువు కోసం డొమైన్ నాలెడ్జ్‌తోపాటు ఇతర నైపుణ్యాలను కూడా మెరుగుపరచుకోవాలని ఆయా ఇన్‌స్టిట్యూట్‌ల ప్లేస్‌మెంట్ వర్గాలు తెలుపుతున్నాయి. ముఖ్యంగా అనలిటికల్ అప్రోచ్; ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్; డేటారీసెర్చ్; డేటాఅనాలిసిస్; డేటా మేనేజ్‌మెంట్; ఇన్నోవేటివ్ థింకింగ్; క్రియేటివిటీ; టీమ్ వర్కింగ్; కమ్యూనికేషన్ స్కిల్స్; మార్కెట్ నాలెడ్జ్ వంటి నైపుణ్యాలకు కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

### టాప్ రిక్రూటర్స్

ఐఐటీలు, ఐఐఎంలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కన్సల్టింగ్ నియామకాల పరంగా.. బెయిన్ అండ్ కో; పీడబ్ల్యూసీ(ప్రైస్ వాటర్ కూపర్); యాక్సెంచర్ స్ట్రాటజీ; స్ట్రాటజీ అండ్ కో; కేపీఎంజీ; ది బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్; ఈ ఎన్ వై; మెకిన్సే అండ్ కో; డెలాయిట్; ఎ.టి.కెర్నీ వంటి సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలుస్తున్నాయి. డేటా అనలిటిక్స్ విభాగంలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర కంపెనీలు ముందంజలో ఉంటున్నాయి.



## ఉద్యోగాలు ఇవే

కన్సల్టింగ్ సంస్థల్లో రీసెర్చ్, డేటా అనాలిసిస్, రిపోర్ట్ రైటింగ్‌కు సంబంధించి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఆ వివరాలు..

- **అనలిస్ట్, జూనియర్ అసోసియేట్:** మేనేజ్‌మెంట్ పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు కన్సల్టింగ్ సంస్థల్లో అనలిస్ట్, జూనియర్ అసోసియేట్ ఉద్యోగాలు లభిస్తున్నాయి. వీరు డేటాకలెక్షన్, డేటా అనాలిసిస్, ఫైండింగ్స్‌తో నివేదికలను రూపొందించాల్సి ఉంటుంది. వీరికి ప్రారంభంలో నెలకు రూ.50వేల వరకు వేతనం లభిస్తోంది.
- **కన్సల్టెంట్, సీనియర్ కన్సల్టెంట్, మేనేజర్:** అయిదారేళ్ల పని అనుభవం ఉండి.. పీజీ ఉత్తీర్ణులైన వారికి కన్సల్టెంట్, సీనియర్ కన్సల్టెంట్, మేనేజర్ తదితర ఉద్యోగాలు లభిస్తున్నాయి. అనలిస్టులు, జూనియర్ అసోసియేట్‌లు అందించిన నివేదికలను విశ్లేషించడం, వాటిని బేరీజు వేసి.. అందుకు అనుగుణంగా క్లయింట్ సమస్యకు పరిష్కారం చూపాలి.
- **ప్రిన్సిపల్ /డైరెక్టర్:** కన్సల్టింగ్ సంస్థల్లో ఉన్నత స్థాయిలో ద్వితీయ శ్రేణిలో ప్రిన్సిపల్స్ లేదా డైరెక్టర్స్‌ను కన్సల్టింగ్ సంస్థలు నియమించుకుంటున్నాయి. వీరు నేరుగా క్లయింట్ రిలేషన్‌షిప్‌ను ఏర్పరచడం, కొత్త క్లయింట్లను తేవడం వంటివి చేయాల్సి ఉంటుంది.
- ఆయా హోదాల్లో అనుభవం గడించిన కొద్దీ.. సీనియర్ మేనేజర్, అనలిస్ట్, ప్రోగ్రామ్ మేనేజర్, ప్రాజెక్ట్ హెడ్ స్థాయికి చేరుకోవచ్చు.

### కన్సల్టింగ్ కెరీర్.. గణాంకాలు

- గత ఏడాది(2018) ఐఐఎంలు, ఇతర బి-స్కూల్స్ ప్లేస్‌మెంట్స్‌లో సగటున 40 శాతం మేర కన్సల్టింగ్ సంస్థల ఆఫర్స్.
- ప్రారంభంలో రూ.30 లక్షలు(డొమెస్టిక్); రూ.80 లక్షల నుంచి రూ.కోటి (ఇంటర్నేషనల్ ఆఫర్స్) పే ప్యాకేజీలు
- ఈ ఏడాది(2019)లో ఐఐఎంల ఎస్‌పీఓ ప్రక్రియలో 40శాతం కన్సల్టింగ్ సంస్థల ఆఫర్స్
- ఐఐటీల్లోనూ 30 శాతం మేరకు కన్సల్టింగ్ సంస్థల నుంచే ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్లు.

### ఎక్కువ ఆఫర్లు

కన్సల్టింగ్ సంస్థల్లో పీపీవో నియామకాలు ఈ ఏడాది ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. అన్ని ఇన్‌స్టిట్యూట్‌లలోనూ ఈ సంస్థల నియామకాలు కనిష్టంగా 25 శాతంగా నమోదయ్యాయి. ఇదే ట్రెండ్ ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియలోనూ కొనసాగే అవకాశముంది. ఇంజనీరింగ్ విద్యార్థులకు కన్సల్టింగ్ సంస్థలు ప్రాధాన్యం ఇవ్వడానికి కారణం.. డేటారీసెర్చ్, అనాలిసిస్, ఫోర్‌క్యాస్టింగ్ వంటి అంశాల్లో వీరికి నైపుణ్యాలు ఉంటాయని భావించడమే. పీపీఓలను దృష్టిలో పెట్టుకుంటే..2019-20 ఫైనల్ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియలోనూ కన్సల్టింగ్ సంస్థలు ఎక్కువ ఆఫర్లు ఇస్తాయని చెప్పొచ్చు.

–ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ ఏముల,
ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్, ఐఐటీ-హైదరాబాద్

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
10-12-2019

# ఆంధ్ర 211 ఆలౌట్

## అర్ధ సెంచరీతో ఆదుకున్న విహారి


విహారి

**మూలపాడు (విజయవాడ):** రంజీ ట్రోఫీ సీజన్‌లో భాగంగా డిఫెండింగ్ చాంపియన్ విదర్భతో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది. తొలి రోజు 74 ఓవర్లు ఆడి 211 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ హనుమ విహారి (155 బంతుల్లో 83; 12 ఫోర్లు, సిక్స్) ఆకట్టుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లు ఆడిన విదర్భ వికెట్ నష్టపోకుండా 26 పరుగులు చేసింది. క్రీజులో ఫజల్ (11 బ్యాటింగ్), సంజయ్ రఘునాథ్ (22 బ్యాటింగ్) ఉన్నారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టుకు ఓపెనర్లు జ్ఞానేశ్వర్ (8), ప్రశాంత్ కుమార్ (10) శుభారంభం అందించడంలో విఫలం అయ్యారు. అనంతరం వచ్చిన రికీ భుయ్ (9) కూడా పెవిలియన్‌కు చేరడంతో ఆంధ్ర 59 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఇన్నింగ్స్ చక్కదిద్దే బాధ్యతను కెప్టెన్ విహారి, వైస్ కెప్టెన్ కేఎస్ భరత్ (53 బంతుల్లో 22; 4 ఫోర్లు) తీసుకున్నారు. వీరు నాలుగో వికెట్‌కు 67 పరుగులు జోడించి జట్టు కుదురుకునేలా చేశారు. అయితే భోజన విరామం అనంతరం వీరు వెంట వెంటనే అవుటవ్వడంతో జట్టు భారీ స్కోరు సాధించడంలో విఫలం అయింది. విదర్భ బౌలర్లలో ఆదిత్య (4/52), రజనీశ్ (3/72), యశ్ ఠాకూర్ (2/44) రాణించారు. గుజరాత్‌తో ఆరంభమైన మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి రోజు 233 పరుగులకు ఆలౌటైంది. సుమంత్ (189 బంతుల్లో 69 నాటౌట్; 9 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

### జాఫర్ అత్యధిక మ్యాచ్‌ల రికార్డు



ఇదే మ్యాచ్‌లో విదర్భ ఆటగాడు వసీం జాఫర్ రంజీల్లో 150 మ్యాచ్‌లు ఆడిన తొలి ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఓవరాల్‌గా 253 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన 41 ఏళ్ల జాఫర్ 51.19 సగటుతో 19,147 పరుగులు చేశాడు. అందులో 57 సెంచరీలు, 88 అర్ధ సెంచరీలు ఉండటం విశేషం.

### పాము కలకలం...

**విజయవాడ స్పోర్ట్స్ :** ఆంధ్ర, విదర్భ జట్ల మధ్య రంజీ మ్యాచ్‌లో పాము కలకలం సృష్టించింది. మొదటి ఓవర్ ప్రారంభిస్తూ ఫీల్డ్ సర్దుకుంటున్న సమయంలో ఓ పాము గ్రౌండ్‌లోకి ప్రవేశించింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. పామును గ్రౌండ్ నుంచి బయటకు పంపడానికి అక్కడి సిబ్బంది నానా తంటాలు పడ్డారు. చివరకు ఆ పామును బయటకు పంపించాక ఆటను కొనసాగించారు.




2016 రియో ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో రష్యా బృందం (ఫైల్)

# రష్యాను గెంటేశారు

**వ్యవస్థీకృత డోపింగ్‌కు మూల్యం చెల్లించుకున్న రష్యా ● నాలుగేళ్ల నిషేధం విధించిన 'వాడా'**

**టోక్యో ఒలింపిక్స్‌లో రష్యా పతాకం కనిపించదు ● జాతీయ గీతం కూడా వినిపించదు ● అంతర్జాతీయ టోర్నీలకు ఆతిథ్య భాగ్యం లేనట్టే**

**యూరో ఫుట్‌బాల్, ఫార్ములావన్ రేసులకు మినహాయింపు ● డోపింగ్ మచ్చ లేని రష్యా క్రీడాకారులకు స్వతంత్రంగా పోటీ పడే అవకాశం**

**ప్రపంచ క్రీడల్లో అగ్రరాజ్యం అమెరికాకు పక్కలో బల్లెంలా నిలిచిన దేశం రష్యా. అయితే 'డోపింగ్' భూతం రష్యా కొంప ముంచింది. ఐదేళ్ల క్రితం ప్రపంచ క్రీడాలోకాన్ని నివ్వెరపరిచిన రష్యాలోని వ్యవస్థీకృత డోపింగ్ ఉదంతం కథ ఇప్పుడు కంచికి చేరింది. ఎన్నిసార్లు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు కనబడకపోవడంతో ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) తీవ్రమైన చర్య తీసుకుంది. ఏకంగా నాలుగేళ్లపాటు అంతర్జాతీయ క్రీడలకు దూరంగా ఉండాలని ఆదేశిస్తూ రష్యా దేశంపై 'వాడా' నిషేధం విధించింది.**

**లుసానే (స్విట్జర్లాండ్):** డోపింగ్ భూతం రష్యా పుట్టి ముంచేసింది. అంతర్జాతీయ క్రీడా సమాజం రష్యాను గెంటేసింది. వచ్చే 2020 టోక్యో ఒలింపిక్స్‌కు దూరం చేసింది. దీంతో టోక్యో వేదికపై రష్యా జాతీయ పతాకం కనిపించదు. జాతీయ గీతం కూడా వినిపించదు. వ్యవస్థీకృత డోపింగ్ కారణంగా... ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) రష్యాపై నాలుగేళ్ల పాటు నిషేధం విధించింది. సోమవారం జరిగిన 'వాడా' ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ చర్యతో రష్యా క్రీడా సమాజం తీవ్రంగా నష్టపోనుంది. 2020 పారాలింపిక్స్, 2022 యూత్ ఒలింపిక్స్, 2022లో బీజింగ్ ఆతిథ్యమివ్వనున్న వింటర్ ఒలింపిక్స్‌లో రష్యా జట్లేవీ బరిలోకి దిగవు. వచ్చే నాలుగేళ్లలో ఆ దేశం అంతర్జాతీయ క్రీడా పోటీల ఆతిథ్యానికి కూడా పనికిరాదు.

### 'వారికి' అవకాశం

అయితే డోపింగ్ మచ్చలేని రష్యా క్రీడాకారులకు 'వాడా' కాస్త వెసులుబాటు ఇచ్చింది. వారు స్వతంత్ర హోదాలో (అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ పతాకం కింద) పాల్గొనవచ్చని తెలిపింది. స్వతంత్ర హోదాలో పాల్గొనే రష్యా అథ్లెట్లు పతకాలు గెలిచినా అవి రష్యా ఖాతాలోకి రావు. రష్యా జాతీయ పతాకం ఎగరదు, జాతీయ గీతం కూడా వినిపించదు. వచ్చే ఏడాది రష్యాలో జరిగే కొన్ని యూరో ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు, ఫార్ములావన్ రేసు నిర్వహణకు మాత్రం మినహాయింపునిచ్చింది. 2020 యూరో టోర్నీ 12 దేశాల్లో జరగనుంది.



### రష్యా పేరు లేకుండా...

ఒకవేళ ఖతర్‌లో జరిగే 2022 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు రష్యా అర్హత సాధిస్తే పరిస్థితి ఏంటనే దానిపై 'వాడా' స్పష్టత ఇవ్వలేదు. యూరోప్‌కు సంబంధించి 2021లో ప్రపంచకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు మొదలవుతాయి. ప్రధాన టోర్నీ కానందున క్వాలిఫయింగ్‌లో రష్యా పాల్గొనవచ్చని 'వాడా' తెలిపింది. ఒకవేళ రష్యా ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తే ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా)తో చర్చించి దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని 'వాడా' తెలిపింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఆడేందుకు ఒకవేళ రష్యాకు అనుమతి ఇచ్చినా వారు రష్యా పేరును వాడే అవకాశం ఉండదని 'వాడా' వివరించింది.

### అసలేం జరిగిందంటే...

రష్యా క్రీడల యంత్రాంగమంతా డోపింగ్‌లో భాగస్వామ్యమైందని జర్మన్ టీవీ చానెల్ ఓ డాక్యుమెంటరీని ఐదేళ్ల క్రితం 2014 డిసెంబర్‌లో ప్రసారం చేసింది. ఇది అంతర్జాతీయ క్రీడాలోకాన్నే నిర్ఘాంతపరిచింది. ఎక్కడైనా... ఎప్పుడైనా... డోపింగ్‌లో ఇప్పటివరకు వ్యక్తిగతంగా ఆటగాళ్లే దొరుకుతారు. మొత్తం దేశమే ఈ అవకతవకల జాడ్యంలో పట్టుపడటం ఏంటనే చర్చ లేవనెత్తింది. దీనిపై దర్యాప్తు చేసిన 'వాడా' 2011 నుంచి 2015 వరకు రష్యా వ్యవస్థీకృత డోపింగ్‌కు పాల్పడిందని 2016లో ప్రకటించింది. మాస్కోలోని ల్యాబోరేటరీలోని ఫలితాలన్నీ అసలైనవి కావని, అవన్నీ నకిలీవని విచారణలో తేలింది. ఆటగాళ్ల రక్త, మూత్ర నమూనాల్లో డోపీలనీ తేలినా... డేటా మొత్తం ఏమార్చిందని విస్తుగొలిపే విషయాన్నీ వెల్లడించింది. మొత్తం అధికార యంత్రాంగం ఈ పాపానికి పాల్పడినట్లు తేలడంతో రష్యా డోపింగ్ నిరోధక సంస్థ (ఆర్‌యూఎస్‌ఏడీఏ)పై, రష్యా ఒలింపిక్ కమిటీ (ఆర్‌ఓసీ)పై వేటు వేసింది. అప్పటినుంచి నిషేధం ఉచ్చు రష్యా మెడకు బిగుసుకుంది. కానీ వ్యక్తిగత క్రీడాంశాలపై కరుణ చూపింది. రష్యా ఆటగాళ్లను మెగా ఈవెంట్లలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) గొడుగు కింద పాల్గొనేందుకు వెసులుబాటు ఇచ్చింది.

### అప్పీలుకు వెళ్లొచ్చు...

నిషేధంపై అప్పీలుకు వెళ్లేందుకు 'వాడా' అవకాశమిచ్చింది. 'స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ కోర్టు'లో సవాలు చేసేందుకు 21 రోజుల గడువిచ్చింది. ఏదేమైనా రష్యా అథ్లెట్లు మేటి ఈవెంట్లలో పాల్గొనేందుకు వెసులుబాటైతే ఉంది. కానీ... వారిపై 'వాడా' 'స్కానింగ్' తప్పనిసరిగా ఉంటుంది. అంటే 'వాడా' పరీక్షల్లో నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకోలేదని క్షుణ్ణంగా తేలిన అథ్లెట్లను, అది కూడా స్వతంత్రంగా పోటీపడేందుకు అవకాశం కల్పిస్తారు. క్రీడల్లో ఇది అతిపెద్ద డోపింగ్ కుంభకోణమని, ఈ అపరాధానికి శిక్షతో పాటు అంతర్జాతీయ సమాజానికి రష్యా క్షమాపణలు చెప్పాలని నార్వేకు చెందిన న్యాయకోవిదుడు లిండా హెలెలాండ్ తెలిపారు. 'ఈ నిర్ణయంపై నాకు సంతోషం లేదు. కానీ తప్పదు. రష్యా యంత్రాంగం పరీక్షల తాలూకు డేటాను 'వాడా' కోరినపుడు ఆలస్యం చేయడంతోనే రష్యా కపటం బట్టబయలైంది' అని అన్నారు. కఠినమైన చర్యలు తీసుకోవాలని ఐఓసీ సిఫార్సు చేసింది. రష్యా అధికారులు, క్రీడాకారులకు ఈ చర్యలు చెంపపెట్టు కావాలని ఐఓసీ గట్టిగా కోరింది.

### కూర్చున్న కొమ్మనే నరుక్కుంది...

తానెక్కిన కొమ్మను తానే నరికినట్లుగా రష్యా కపటానికి, మోసానికి రష్యానే బలైందని 'వాడా' అథ్లెట్ ప్యానెల్ తెలిపింది. 'ఈ మొత్తం ఉదంతాన్ని రష్యానే సృష్టించింది. ప్రపంచాన్నే మోసం చేసింది. తద్వారా తమ అథ్లెట్ల బంగారు కలల్ని, ఉజ్వల భవిష్యత్తును రష్యానే నాశనం చేసింది' అని వాడా ప్యానెల్ సమావేశానికి ముందే ప్రకటించింది. రష్యా ఒలింపిక్ కమిటీ (ఆర్‌ఓసీ) మాత్రం 'వాడా' చర్యలపై అసంతృప్తి వెళ్లగక్కింది. మొత్తం దేశాన్నే నిషేధించడం సహేతుకం కాదని... ఇది పూర్తిగా అశాస్త్రీయ విధానమని ఆర్‌ఓసీ అభిప్రాయపడింది.



### అలా మొదలై... ఇలా వెలిగి...

- **డిసెంబర్, 2014:** రష్యా డోపింగ్‌పై జర్మన్ టీవీలో డాక్యుమెంటరీ ప్రసారం
- **నవంబర్, 2015** రష్యా డోపింగ్ నిరోధక సంస్థపై 'వాడా',ఆటగాళ్లపై అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య వేటు.
- **జూలై 18, 2016** 2011 నుంచి 2015 వరకు రష్యా వ్యవస్థీకృత డోపింగ్‌కు పాల్పడినట్లు 'వాడా' నివేదిక.
- **ఆగస్టు, 2016** రియో ఒలింపిక్స్‌లో రష్యా జట్టులో 276 మంది అథ్లెట్లకు అవకాశం. 111 మంది తొలగింపు.
- **డిసెంబర్, 2017** ఐఓసీ చర్యలు షురూ. ముందుగా రష్యా ఒలింపిక్ కమిటీపై వేటు. 43 మంది అథ్లెట్లపై జీవితకాల నిషేధం. సోచి వింటర్ ఒలింపిక్స్‌లో రష్యా గెలిచిన 13 పతకాలు వాపస్.
- **ఫిబ్రవరి, 2018** స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ కోర్టులో నిషేధాలపై మొదలైన విచారణ. ప్యాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో 169 మంది రష్యన్లకు ఐఓసీ గ్రీన్‌సిగ్నల్.
- **సెప్టెంబర్, 2018** మాస్కో ల్యాబోరేటరీ డేటా ఇచ్చేందుకు రష్యా డోపింగ్ నిరోధక సంస్థ అంగీకరించడంతో ఆ సంస్థపై నిషేధం ఎత్తివేత.
- **జనవరి, 2019** 'వాడా'కు మాస్కో ల్యాబోరేటరీ డేటా అందజేసిన రష్యా డోపింగ్ నిరోధక సంస్థ.
- **సెప్టెంబర్, 2019** డేటా అందాకా కొత్తగా మళ్లీ 'వాడా' దర్యాప్తు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (దోహా)లో రష్యాపై నిషేధం కొనసాగింపు.
- **నవంబర్ 25, 2019** నాలుగేళ్ల నిషేధం విధించాలంటూ 'వాడా' ప్యానెల్ సిఫారసు.
- **డిసెంబర్ 9, 2019** రష్యాపై నిషేధం ఖరారు


సాత్విక

# 'స్వర్ణ' సాత్విక

- మహిళల టెన్నిస్ సింగిల్స్‌లో పసిడి నెగ్గిన హైదరాబాద్ ప్లేయర్
- దక్షిణాసియా క్రీడల్లో భారత్ పతకాల వర్షం

**కఠ్మాండు (నేపాల్):** తమ పతకాల వేటను కొనసాగిస్తూ దక్షిణాసియా క్రీడల్లో భారత్ 'ట్రిపుల్ సెంచరీ'కి చేరువైంది. పోటీల తొమ్మిదో రోజు సోమవారం భారత్ ఏకంగా 42 పతకాలు సొంతం చేసుకుంది. ఇందులో 27 స్వర్ణాలు, 12 రజతాలు, 3 కాంస్యాలు ఉన్నాయి. ప్రస్తుతం భారత్ 159 స్వర్ణాలు, 91 రజతాలు, 44 కాంస్యాలతో కలిపి మొత్తం 294 పతకాలతో అగ్రస్థానంలో ఉంది. 195 పతకాలతో (49 స్వర్ణాలు+54 రజతాలు+92 కాంస్యాలు) నేపాల్ రెండో స్థానంలో ఉంది. నేడు క్రీడలకు చివరి రోజు కావడం... ఇంకొన్ని ఈవెంట్స్‌లో భారత్ బరిలో ఉండటంతో మన పతకాల సంఖ్య 300 దాటే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. 2016లో స్వదేశంలో జరిగిన దక్షిణాసియా క్రీడల్లో భారత్ అత్యధికంగా 309 పతకాలు సాధించింది.

సోమవారం టెన్నిస్ సింగిల్స్ ఈవెంట్స్‌లో భారత్ క్లీన్ స్వీప్ చేసింది. మహిళల సింగిల్స్‌లో ఇద్దరు తెలుగమ్మాయిలు సామ సాత్విక, బవిశెట్టి సౌజన్య మధ్య ఫైనల్ జరిగింది. సాత్విక 4–6, 6–2, 6–5తో ఆధిక్యంలో ఉన్న దశలో మోచేతి గాయం కారణంగా సౌజన్య వైదొలిగింది. దాంతో సాత్వికకు స్వర్ణం ఖాయమైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో పసిడి నెగ్గిన సౌజన్య రజతంతో సంతృప్తి పడింది. పురుషుల సింగిల్స్‌లో మనీశ్ సురేశ్ కుమార్ (భారత్) 6–4, 7–6 (8/6)తో భారత్‌కే చెందిన డేవిస్ కప్ జట్టు సభ్యుడు, విశాఖపట్నం ప్లేయర్ సాకేత్ మైనేనిపై గెలిచి బంగారు పతకం దక్కించుకున్నాడు. బాక్సింగ్‌లో భారత్‌కు ఆరు స్వర్ణాలు, ఒక రజతం లభించింది. అంకిత్ ఖటానా (75 కేజీలు), వినోద్ తన్వర్ (49 కేజీలు), సచిన్ సివాచ్ (56 కేజీలు), గౌరవ్ చౌహాన్ (91 కేజీలు), కలైవాని శ్రీనివాసన్ (మహిళల 48 కేజీలు), పర్వీన్ (మహిళల 60 కేజీలు) పసిడి పతకాలు గెలిచారు. మనీశ్ కౌశిక్ (పురుషుల 64 కేజీలు) రజతం గెలిచాడు. మంగళవారం రెజ్లింగ్‌లో గౌరవ్ బలియాన్ (పురుషుల 74 కేజీలు), అనితా షెరాన్ (మహిళల 68 కేజీలు) పసిడి పతకాలు గెలిచారు.



కబడ్డీలో భారత పురుషుల, మహిళల జట్లకే స్వర్ణాలు లభించాయి. పురుషుల ఫైనల్లో భారత్ 51–18తో శ్రీలంకపై, మహిళల జట్టు 50–13తో నేపాల్‌పై గెలిచాయి. భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఫైనల్లో 2–0తో నేపాల్‌పై నెగ్గి వరుసగా మూడోసారి ఈ క్రీడల్లో స్వర్ణం సాధించింది.

### చెన్నైయిన్ 1-1 జంషెడ్‌పూర్

**జంషెడ్‌పూర్:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఆరో సీజన్‌లో భాగంగా సోమవారం చెన్నైయిన్ ఎఫ్‌సీ, జంషెడ్‌పూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. మరో నిమిషంలో ఆట ముగుస్తుందనగా గోల్ చేసిన ఐజాక్ జంషెడ్‌పూర్ జట్టుకు ఓటమి పరాభవాన్ని తప్పించాడు. 25వ నిమిషంలో గోల్ చేసిన వాల్‌స్కీ చెన్నైకి 1–0 ఆధిక్యం అందించాడు. బుధవారం జరిగే మ్యాచ్‌లో ఒడిశాతో హైదరాబాద్ తలపడుతుంది.

### అప్పటి నుంచి టాప్-5లోనే...



రష్యా తొలిసారిగా ఒలింపిక్స్ బరిలో దిగింది 1996లో! అట్లాంటా (అమెరికా) ఆతిథ్యమిచ్చిన సమ్మర్ ఒలింపిక్స్ నుంచి గత 'రియో'లో జరిగిన సమ్మర్ ఒలింపిక్స్ వరకు రష్యా పతకాల పట్టికలో 'టాప్-5'లోనే నిలిచింది. 1996 అట్లాంటాలో 63 పతకాలతో రెండో స్థానంలో... 2000 సిడ్నీలో 89 పతకాలతో రెండో స్థానంలో... 2004 ఏథెన్స్‌లో 90 పతకాలతో మూడో స్థానంలో... 2008 బీజింగ్‌లో 60 పతకాలతో మూడో స్థానంలో... 2012 లండన్‌లో 68 పతకాలతో నాలుగో స్థానంలో... 2016 రియో ఒలింపిక్స్‌లో 56 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. అంతకంటే ముందు సోవియట్ యూనియన్‌లో భాగంగా బరిలోకి దిగింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమయ్యాక తొలిసారి 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌లో 'యూనిఫైడ్ టీమ్'గా పోటీపడింది. ఇక వింటర్ ఒలింపిక్స్‌లోనూ రష్యా ఆధిపత్యాన్ని చాటింది. రెండు సార్లు 1994, 2014లో అగ్రస్థానాన్ని పొందిన రష్యన్ బృందం వాంకోవర్ (2010)లో మినహా ప్రతీసారి టాప్-5లోనే నిలిచింది. వాంకోవర్‌లో మాత్రం 11వ స్థానంతో సరిపెట్టుకుంది.

## స్టాక్‌ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్‌ | నిఫ్టీ |
|---|---|
| 42 ▲ | 16 ▲ |
| 40,487 | 11,937 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్‌ | 8,647 | ▼ | 10 |
| డోజోన్స్‌ | 27,935 | ▼ | 80 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,234 | ▼ | 6 |
| డాక్స్‌ | 13,105 | ▼ | 61 |
| షాంఘై | 2,914 | ▲ | 2 |
| నికాయ్‌ | 23,430 | ▲ | 76 |

అమెరికా ● బ్రిటన్‌ ● జర్మనీ ● చైనా ● జపాన్‌

## ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 70.50 | 72.14 |
| బ్రిటన్‌ పౌండ్‌ | ఎస్‌బీఐ | 92.14 | 95.37 |
| యూరో | ఎస్‌బీఐ | 77.41 | 80.29 |
| జపాన్‌ ఎన్‌ (100) | ఎస్‌బీఐ | 64.47 | 66.89 |
| ఆస్ట్రేలియా డాలర్‌ | ఎస్‌బీఐ | 47.69 | 49.85 |
| సింగపూర్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 51.54 | 53.34 |
| సౌదీ రియాల్‌ | థామస్‌కుక్‌ | 18.15 | 19.76 |
| యూఏఈ దిర్హామ్‌ | థామస్‌కుక్‌ | 18.88 | 19.88 |
| చైనా యువాన్‌ | థామస్‌కుక్‌ | 9.47 | 10.87 |

# రియల్టీ కుబేరులు!

- రూ. 31,960 కోట్ల సంపదతో అగ్ర స్థానంలో లోధా
- టాప్‌ –100 మందిలో 8 మంది మహిళలు
- యువ కుబేరులిద్దరూ హైదరాబాద్‌ నుంచే
- రూ.740 కోట్లతో మై హోమ్‌ రాము, శ్యామ్‌రావులకు జాబితాలో చోటు
- 'హురున్‌– గ్రోహే' ఇండియా–2019 నివేదికలో వెల్లడి


మంగళ్‌ ప్రభాత్‌ లోధా



**హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో:** దేశంలోని రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారుల్లో అత్యంత ధనికుడిగా మాక్రోటెక్‌ డెవలపర్స్‌ (గతంలో లోధా డెవలపర్స్‌) అధినేత మంగళ్‌ ప్రభాత్‌ లోధా నిలిచారు. ఈయన సంపద విలువ రూ.31,960 కోట్లు. దేశంలోని రియల్టీ కుబేరుల్లో లోధా వరుసగా రెండు సార్లు అగ్రస్థానంలో నిలిచినట్లు 'హురున్‌–గ్రోహే' సంస్థలు ఇండియాపై సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నాయి. లోధా ప్రస్తుతం బీజేపీ ముంబై శాఖ అధ్యక్షుడు కూడా. గతేడాదితో పోలిస్తే లోధా కుటుంబ సంపద 18 శాతం వృద్ధి చెందింది. 100 మందితో కూడిన ఈ జాబితాలో మిగతా 99 మంది రియల్టీ టైకూన్స్‌ సంపదలో లోధా కుటుంబ సంపద వాటా 12 శాతంగా ఉన్నట్లు నివేదిక తెలియజేసింది.

**100 మంది సంపద 2,77,080 కోట్లు..**

దేశంలో అగ్రస్థానంలో ఉన్న 100 మంది రియల్టీ టైకూన్స్‌ సంపద విలువ రూ.2,77,080 కోట్లుగా అంచనా. గతేడాదితో పోలిస్తే ఇది 17 శాతం వృద్ధి చెందినట్లు 'హురున్‌– గ్రోహే ఇండియా ద రియల్‌ ఎస్టేట్‌ రిచ్‌ లిస్ట్‌– 2019' నివేదిక తెలియజేసింది. ఈ వంద మంది జాబితాలో 37 మంది ముంబైవాసులే. ఢిల్లీలో 19 మంది, బెంగళూరులో 19 మంది ఉన్నారు. ఈ పారిశ్రామికవేత్తల సగటు వయసు 59 ఏళ్లు. ఆరుగురు మాత్రం 40 ఏళ్ల కంటే తక్కువ వయసున్నవారు. ముగ్గురు 80 ఏళ్లు పైబడిన వారు.

**8 మంది మహిళలకు చోటు..**

ఈ జాబితాలో తొలిసారి 8 మంది మహిళలకు స్థానం దక్కింది. గోద్రెజ్‌ ప్రాపర్టీస్‌ స్మిత వీ క్రిష్ణ మహిళల్లో టాప్‌లో ఉండగా.. మొత్తం జాబితాలో 14వ స్థానంలో నిలిచారు. ఈమె సంపద రూ.3,560 కోట్లు. తర్వాతి స్థానాల్లో డీఎల్‌ఎఫ్‌కు(కమర్షియల్‌) చెందిన రేణుక తల్వార్‌(సంపద రూ.2,590 కోట్లు) పాయ్‌ సింగ్‌ (రూ.2,370 కోట్లు), ఎమ్మార్‌ ఈజీఎఫ్‌ ల్యాండ్‌ శిల్పా గుప్తా (రూ.730 కోట్లు), సూపర్‌టెక్‌ సంగీత అరోరా (రూ.410 కోట్లు), గోపాలన్‌ ఎంటర్‌ప్రైజెస్‌ ఎం వసంత కుమారీ (రూ.310 కోట్లు), వాటికా కమర్షియల్‌ విభాగం కాంచన భల్లా (రూ.300 కోట్లు) నిలిచారు.

## మై హోమ్‌.. యంగ్‌ టైకూన్స్‌


రాములరావు శ్యామ్‌రావు

దేశంలోనే యువ ధనిక రియల్టీ టైకూన్స్‌గా హైదరాబాద్‌లోని మై హోమ్‌ గ్రూప్‌నకు చెందిన జూపల్లి రాములరావు, జూపల్లి శ్యామ్‌రావు చోటు దక్కించుకున్నారు. వీళ్ల వయస్సు 33 ఏళ్లు. వీరి సంపద విలువ రూ.740 కోట్లు. ఈస్ట్‌ ఇండియా హోటల్స్‌కు చెందిన పృథ్వీరాజ్‌ సింగ్‌ ఒబెరాయ్‌... వృద్ధ రియల్టీ టైకూన్‌గా నిలిచారు. ఈయన వయస్సు 90 ఏళ్లు. ఈయన సంపద రూ.3,670 కోట్లు.

## టాప్‌-10 రియల్టీ టైకూన్స్‌ వీరే..

| కంపెనీ | పేరు | సంపద (రూ.కోట్లలో) |
|---|---|---|
| మాక్రోటెక్‌ డెవలపర్స్‌ | ఎంపీ లోధా | 31,960 |
| డీఎల్‌ఎఫ్‌ | రాజీవ్‌ సింగ్‌ | 25,080 |
| ఎంబసీ గ్రూప్‌ | జితేంద్ర విర్వాణీ | 24,750 |
| హిరానందానీ గ్రూప్‌ | నిరంజన్‌ హిరానందానీ | 17,030 |
| కె రహేజా గ్రూప్‌ | చంద్రు రహేజా | 15,480 |
| ఒబెరాయ్‌ రియల్టీ | వికాస్‌ ఒబెరాయ్‌ | 13,910 |
| బాగ్మనీ డెవలపర్స్‌ | రాజా బాగ్మనీ | 9,960 |
| హిరానందానీ సింగపూర్‌ | సురేంద్ర హిరానందానీ | 9,720 |
| రున్‌వాల్‌ డెవలపర్స్‌ | సుభాష్‌ రున్‌వాల్‌ | 7,100 |
| పిరమల్‌ రియల్టీ | అజయ్‌ పిరమల్‌ | 6,560 |

# తగ్గిన ఎస్‌బీఐ రుణ రేటు



**ముంబై:** స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ)... ఏడాది కాల వ్యవధి ఉండే రుణాలపై వడ్డీ రేటును స్వల్పంగా తగ్గించింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్‌ఆర్‌) రుణ రేటు 10 బేసిస్‌ పాయింట్లు (100 బేసిస్‌ పాయింట్లు ఒక శాతం) తగ్గించినట్లు ఎస్‌బీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళవారం నుంచీ తాజా రేటు అమల్లోకి వస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బ్యాంక్‌ ఎంసీఎల్‌ఆర్‌ తగ్గడం ఇది వరుసగా ఎనిమిదవసారి. తాజా తగ్గింపుతో ఏడాది కాల ఎంసీఎల్‌ఆర్‌ 8% నుంచి 7.90%కి దిగివచ్చింది. తన గతవారం పాలసీ సమీక్షలో ఆర్‌బీఐ ఎటువంటి రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 5.15%) తగ్గింపు నిర్ణయం తీసుకోని నేపథ్యంలో ఎస్‌బీఐ తాజా రుణరేటు కోత ప్రాధాన్యత సంతరించుకుంది.

**బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా 20 బేసిస్‌ పాయింట్లు**

బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా కూడా ఎంసీఎల్‌ఆర్‌ను 20 బేసిస్‌ పాయింట్ల వరకూ తగ్గించింది. ఓవర్‌నైట్‌ రుణ రేటు 20 బేసిస్‌ పాయింట్లు తగ్గింది. దీనితో ఈ రేటు 7.75%కి దిగివచ్చింది. ఇతర కాలపరిమితి రేట్లు 10 బేసిస్‌ పాయింట్లు తగ్గాయి. ఏడాది ఎంసీఎల్‌ఆర్‌ 8.30% నుంచి 8.20%కి చేరింది.ర

## జనవరి నుంచి హీరో బైక్స్‌ ధరల పెంపు



**న్యూఢిల్లీ:** ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్‌ జనవరి నుంచి మోటార్‌ సైకిల్స్, స్కూటర్ల ధరలను రూ.2 వేల వరకు పెంచనుంది. ప్రస్తుతం హీరో కార్ప్‌ వాహనాల ధరల శ్రేణి రూ.39 వేల నుంచి రూ.1.05 లక్షల మధ్య ఉన్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఇప్పటికే మారుతీ సుజుకీ ఇండియా, టొయోటా, మహీంద్రా అండ్‌ మహీంద్రా, మెర్సిడెస్‌ బెంజ్‌ కార్ల కంపెనీలు ధరలు పెంచుతున్నట్లు ప్రకటించడం తెలిసిందే.

## యమహా 'వైజెడ్‌ఎఫ్‌-ఆర్‌15' వెర్షన్‌ 3.0

### ప్రారంభ ధర రూ. 1.45 లక్షలు



**న్యూఢిల్లీ:** ఇండియా యమహా మోటార్‌ (ఐవైఎం).. 'వైజెడ్‌ఎఫ్‌–ఆర్‌15' వెర్షన్‌ 3.0 పేరిట కొత్త స్పోర్ట్స్‌ బైక్‌ను సోమవారం విడుదలచేసింది. భారత్‌ స్టేజ్‌ (బీఎస్‌)–6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఈ బైక్‌ ధరల శ్రేణి రూ. 1.45 లక్షల నుంచి రూ. 1.47 లక్షలుగా ప్రకటించింది. ఈనెల 3వ వా రం నుంచి కస్టమర్లకు ఈ బైక్‌ అందుబాటులో ఉండనుందని వెల్లడించింది.

## షిప్‌ రీసైక్లింగ్‌లో 60% వాటా లక్ష్యం



**న్యూఢిల్లీ:** నౌకల రీసైక్లింగ్‌లో అంతర్జాతీయంగా భారత్‌ తన వాటాను 60 శాతానికి పెంచుకోవాలని అనుకుంటున్నట్టు కేంద్ర మంత్రి మన్‌సుఖ్‌ లాల్‌ మాండవీయ సోమవారం తెలిపారు. నౌకల రీసైక్లింగ్‌కు సంబంధించి చట్టం ఆమోదం పొందితే జీడీపీలో ఈ వ్యాపార వాటా రెట్టింపు 2.2 బిలియన్‌ డాలర్లకు చేరుతుందన్నారు. ఉపాధి అవకాశాలు కూడా రెట్టింపై 90,000గా ఉంటాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నౌకల రీసైక్లింగ్‌ వ్యాపార నిర్వహణకు వీలు కల్పించే 'రీసైక్లింగ్‌ ఆఫ్‌ షిప్స్‌ బిల్‌ 2019'కు పార్లమెంటు ఆమోదం తెలిపింది.

## అక్టోబర్‌-మార్చి మధ్య ఉపాధిలో 7 శాతం వృద్ధి: టీమ్‌లీజ్‌

### హైదరాబాద్‌లో సానుకూల నియామక సెంటిమెంట్‌




**న్యూఢిల్లీ:** దేశంలో ఉపాధి కల్పన ఈ ఏడాది అక్టోబర్‌ నుంచి వచ్చే ఏడాది మార్చి మధ్య 7.12% వృద్ధి చెందొచ్చని టీమ్‌లీజ్‌ తన ద్వైవార్షిక ఎంప్లాయిమెంట్‌ అవుట్‌లుక్‌ హెచ్‌వై2–2019నివేదికలో పేర్కొంది. ఆర్థిక మందగమన పరిస్థితులు ఉపాధి అవకాశాలను దెబ్బతీసినట్టు ఈ సంస్థ తెలిపింది. హెల్త్‌కేర్, ఫార్మా, ఐటీ, ఈ కామర్స్, టెక్‌ స్టార్టప్‌లు, విద్యా సేవలు, కేపీవో, విద్యుత్, ఇంధనం, లాజిస్టిక్స్‌ రంగాలు అక్టోబర్‌–మార్చి మధ్య ఉద్యోగ నియామకాల పట్ల సానుకూలతను వ్యక్తం చేయగా, తయారీ, ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నిర్మాణం, రియల్‌ ఎస్టేట్, ఆర్థిక సేవలు, రిటైల్, బీపీఈవో/ఐటీఈఎస్, టెలికం, పర్యాటకం, ఆతిథ్యం, ఎఫ్‌ఎంసీజీ, వ్యవసాయం, ఆగ్రోకెమికల్స్‌ రంగాల్లో ఉపాధి కల్పన తగ్గొచ్చన్న అభిప్రాయం వ్యక్తమైంది. అక్టోబర్‌–మార్చి మధ్య లాజిస్టిక్స్, ఎడ్యుకేషనల్‌ సర్వీసెస్‌ రంగాలే 14.36 శాతం మేర ఉపాధి కల్పించనున్నట్టు టీమ్‌లీజ్‌ నివేదిక వెల్లడించింది. హైదరాబాద్, పుణే, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, గురుగ్రామ్, కోల్‌కతా పట్టణాల్లో ఉపాధి పరంగా సానుకూల సెంటిమెంట్‌ నెలకొందని తెలిపింది.

# మిల్లుకు షుగరొచ్చింది!!



**భారీగా పేరుకుపోతున్న చక్కెర నిల్వలు**

- ఇప్పటికే గోదాముల్లో 140 లక్షల టన్నులు
- దీనికి తోడవనున్న తాజా 268 లక్షల టన్నులు
- డిమాండ్‌ను మించిపోయిన సరఫరా
- నష్టాల్లో కంపెనీలు; కొన్ని మూసివేత!

**హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో:** వినియోగంతో పోలిస్తే ఉత్పత్తి మించిపోవటంతో దేశంలో చక్కెర నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్‌ 1 నాటికి భారత్‌లో 140 లక్షల టన్నుల చక్కెర నిల్వలున్నాయి. 2019 అక్టోబర్‌–2020 సెప్టెంబరులో (ప్రస్తుత సీజన్లో) 268.5 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి కానుంది. వినియోగం ప్రస్తుతం ఏటా 250 లక్షల టన్నులే ఉంటోంది. వాస్తవానికి ప్రస్తుత సీజన్లో 282 లక్షల టన్నులు వస్తు ందని ఇండియన్‌ షుగర్‌ మిల్స్‌ అసోసియేషన్‌ గతంలో అంచనా వేసింది. వర్షాలు అతిగా పడడంతో చెరకు పంట పాడైంది. దీంతో అంచనాల కంటే దిగుబడి తగ్గింది. అయినప్పటికీ చక్కెర నిల్వలు మాత్రం తగ్గే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు. మరోవైపు భారత్‌ నుంచి పంచదార ఎగుమతులు గత సీజన్లో 40–44 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. కాకపోతే ఎగుమతి ప్రోత్సాహకాల తాలూకు బకాయిలు ఏడాదిగా నిలిచిపోయాయి. దీంతో ఈ ఏడాది ఎగుమతులపై కంపెనీలు ఆసక్తి చూప డం లేదు. 2018–19 సీజన్లో భారత్‌లో రికార్డు స్థాయిలో 332 లక్షల టన్నుల పంచదార ఉత్పత్తి అయింది.

**బస్తాకు రూ.700–900 నష్టం..**

పంచదార ఉత్పత్తి వ్యయం కిలోకు ఉత్తరాదిన రూ.36, దక్షిణాదిన రూ.38–40 అవుతోంది. దక్షిణాది రాష్ట్రాల్లో మిల్లు వద్ద విక్రయ ధర ప్రస్తుతం కిలోకు రూ.31– 32 ఉంది. తయారీ వ్యయం కంటే అమ్మకం ధర తక్కువ. ఉత్తరాదితో పోలిస్తే కూలీలకు అయ్యే వ్యయం ఇక్కడ మూడు రెట్లు ఎక్కువ. కంపెనీలకు 100 కిలోల బస్తాపై రూ.700–900 నష్టం వాటిల్లుతోందని కేసీపీ షుగర్, ఇండస్ట్రీస్‌ కార్పొరేషన్‌ చీఫ్‌ ఆపరేటింగ్‌ ఆఫీసర్‌ జి.వెంకటేశ్వర రావు సాక్షి బిజినెస్‌ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒకటిరెండు మిల్లులు మినహా దేశంలోని అన్ని కంపెనీలూ నష్టాలతో నడుస్తున్నాయని వెల్లడించారు. అప్పులు కట్టడానికి కంపెనీలకున్న ఆస్తులు సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగుమతి ప్రోత్సాహకాలు తెలుగు రాష్ట్రాల్లోని కంపెనీలకు రూ.150 కోట్లకు పైగా రావాలని ఆయన గుర్తు చేశారు.

**మూతపడుతున్న కంపెనీలు..**

నష్టాలు మూటగట్టుకోవడంతో తెలుగు రాష్ట్రాల్లోని కంపెనీలు తమ ఫ్యాక్టరీలను ఒకదాని వెంట ఒకటి మూసివేస్తున్నాయి. గతేడాది కృష్ణా జిల్లాలో డెల్టా షుగర్స్‌ యూనిట్, నెల్లూరులో ఎంపీ షుగర్స్, చిత్తూరులో వాణి షుగర్స్‌ మూతపడ్డాయి. ఈ ఏడాది గోదావరి జిల్లాలో సర్వరాయ షుగర్‌ గేట్లు కూడా మూసుకున్నాయి. ఇదే గోదావరి జిల్లాలో నవభారత్‌ గ్రూప్‌ ఫ్యాక్టరీలో 2020–21 సీజన్లో ఉత్పత్తిని నిలిపివేయనున్నట్టు ప్రకటించింది. ఇక కృష్ణా జిల్లా లక్ష్మీపురం యూనిట్లో కేసీపీ షుగర్, ఇండస్ట్రీస్‌ కార్పొరేషన్‌ కొద్ది రోజుల క్రితం లే ఆఫ్‌ ప్రకటించింది. మరిన్ని ఫ్యాక్టరీలు మూసివేతకు సిద్ధంగా ఉన్నట్టు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అటు రైతులకు కంపెనీలు చెల్లించాల్సిన బకాయిలు ఈ ఏడాది మార్చిలో రూ.85,000 కోట్లుండగా ప్రస్తుతం రూ. 15,000 కోట్లకు పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ బకాయిలు రూ.150 కోట్లు ఉంటాయని తెలిసింది.

## పవర్‌ ఆఫ్‌ అటార్నీ ఇచ్చే ముందు జాగ్రత్త

**ఇన్వెస్టర్లకు ఎన్‌ఎస్‌ఈ సూచన**




**న్యూఢిల్లీ:** స్టాక్‌ బ్రోకర్లతో ఇన్వెస్టర్లు పవర్‌ ఆఫ్‌ అటార్నీ (పీవోఏ) ఒప్పందం కుదుర్చుకునే విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్‌ఎస్‌ఈ హెచ్చరించింది. కార్వీ స్టాక్‌ బ్రోకింగ్‌ సంస్థ రూ.2,300 కోట్ల విలువైన తమ క్లయింట్ల సెక్యూరిటీలను తన ఖాతాలోకి మళ్లించి, వాటిపై రుణాలు పొందిన విషయం తెలిసిందే. ఈ విషయంలో కార్వీ క్లయింట్ల పీవోఏను దుర్వినియోగం చేసినట్టు సెబీ తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎన్‌ఎస్‌ఈ సోమవారం ఓ ప్రకటనలో సూచనలు చేసింది.

- ఇన్వెస్టర్లు తమ తరఫున బ్రోకర్లు నిర్వహించాల్సిన హక్కులను పీవోఏలో స్పష్టంగా పేర్కొనాలి. అవి ఎప్పటి వరకు చెల్లుబాటయ్యేది కూడా ఒప్పందంలో ఉండేలా చూసుకోవాలి.
- పీవోఏకు ప్రత్యామ్నాయంగా ఆన్‌లైన్‌లో సెక్యూరిటీలను డెలివరీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలి. సెబీ, స్టాక్‌ ఎక్స్ఛేంజ్‌ నిబంధనల ప్రకారం పీవోఏ అన్నది తప్పనిసరేమీ కాదు.
- ట్రేడ్‌ కాంట్రాక్టు 24 గంటల్లోపు ఇన్వెస్టర్లకు అందాలి. అదే విధంగా అకౌంట్‌ స్టేట్‌మెంట్‌ ప్రతి మూడు నెలలకూ ఓ సారి తప్పకుండా వచ్చేలా చూసుకోవాలి.
- బ్రోకర్‌ వద్ద మార్జిన్‌ కోసం ఉంచిన సెక్యూరిటీలను తనఖా పెట్టి నిధులు పొందేందుకు అనుమతించకూడదు.
- నిధులు, సెక్యూరిటీలను బ్రోకర్‌ వద్దే ఉంచేయకుండా సకాలంలో తెప్పించుకోవాలి.
- ట్రేడింగ్, డీమ్యాట్‌ ఖాతాల్లోకి క్రమం తప్పకుండా లాగిన్‌ అయి, బ్యాలన్స్‌ను తనిఖీ చేసుకోవాలి. డిపాజిటరీల నుంచి వచ్చే స్టేట్‌మెంట్‌లు, స్టాక్‌ ఎక్స్ఛేంజ్‌ల నుంచి నిధులు, సెక్యూరిటీలకు సంబంధించి వచ్చే ఎస్‌ఎంఎస్‌లను కూడా పరిశీలించుకోవాలి. ఏవైనా వ్యత్యాసాలను గమనిస్తే వెంటనే ఆ విషయాన్ని బ్రోకర్లకు తెలియజేయాలి.
- స్టాక్‌ బ్రోకర్‌ వద్ద తమ మొబైల్‌ నంబర్, ఈ–మెయిల్‌ ఐడీకి సంబంధించి తాజా వివరాలు ఉండేలా చూసుకోవాలని కూడా ఇన్వెస్టర్లను ఎన్‌ఎస్‌ఈ కోరింది.

## కాఫీడే టెక్‌ పార్క్‌ విక్రయానికి యస్‌ బ్యాంకు బ్రేక్‌!




**బెంగళూరు:** కాఫీడే ఎంటర్‌ప్రైజెస్‌ బెంగళూరులో తనకున్న టెక్నాలజీ పార్క్‌ను బ్లాక్‌స్టోన్‌ గ్రూపునకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకోగా, దీనికి యస్‌ బ్యాంకు ఆమోదం చెప్పకపోవడంతో నిలిచిపోయినట్టు సమాచారం. కాఫీ డే గ్రూపునకు రుణాలిచ్చిన సంస్థల్లో యస్‌ బ్యాంకు కూడా ఒకటి. ఈ ఒప్పందానికి యస్‌ బ్యాంకు ఇప్పటి వరకు నిరభ్యంతర సర్టిఫికెట్‌ ఇవ్వలేదని ఈ వ్యవహారం గురించి తెలిసిన వర్గాలు చెప్పాయి. కాఫీ డే తీసుకున్న ఇతర రుణాల తాలూకు చెల్లింపులపై హామీ ఇవ్వాలని యస్‌ బ్యాంకు కోరినట్లు తెలిసింది. ఇతర రుణదాతలంతా ఇప్పటికే కాఫీడే టెక్‌ పార్క్‌– బ్లాక్‌స్టోన్‌ ఒప్పందానికి ఆమోదం తెలిపారని, యస్‌ బ్యాంకు మాత్రమే ఆమోదం తెలపాల్సి ఉందని ఆ వర్గాలు వెల్లడించాయి. కాఫీ డేకు చెందిన ట్యాంగ్లిన్‌ డెవలప్‌మెంట్స్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో బెంగళూరులో గ్లోబల్‌ విలేజ్‌ టెక్‌ పార్క్‌ నడుస్తోంది. ఈ కంపెనీ యస్‌ బ్యాంకుకు రూ.100 కోట్లు బకాయి పడింది. కాఫీ డే కూడా యస్‌ బ్యాంకుకు రూ.1,400 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ ఆకస్మిక ఆత్మహత్య తర్వాత కంపెనీ యాజమాన్యం ఆస్తుల విక్రయం ద్వారా అప్పులు చెల్లించే ప్రయత్నాలు మొదలెట్టింది. ఇందులో భాగంగా గ్లోబల్‌ విలేజ్‌ టెక్‌ పార్క్‌ను బ్లాక్‌స్టోన్‌కు రూ.2,600–3,000 కోట్ల విలువకు విక్రయించేందుకు నాన్‌ బైండింగ్‌ ఒప్పందం చేసుకుంది. తాజా పరిణామాలతో బీఎస్‌ఈలో కాఫీడే షేరు సోమవారం 9 శాతం నష్టంతో రూ.43.85 వద్ద క్లోజయింది.

# ఈక్విటీ ఫండ్స్‌లోకి తగ్గిన పెట్టుబడులు

- నవంబర్‌లో ఫండ్స్‌లోకి నికరంగా రూ.54 వేల కోట్లు
- ఇందులో ఈక్విటీ పథకాల్లోకి రూ.933 కోట్లే
- క్రెడిట్‌ రిస్క్‌ ఫండ్స్‌కు అమ్మకాల ఒత్తిడి
- మారిన లిక్విడ్‌ ఫండ్స్‌ ముఖచిత్రం
- రూ.27.04 లక్షల కోట్లకు నిర్వహణ ఆస్తులు

**న్యూఢిల్లీ:** ఈక్విటీ మ్యూచువల్‌ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక ఈ ఏడాది నవంబర్‌ మాసంలో గణనీయంగా తగ్గిపోయింది. నికరంగా రూ.933 కోట్లు మాత్రమే ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చినట్టు మ్యూచువల్‌ ఫండ్స్‌ అసోసియేషన్‌ 'యాంఫి' తెలియజేసింది. నెలవారీగా చూసుకుంటే ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక 85 శాతం మేర తగ్గిపోయింది. 2016 జూన్‌ తర్వాత ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడులు ఈ స్థాయిలో తగ్గిపోవడం ఇదే తొలిసారి. అంతేకాదు, ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడుల ప్రవాహం వరుసగా మూడో నెలలోనూ తగ్గినట్టయింది. ఏవో కొన్ని ఎంపిక చేసిన స్టాక్స్‌ మినహా మిగిలిన స్టాక్స్‌ పనితీరు గత ఏడాది కాలంలో ఆశాజనకంగా లేకపోవడం ఫండ్స్‌ రాబడులపై ప్రభావం చూపించింది. ఇది పెట్టుబడులపైనా ప్రతిఫలించింది. మరోవైపు క్రెడిట్‌ రిస్క్‌ ఫండ్స్‌ నుంచి పెట్టుబడులు గణనీయంగా బయటకు వెళ్లిపోతున్నాయి. గత నెల చివరి నాటికి మ్యూచువల్‌ ఫండ్స్‌ నిర్వహణ ఆస్తులు రూ.27.04 లక్షల కోట్లకు పెరిగాయి. అక్టోబర్‌ చివరికి ఉన్న రూ.26.33 లక్షల కోట్లతో పోల్చుకుంటే 3 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం మీద ఫండ్స్‌ పథకాల్లోకి అక్టోబర్‌లో రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే, అది నవంబర్‌లో రూ.54,419 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా డెట్‌ ఫండ్స్‌లోకి రూ.51,000 కోట్ల పెట్టుబడులు రావడం వృద్ధికి దోహదపడింది.

**'క్రెడిట్‌ రిస్క్‌' సంక్షోభం!**

దేశీయ మ్యూచువల్‌ ఫండ్స్‌ పరిశ్రమలో మొత్తం 44 సంస్థలు (ఏఎంసీలు) కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, వీటి పరిధిలోని క్రెడిట్‌ రిస్క్‌ ఫండ్స్‌ నుంచి నవంబర్‌లో నికరంగా రూ.1,899 కోట్లను ఇన్వెస్టర్లు వెనక్కి తీసేసుకున్నారు. అంతక్రితం మాసం నాటి గణాంకాలతో పోలిస్తే పెట్టుబడుల ఉపసంహరణ 37.4 శాతం పెరిగింది. గతేడాది జూలై నుంచి క్రెడిట్‌ రిస్క్‌ ఫండ్స్‌కు అమ్మకాల ఒత్తిడి కొనసాగుతూనే ఉంది. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌ సంక్షోభం, ఆ తర్వాత డీహెచ్‌ఎఫ్‌ఎల్‌ తదితర సంస్థలు రుణ పత్రాలపై చెల్లింపుల్లో విఫలం కావడం, వీటిల్లో ఇన్వెస్ట్‌ చేసిన క్రెడిట్‌ రిస్క్‌ ఫండ్స్‌ రాబడులు దెబ్బతినడం ఈ పరిణామాలకు కారణంగా కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌ నాటికి క్రెడిట్‌ రిస్క్‌ ఫండ్స్‌ నిర్వహణలో రూ.79,643 కోట్ల పెట్టుబడులు ఉండగా, నవంబర్‌ చివరికి అవి రూ.63,754 కోట్లకు తగ్గాయి. ఇది 20% క్షీణత.

**లాభాల స్వీకరణే..**



ఈక్విటీ పథకాల్లో నికర పెట్టుబడుల రాక గణనీయంగా తగ్గడానికి ఒకింత ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణే కారణం. అయితే, మ్యూచువల్‌ ఫండ్స్‌ పరిశ్రమ నిర్వహణ ఆస్తులు మాత్రం మొత్తం మీద రూ.27 లక్షల కోట్లకు వృద్ధి చెందాయి. రిటైల్‌ ఇన్వెస్టర్ల నుంచి దీర్ఘకాల లక్ష్యాల కోసం ఉద్దేశించిన సిప్‌ పెట్టుబడులు క్రమంగా వృద్ధి చెందుతూ నూతన గరిష్ట స్థాయి రూ.3.12 లక్షల కోట్లకు చేరాయి.

*– ఎన్‌ఎస్‌ వెంకటేశ్, యాంఫి సీఈవో*




**లిక్విడ్‌ ఫండ్స్‌కూ నిరాదరణ...**

డెట్‌ విభాగంలో లిక్విడ్‌ ఫండ్స్‌కూ నిరాదరణ ఎదురైంది. అక్టోబర్లో లిక్విడ్‌ ఫండ్స్‌ విభాగంలోకి వచ్చిన పెట్టుబడులు రూ.93,203 కోట్లుగా ఉంటే, నవంబర్‌లో రూ.6,938 కోట్లకు తగ్గిపోయాయి. ఎగ్జిట్‌ లోడ్‌ విధించడం వల్ల కొందరు ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఓవర్‌నైట్‌ ఫండ్స్‌కు మళ్లించి ఉంటారని యాంఫి సీఈవో వెంకటేశ్‌ అభిప్రాయపడ్డారు.

**ఇతర ఫండ్స్‌లోకి...**

- ఈక్విటీ ఎక్స్ఛేంజ్‌ ట్రేడెడ్‌ ఫండ్స్‌ (ఈటీఎఫ్‌) పథకాల్లోకి నవంబర్‌లో నికరంగా రూ.2,954 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతక్రితం అక్టోబర్‌లో వచ్చిన పెట్టుబడులు రూ.5,906 కోట్లతో పోలిస్తే సగం మేర తగ్గాయి.
- ఓపెన్‌ ఎండెడ్‌ ఈక్విటీ పథకాల్లోకి రూ.1,312 కోట్ల పెట్టుబడులు రాగా, రూ.379 కోట్ల పెట్టుబడులు బయటకు వెళ్లాయి. దీంతో నికర పెట్టుబడులు రూ.933 కోట్లుగా నమోదయ్యాయి.
- డెట్‌ విభాగంలో ఓవర్‌నైట్‌ ఫండ్స్‌ (ఒక్క రోజు కాల వ్యవధి సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్‌ చేసేవి)లోకి రూ.20,650 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. లిక్విడ్‌ ఫండ్స్‌కు ఎగ్జిట్‌ లోడ్‌ విధించడం వీటికి కలిసొచ్చింది.
- బ్యాంకింగ్‌–పీఎస్‌యూ ఫండ్స్‌లోకి 7,230 కోట్లు వచ్చాయి.
- గోల్డ్‌ ఈటీఎఫ్‌ల్లోకి నికరంగా రూ.7 కోట్లు వచ్చాయి. అంతక్రితం నెలలో రూ.31.45 కోట్లు బయటకు వెళ్లిపోయాయి.

## పెట్టుబడుల వృద్ధికే కార్పొరేట్‌ పన్ను కోత: సీఈఏ



**న్యూఢిల్లీ:** పెట్టుబడులు పుంజుకోవడమే లక్ష్యంగా కార్పొరేట్‌ పన్ను తగ్గింపు నిర్ణయాన్ని కేంద్రం తీసుకున్నట్లు ప్రధాన ఆర్థిక సలహాదారు కేవీ సుబ్రమణియన్‌ చెప్పారు. సోమవారమిక్కడ జరిగిన ఫిక్కీ యంగ్‌ లీడర్స్‌ సదస్సులో సుబ్రమణియన్‌ మాట్లాడుతూ... ఆర్థిక వృద్ధిలో ప్రైవేటు పెట్టుబడులు ఎంతో కీలకమైనవన్నారు. కార్పొరేట్‌ పన్ను రేటును 30% నుంచి 22%కి, కొన్ని కొత్త తయారీ సంస్థలకు 25 శాతం నుంచి 15 శాతానికి కేంద్రం సెప్టెంబర్‌లో తగ్గించడం తెలిసిందే. దీని ప్రకారం ఈ ఏడాది అక్టోబర్‌ తర్వాత ప్రారంభించి 2023 నాటికి కార్యకలాపాలు ప్రారంభించే కొత్త తయారీ రంగ కంపెనీలకు కనిష్టంగా 15% రేటు వర్తిస్తుంది. ఇందుకు సంబంధించిట్యాక్సేషన్‌ చట్ట సవరణ బిల్లు– 2019కు ఇటీవలే పార్లమెంటు ఆమోద ముద్ర కూడా పడింది. దీని ప్రకారం కొన్ని సంస్థలను నెగిటివ్‌ జాబితాలో ఉంచారు. ఈ జాబితాలో ఉంచిన సంస్థలు తయారీ రంగం పరిధిలోనికి రావని, వీటికి కనిష్ట 15 శాతం బేస్‌ రేటు వర్తించదని కేంద్రం స్పష్టం చేసింది.

## క్లుప్తంగా...

### 14, 15 తేదీల్లో 'బర్డ్ వాక్ ఫెస్టివల్'

**సాక్షి, హైదరాబాద్:** పచ్చని చెట్లు, సెలయేళ్లతో కూడిన అందమైన ప్రకృతి ఒడిలో పక్షుల కిల కిలా రావాలు విని సేద తీరేందుకు, రాష్ట్రంలోనే తొలిసారిగా వివిధ రకాల, అరుదైన పక్షులు, పిట్టల వీక్షణకు 'బర్డ్ వాక్ ఫెస్టివల్'ను నిర్వహిస్తున్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కాగజ్‌నగర్ డివిజన్ బెజ్జూరు, పెంచికల్‌పేట్, తిర్యానీ అటవీ ప్రాంతాల్లో, గుండాల రేంజ్‌లో బర్డ్ వాక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు కొమురం భీం ప్రాజెక్టు రిజర్వాయర్, సిర్పూర్ (టీ)లోని చెరువు తదితరాలను సందర్శించేలా కార్యక్రమాలు రూపొందించారు.

### ఈ నెలాఖరు దాకా వరికి బీమా గడువు

**రైతులు ఎకరానికి కేవలం రూ. 510 చెల్లిస్తే చాలు**

**సాక్షి, హైదరాబాద్:** రబీ వరికి బీమా గడువు ఈ నెలాఖరుకు ముగియనుంది. రైతులు వెంటనే పంటల బీమా పథకంలో ప్రీమియం చెల్లించాలని వ్యవసాయశాఖ సూచించింది. ఈ మేరకు సోమవారం జిల్లాలకు ఉత్తర్వులు జారీచేసింది. వరికి ఎకరానికి రూ.510 చెల్లించాలని పేర్కొంది. ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే రబీ ప్రీమియం తక్కువగా ఉంది. ఖరీఫ్ సీజన్‌లో ఆహార, నూనె గింజల పంటలన్నింటికి రైతు వాటా కింద 2 శాతం ప్రీమియం చెల్లిస్తే, రబీలో 1.5 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. వార్షిక, వాణిజ్య, ఉద్యాన పంటలకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం ఖరీఫ్, రబీ సీజన్లలో 5 శాతం ఉంటుంది. అయితే ఇందులో 1.5 శాతం మాత్రమే రైతు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 3.5 శాతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. ఈ పథకాన్ని ప్రాంతాలవారీగా, ప్రతి జిల్లాలో ఒక ప్రధాన పంటకు గ్రామం యూనిట్‌గా తీసుకుని అమలుచేస్తున్నారు. మిర్చి పంటకు మాత్రం రైతు వాటా 5 శాతం, ఉల్లిగడ్డకు నిజామాబాద్‌లో 3.5 శాతం, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 5 శాతం చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

### బీచుపల్లి వద్ద ఆధునిక రైతు మార్కెట్: మంత్రి నిరంజన్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి కర్నూలు జాతీయ రహదారిపై బీచుపల్లి వద్ద రెండెకరాలలో 'వే-సైడ్'మార్కెట్ (ఆధునిక రైతు మార్కెట్)ను ఏర్పాటు చేయనున్నామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. దీని కోసం తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు చెందిన 2 ఎకరాలను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అవసరమైన భూ కేటాయింపుపై తగిన చర్యలు తీసుకోవాలని జోగుళాంబ-గద్వాల జిల్లా కలెక్టర్‌కు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. మరుగుదొడ్ల వసతులతో కూడిన ఆ మార్కెట్‌కు మంత్రి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నారు. ఎంపిక చేసిన రైతులు వారు స్వయంగా పండించిన కూరగాయలను ఆ మార్కెట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

### అమెరికా బృందంతో సింగరేణి సీఎండీ శ్రీధర్ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** లాంగ్ వాల్, సర్ఫేస్ మైనర్, ఇన్‌పిట్ క్రషర్ అండ్ కన్వేయర్ వంటి పర్యావరణహిత మైనింగ్ పద్ధతులతో బొగ్గు ఉత్పత్తి చేస్తున్నామని సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ తెలిపారు. క్లీన్ కోల్ సరఫరా కోసం కోల్ వాషరీలను, వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఓవర్ బర్డెన్ నుంచి ఇసుక తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కాలుష్య కారకాంశాలపై ప్రభుత్వ సంస్థల ద్వారా శాస్త్రీయ విశ్లేషణ, పర్యవేక్షణలను నిరంతరంగా చేపడుతున్నామని, వాటికనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సోమవారం ఇక్కడ తనను కలిసిన అమెరికన్ రీజనల్ ఎన్విరాన్‌మెంట్ అధికారుల బృందంతో ఆయన సమావేశమై పర్యావరణ పరిరక్షణకు సంస్థ తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఓపెన్ కాస్ట్ మైనింగ్ విధానంలో రిక్లేమేషన్ (మైనింగ్ తర్వాత యథాపూర్వస్థితికి తీసుకువచ్చే) పద్ధతులు, ఒ.బి.డంపులపై పెంచుతున్న కృత్రిమ వనాలు, ప్రతి ఏడాది హరితహారం ద్వారా మొక్కలు నాటడం వంటి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ఉత్తరాదినే ఉల్లంఘనం

- మానవ హక్కుల ఉల్లంఘనలు ఉత్తరాది రాష్ట్రాల్లోనే అధికం
- టాప్-5లో యూపీ, ఒడిశా, ఢిల్లీ, హరియాణా, బిహార్
- తెలంగాణకు 17వ స్థానం.. ఎన్‌హెచ్‌ఆర్సీ(2016-17) నివేదిక




సాక్షి, హైదరాబాద్

దేశవ్యాప్తంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)లో నమోదవుతున్న కేసుల్లో ఉత్తరాది రాష్ట్రాలవే ఎక్కువగా ఉన్నాయి. దక్షిణ, ఈశాన్య రాష్ట్రాలతో పోలిస్తే.. ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లోనే ఈ తరహా ఘటనలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. ఎన్‌హెచ్‌ఆర్సీ 2016-17కు సంబంధించి నివేదికను బట్టి ఈ విషయాలు స్పష్టమవుతున్నాయి. మానవహక్కుల ఉల్లంఘన జరిగిన సందర్భంలో ఎన్‌హెచ్‌ఆర్సీ రంగంలోకి దిగుతుంది. కొన్ని సందర్భాల్లో బాధితులు నేరుగా ఫిర్యాదు చేస్తారు. మరికొన్నిసార్లు దినపత్రికలు, చానళ్లలోచూసి ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది.

**యూపీ టాప్.. తెలంగాణది 17వ స్థానం!**

దేశంలో మానవహక్కుల ఉల్లంఘనపై ఏటా అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఎన్‌హెచ్‌ఆర్సీ కేసులు నమోదు చేసి విచారణ చేపడుతుంటుంది. ఇందులో అత్యధికంగా వచ్చే ఫిర్యాదులు ఉత్తరప్రదేశ్ నుంచే కావడం గమనార్హం. ఏటా దేశవ్యాప్తంగా 90 వేలకు పైగా కేసులు నమోదవుతుండగా.. ఒక్క యూపీ నుంచే 30 నుంచి 40 వేల వరకు ఫిర్యాదులు వస్తున్నాయి. అందులో ఎన్‌కౌంటర్లకు సంబంధించినవే వేల సంఖ్యలో ఉంటాయంటే అతిశయోక్తి కాదు. ఎన్‌హెచ్‌ఆర్సీ విడుదల చేసిన నివేదిక 2016-17 పేర్కొన్న అంశాల ప్రకారం.. 42,590 కేసుల నమోదుతో యూపీ తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో ఒడిశా 8,750, ఢిల్లీ 6,368, హరియాణా 4,596, బిహార్ 3,765 ఉన్నాయి. 928 కేసులతో తెలంగాణ 17వ స్థానం, 1,250 కేసులతో ఏపీ 10వ స్థానంలో నిలిచింది. కాగా 2017 నుంచి ఇప్పటివరకు 5,178 ఎన్‌కౌంటర్లు యూపీలోనే అయినట్లు అక్కడి పోలీసులు తెలిపారు. వీటిలో 103 మంది నేరస్తులు మరణించారు. ఇక తెలంగాణలో గత ఆరేళ్లలో 10 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. అందులో దాదాపు 25 వరకు వ్యక్తులు మరణించారు.

**ఎన్‌హెచ్‌ఆర్సీ ఏం చేస్తుంది?**

ఒకవేళ ఎన్‌హెచ్‌ఆర్సీ విచారణలో ఎన్‌కౌంటర్ బూటకమని తేలితే సదరు బాధిత కుటుంబాలకు రూ.ఒక లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పరిహారం అందించాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తుంది. మిగతా కేసుల్లో వ్యక్తులు, ఇతర సంస్థలు, పరిశ్రమల తప్పిదాల వల్ల మనుషుల ప్రాణాలకు నష్టం వాటిల్లితే.. గరిష్టంగా రూ. 30 లక్షల వరకు అందజేయాలని సిఫారసు చేస్తుంది.

**మనవద్దే.. బూటకపు ఎన్‌కౌంటర్లు..**

2002కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, కర్నూలులో జరిగిన 19 ఎన్‌కౌంటర్లలో 16 బూటకపువేనని ఎన్‌హెచ్‌ఆర్సీ తేల్చిచెప్పింది. ఆయా ఘటనల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది.



**చెట్టుని కూల్చిన వాహనదారునికి రూ.9,500 జరిమానా**

**సాక్షి, హైదరాబాద్:** హరితహారంలో భాగంగా పెరిగి పెద్దదైన చెట్టును తన వాహనంతో ఢీకొట్టి కూల్చివేసిన వాహనదారుడికి రూ. 9,500 జరిమానా విధించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని వైద్య కళాశాల వద్ద హరితహారంలో భాగంగా పెరిగిన చెట్టును తన వాహనంతో రాకేశ్ ఢీ కొట్టడంతో పడిపోయింది. దీన్ని గమనించిన పోలీసులు హరితహారం అధికారి ఐలయ్యకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న ఆయన.. రాకేశ్‌కి జరిమానా విధించారు. హరితహారంలో భాగంగా పెంచుతున్న మొక్కలకు నెలకు లక్షల రూపాయలు వెచ్చించి కాపాడుతున్నామని, వాటికి ఎవరు హాని కలిగించినా జరిమానా చెల్లించాల్సిందేనని ఐలయ్య తెలిపారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు సిద్దిపేటని హరిత సిద్దిపేటగా మార్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. హరితహారం చెట్ల భద్రత విషయంలో ప్రత్యేకంగా సహకరిస్తున్న సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ శాఖ ఉన్నతాధికారులకు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, డీఈలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



**మూగ వేదనకు... స్పందించిన 'ప్రజావాణి'**

**అనంతగిరి:** మూగజీవాలకు వైద్యం అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడిన ఓ రైతు.. లేగ దూడను ఆటోలో తీసుకుని వచ్చి ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ధారూరు మండలం కేరెళ్లికి చెందిన రాములుకు చెందిన ఆవు ఆది వారం లేగ దూడకు జన్మనిచ్చింది.పుట్టిన కొద్ది సేపటికే చెంగున ఎగరాల్సిన దూడ చతికలబడి పేగు లు బయటకు ఉండటంతో రైతు గుండె కదిలిపోయింది. వెంటనే పశు వైద్యాధికారులకు ఫోన్ చేస్తే వారు స్పందించలేదు. సోమవారం ఉదయం ఓ డాక్టర్ వచ్చి పరీక్షించినా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీనితో కలత చెందిన రాములు ట్రాలీ ఆటోలో దూడను తీసుకుని.. కలెక్టరేట్‌కు వచ్చాడు. ప్రజావాణి కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ ఆయేషా మస్రత్ ఖానమ్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో వెంటనే స్పందించిన పశు వైద్య జిల్లా అధికారులు దూడకు వికారాబాద్‌లోని పశువుల ఆస్పత్రికి తరలించి వైద్యం చేసి పంపించారు.

# బంజారాహిల్స్‌లో భారీ చోరీ

**కోటి విలువ చేసే ఆభరణాలతో ఉడాయించిన బిహారీ పనిమనిషి**



**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఓ వ్యాపారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పనిమనిషి ఉన్నదంతా ఊడ్చుకుని పరారయ్యాడు. వివరాలు.. బంజారాహిల్స్ రోడ్ నం 12లోని అంకుర్ ఆస్పత్రి సమీపంలో కపిల్‌గుప్తా అనే వ్యాపారి నివసిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఓ శుభకార్యానికి తన కుటుంబసభ్యులతో కలసి వెళ్లారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున 2.45 గంటలకు ఇంటికి వచ్చారు. ఇంటిలోకి వెళ్లిచూడగా బెడ్‌రూంలో బీరువా తాళాలు పగులగొట్టి ఉండటమే కాకుండా ఆభరణాల బాక్సులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఆందోళన చెందిన బాధితులు వెంటనే బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తమ ఇంట్లో నెలన్నర క్రితం బిహార్‌కు చెందిన రామ్(29) అనే వ్యక్తిని పనిమనిషిగా నియమించుకున్నామని కపిల్‌గుప్తా పోలీసులకు తెలిపారు. కుటుంబసభ్యులంతా పెళ్లికి వెళ్తూ ఇంటి బాధ్యతలను పనిమనిషికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఇదే అదనుగా భావించిన పనిమనిషి రామ్ బీరువాలోని రూ.5.70 లక్షల నగదు, రూ.కోటి విలువ చేసే బంగారు వజ్రాభరణాలను చోరీ చేసి ఇంటికి తాళంవేసి తాళం చెవులను గేటు వద్ద పెట్టి ఉడాయించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో కపిల్‌గుప్తా మేనల్లుడు ఇంటికి వచ్చి డ్రెస్ మార్చుకుని వెళ్లాడు. ఆ తర్వాతే చోరీ జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఇంటిలో సీసీ కెమెరాలు 6 నెలలుగా పనిచేయడం లేదని గుర్తించారు. నిందితుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు సదరు యజమాని తీసుకోలేదు. కనీసం నిందితుడికి సంబంధించిన ఫొటోలు కూడా యజమాని వద్దలేకపోవడంతో దర్యాప్తునకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

### అమరుల స్తూపానికి కాళేశ్వరం జలాలతో అభిషేకం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఏర్పాటు దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా టీఆర్ఎస్ నేతలు కాళేశ్వరం జలాలతో అమరుల స్తూపానికి అభిషేకం చేశారు. డిసెంబర్ 9 ప్రకటనను గుర్తు చేసుకుంటూ రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తన అనుచరులతో కలసి సోమవారం గోదావరిఖని నుంచి గోదావరి నీటితో భారీ ర్యాలీగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కుకు చేరుకున్నారు. ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లుతో కలసి అమరుల స్తూపానికి జలాభిషేకం చేశారు. 'ప్రాణాలకు తెగించి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీక్ష కు దిగడం వల్లే 2009 డిసెంబర్ 9న కేం ద్రం తెలంగాణ ఏర్పాటుపై ప్రకటన చేసింది. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాజెక్టును నిర్మించి గోదావరి నది 365 రోజులు సజీవంగా ఉండేలా చేశారు'అని కోరుకంటి చందర్ అన్నారు.




# లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- ఇద్దరు మృతి, క్లీనర్‌కు తీవ్రగాయాలు
- ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రమాదం



నుజ్జునుజ్జైన బస్సు ముందుభాగం

**కొత్తూరు:** అతివేగంగా వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలోని ఎంఎస్ఎన్ పరిశ్రమ వద్ద సోమవారం చోటుచేసుకుంది. కడప జిల్లా పొద్దుటూరు నుంచి సుమారు 34 మంది ప్రయాణికులతో కార్తీక్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు హైదరాబాద్‌కు బయల్దేరింది. ఎంఎస్ఎన్ పరిశ్రమ వద్ద లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సెంట్రల్ హెల్త్‌స్కీం సంస్థలో విధులు నిర్వహిస్తున్న కర్నూల్ జిల్లా వెలపనూరు గ్రామానికి చెందిన ఎజాజ్ అహ్మద్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన వెంకటసుబ్బయ్య(57) ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. బస్సు క్లీనర్ రాజేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇతన్ని షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికుల్లో కొందరు స్వల్పంగా గాయపడగా డ్రైవర్ హరికుమార్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంపై మృతుడు సుబ్బయ్య కుమారుడు బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

- రూ 67 లక్షల నగదు ఉన్న బ్యాగ్ అపహరణ
- స్పెషల్‌స్క్వాడ్ అంటూ బ్యాగ్‌ను తస్కరించిన దుండగుడు



**నెల్లూరు(క్రైమ్):** చెన్నై వెళుతున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. స్పెషల్‌స్క్వాడ్ అంటూ దుండగుడు రూ.67 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ను తస్కరిం చా డు. పోలీసుల సమాచారం మేరకు ఏపీలోని ప్రకాశం జిల్లా కల్లవారిపాలెంకు చెందిన జి. సుబ్బారెడ్డి చెన్నై నుంచి బంగారు ఆభరణాలను తీసుకువచ్చి విక్రయించేవాడు. క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాల నేపథ్యంలో ఆభరణాల కోసం తన వద్దనున్న రూ.17 లక్షలతో పాటు నలుగురు స్నేహితుల వద్ద రూ.50 లక్షలు సమీకరిం చుకున్నాడు. చెన్నై వెళ్లేందుకు ఆదివారం రాత్రి ఒంగోలులో సర్కార్ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగిలో ఎక్కాడు. సోమవారం తెల్లవారు జామున రైలు నెల్లూరుకు చేరుకుంటుండగా నిద్రలోకి జారుకున్నాడు. నెల్లూరులో ఓ గుర్తు తెలియని వ్యక్తి జనరల్ బోగిలో ఎక్కి తాను స్పెషల్ స్క్వాడ్‌నని అందరినీ నమ్మించాడు. రైలు బయలుదేరుతుండగా నగదు ఉన్న బ్యాగ్‌ను తీసుకుని దిగిపోయాడు. తర్వాత నిద్రనుంచి తేరుకున్న సుబ్బారెడ్డి బ్యాగ్ కనిపించకపోవడంతో అంతా వెతికాడు. సఫారీ సూటువేసుకున్న ఓ వ్యక్తి నగదు బ్యాగ్‌ను పట్టుకెళ్లాడని ప్రయాణికుల ద్వారా తెలుసుకుని గూడూరులో రైలు దిగి నెల్లూరుకు చేరుకుని రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీ జరిగిన తీరు, ప్రయాణికులు చెప్పిన ఆనవాళ్ల ప్రకారం నిందితుడు రైల్వే పోలీసేనని గ్రహించి పోలీసులను నిలదీసినట్లు తెలిసింది. విషయాన్ని ఉన్నతాధికారులు, మీడియా దృష్టికి తీసుకెళతానని హెచ్చరించాడు. దీంతో పోలీసులు విచారణ వేగవంతం చేసి నిందితుడు ఓ ఉన్నతాధికారి డ్రైవర్‌గా గుర్తించినట్లు సమాచారం. అతని నుంచి నగదు రికవరీ చేసి అప్పటికప్పుడు సుబ్బారెడ్డికి ఇచ్చి ఈ విషయం గోప్యంగా ఉంచాలని కోరినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా అలాంటిదేమి లేదని, ఒట్టి ప్రచారమేనని కొట్టిపారేశారు. కేసు నమోదు చేసి నిందితుని కోసం గాలిస్తున్నామని వెల్లడించారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.